fb.com/vaartha Digital
WWW.VAARTHA.COM
epaper.vaartha.com
తాడేపల్లిగూడెం
Published from Tadepalligudem,Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

16-7-2025
బుధవారం సంపుటి: 31
సంచిక: 165 పేజీలు: 10+4 వెల: 6.50



# అంతరిక్షం నుంచి క్షేమంగా అవనిపైకి..

- కాలిఫోర్నియా తీరంలో ల్యాండ్ అయిన శుక్లా బృందం క్యాప్సూల్
- దాదాపు 18 రోజులు ఐఎస్ఎస్‌లో పరిశోధనల్లో పాల్గొన్న శుభాంశు, మరో ముగ్గురు వ్యోమగాములు
- అంతర్జాతీయ స్పేస్ సెంటర్‌లోకి ప్రవేశించిన తొలి భారతీయుడిగా శుక్లా రికార్డ్
- ఏడు రోజుల క్వారంటైన్‌కు ఆ నలుగురు
- గగన్‌యాన్‌కు దారివేసిన శుక్లా: ప్రధాని మోడీ అభినందనలు
- కుమారుడు క్షేమంగా తిరిగిరావడంతో తల్లిదండ్రుల ఆనందబాష్పాలు

**న్యూయార్క్, జూలై 15:** అంతరిక్ష యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని భారత్ కీర్తి పతాకాన్ని సమున్నతంగా ఎగరేసిన మన ముద్దుబిడ్డ శుభాంశు శుక్లా పుడమికి తిరిగొచ్చాడు. శుక్లాతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములతో ఐఎస్ఎస్ నుంచి బయల్దేరిన క్రూ డ్రాగన్ ది213 గ్రేస్ క్యాప్సూల్ మంగళ వారం మధ్యాహ్నం 3.01 గంటలకు కాలిఫోర్నియా తీరంలో సురక్షితంగా ల్యాండ్ అయింది. జూన్ 26, 2025న భారత్ వైమానిక దళ టెస్ట్ పైలట్ గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా >>2

# సత్వరమే నిధులు మంజూరు



మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసిన సిఎం చంద్రబాబు. చిత్రంలో కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని, ఎంపిలు

## రాష్ట్రానికి సాయం పెంచి ఆదుకోవాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరిన సిఎం చంద్రబాబు

### వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ

### పోలవరం, బనకచర్ల వివరాలు తెలిపిన ముఖ్యమంత్రి

**విజయవాడ,జూలై15,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్రహోం మంత్రి అమిత్ షాతో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భేటీ అయ్యారు. రాష్ట్ర ప్రాజెక్టులు, నిధులపై ఇరువురు నేతలు చర్చించారు. ముందుగా మాజీ కేంద్రమంత్రి టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతి రాజును గవర్నర్‌గా నియమించడంపై హోంమంత్రికి, కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం ధన్యవాదాలు తెలియచేశారు. అనంతరం రాష్ట్రానికి చెందిన పలు అంశాలపై అమిత్ షాతో ముఖ్యమంత్రి చర్చలు జరిపారు. రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టులకు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థిక సాయం అందించే అంశాలపై సీఎం హోం మంత్రికి వివరించారు. గత ఏడాదిగా క్లిష్టమైన పరిస్థితుల్లో రాష్ట్రానికి అండగా నిలిచినందుకు ధన్యవాదాలు తెలియచేసిన ముఖ్యమంత్రి కేంద్రసహకారంతో ధ్వంసమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నామని తెలియచేశారు. అయితే ఇప్పటికీ ఆర్థిక వనరుల పరంగా తీవ్రమైన కొరతను ఎదుర్కొంటున్న ఏపీకి కేంద్రం నుంచి మరింతగా సహకారం అందించే అంశాన్ని సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. విభజన వల్ల ఏపీ ఎదుర్కొన్న ఆర్థిక నష్టాన్ని పరిగణనలోకి తీసుకుని నిధుల కేటాయింపులు చేసేలా చూ డాలని 16వ ఆర్థిక సంఘానికి నివేదించామని >>2

## హంద్రీ నీవా ఫేజ్-1

# కాలువల విస్తరణ పూర్తి

### 3,850 క్యూసెక్కులకు పెరిగిన సామర్థ్యం

### వంద రోజుల్లో లక్ష్యాన్ని పూర్తి చేసిన సర్కార్

### తీరనున్న సీమ తాగు, సాగునీటి కష్టాలు



**గుంటూరు,జులై 15,ప్రభాతవార్త ప్రతినిధి:** కూటమి ప్రభుత్వం చొరవ, వేగవంతమైన నిర్ణయాలు రాయ లసీమకు జలసిరులు తెచ్చాయి. హంద్రీనీవా ఫేజ్1 కాలువల విస్త రణ పనులు పూర్తి కావటంతో సీమ జిల్లాలు సస్యశ్యామలం కానున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 17వ తేదీన నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద విస్తరణ పూర్తైన హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేయనున్నారు. ముందు ప్రకటించినట్టుగానే వంద రోజుల్లో ఈ కాలువ విస్త రణ పనుల లక్ష్యాన్ని కూటమి ప్రభుత్వం పూర్తి చేసింది. రూ.696 కోట్లతో చేపట్టిన ఈ విస్తరణ పనులతో హంద్రీనీవా ఫేజ్ 1 కాలువ ప్రవాహ సామర్థం 3850 క్యూసెక్కులకు పెరిగింది. రాయల సీమకు తాగు, సాగునీరివ్వాలన్న సంకల్పంతో రోజువారీ టార్గెట్లు పెట్టి మరీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఫేజ్ 1, ఫేజ్ 2 కాలువ పనుల్ని పరుగులు పెట్టించారు. ప్రస్తుతం ఫేజ్ 1 కాలువ విస్తరణ పనులతో అదనంగా 1600 క్యూసెక్కుల మేర నీటిని తరలించేందుకు అవకాశం కలిగింది. దీంతో జీడిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి సామర్థంతో నీటిని నింపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. తద్వారా కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో ఆయకట్టుకు సాగునీరు, 33 లక్షల మంది ప్రజలకు దాహార్తిని తీర్చేలా కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేసింది. మల్యాల నుంచి జీడిపల్లి వరకూ 216 కిలోమీటర్ల మేర హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు పూర్తి కావటంతో జీడిపల్లి, కృష్ణగిరి, పత్తికొండ, గాజులదిన్నె సహా స్థానికంగా రాయలసీమ జిల్లాల్లోని చెరువులను కూడా నీటితో నింపనున్నారు. దీంతో సీమ జిల్లాల్లో భూగర్భజలాలు >>2



## హైకోర్టు జడ్జిగా

# బి.దేవానంద్

### మద్రాసు హైకోర్టు నుండి బదలీకి రాష్ట్రపతి ఆమోదం

**విజయవాడ.జూలై15,ప్రభాతవార్తప్రతినిధి:** జస్టిస్ బట్టు దేవానంద్ ఏపీ హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఆయన మద్రాస్ హైకోర్టు నుంచి మళ్ళీ ఏపీ హైకోర్టుకు వచ్చేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ఆమోద ముద్ర వేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర న్యాయశాఖ సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ దేవానంద ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా త్వరలో ప్రమాణం చేయించనున్నారు. ఏపీ హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తుల నియామకానికి ఆమోద మున్న విషయం తెలిసిందే. జస్టిస్ బట్టు దేవానంద్ రాకతో ఏపీహైకోర్టులో న్యాయ మూర్తుల సంఖ్య 29కి చేరుతుంది. ఏపీహైకోర్టులో ఆయన4వ స్థానంలో >>2

## ఐటి, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లలో

# 10లక్షల ఉద్యోగాలు

### ఆ దిశలో కంపెనీల ఏర్పాటుకు చర్యలు

### మరింత సులభంగా 'మనమిత్ర' సేవలు

### రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో 95 సంస్థలు

### సమీక్షలో మంత్రి లోకేష్



మంగళవారం ఐటి, ఎలక్ట్రానిక్స్, జిసిసి, డేటా సెంటర్లపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి నారా లోకేష్

**విజయవాడ,జూలై15,ప్రభాతవార్తప్రతినిధి:** రాబోయే నాలుగేళ్లలో ఐటి, ఎలక్ట్రానిక్స్, డాటా సెంటర్లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ (జిసిసి) ద్వారా 10లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా అధికార యంత్రాంగం పనిచేయాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. ఐటి, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజిఎస్ శాఖల ఉన్నతాధికారులతో ఉండవల్లి నివాసంలో మంత్రి లోకేష్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఐటి, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జిసిసి), డాటాసెంటర్ల ఏర్పాటుకు ఇప్పటివరకు 95 ప్రముఖ సంస్థలు లక్షకోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయని, ఆ సంస్థలు త్వరితగతిన తమ యూనిట్లను ఏర్పాటు చేయడానికి అవసరమైన అనుమతులు, ఇతర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ప్రతిష్టాత్మక సంస్థలైన టిసిఎస్, కాగ్నిజెంట్ సంస్థలకు విశాఖలో ఇప్పటికే భూకేటాయింపులు పూర్తిచేశామని అధికారులు తెలిపారు. ఆ సంస్థలు సాధ్యమైనంత త్వరగా కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఇటీవల తమ బెంగళూరు పర్యటనలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జిసిసి)ల ఏర్పాటుకు ఎఎన్‌ఎస్ఆర్, సత్వ సంస్థలు ఎంఓయులు కుదుర్చుకున్నాయని, ఈ రెండింటి ద్వారానే యువతకు 35వేల ఉద్యోగాలు రానున్నాయని చెప్పారు. ఎంఓయులు చేసుకున్న సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ యూనిట్లు ఏర్పాటు చేసేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని తెలిపారు. రాష్ట్రానికి వచ్చే చిన్న సంస్థల కోసం 26 జిల్లా కేంద్రాల్లో కో వర్కింగ్ స్పేస్ సిద్ధం చేయాలని సూచించారు.

**త్వరలోనే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్:** రాష్ట్రంలో నవీన ఆవిష్కరణలు, స్టార్టప్‌ల ప్రోత్సాహానికి తలపెట్టిన రతన్ టాటా ఇన్నోవే >>2

# ఎబివిపై చర్యలు నిలిపివేత

**విజయవాడ,జూలై15,ప్రభాతవార్తప్రతినిధి:** పదవీ విరమణచేసిన మాజీ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఇంటెలిజెన్స్) ఎబి వెంకటేశ్వరరావుపై నమోదైన క్రిమినల్ ప్రొసీడింగ్స్ పై చర్యలను >>2

# ఎంపి మిథున్ రెడ్డికి హైకోర్టులో చుక్కెదురు

### మద్యం ముడుపుల కేసు



**విజయవాడ.జూలై15,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీపీ ఎంపీ మిథున్ రెడ్డికి హైకోర్టులో చుక్కెదురైంది. మద్యం ముడుపుల కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని మిథున్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ ని కొట్టేస్తూ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ దశలో ముందస్తు బెయిల్ ఇవ్వలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. మద్యం ముడుపుల కేసులో ఎంపీ మిథున్ రెడ్డి ఏ4 నిందితుడిగా ఉన్నారు. మద్యం ఆర్డర్లు, సరఫరా వ్యవస్థ గతంలో ఆన్‌లైన్ పద్ధతి ద్వారా పారదర్శకంగా ఉండేదని, దీనిని మాన్యువల్ విధానంలోకి తీసుకురావడంతో ఎంపీ మిథున్‌రెడ్డి (ఏ4) కీలక పాత్ర పోషించారని సీఐడీ/సిట్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హైకోర్టులో వాదనలు వినిపించారు. ముడుపులు అందిన కంపెనీలకే మద్యం సరఫరా అనుమతులిచ్చారని లూథ్రా తెలిపారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం వల్ల రాష్ట్ర ఖజానాకు రూ.3,500 కోట్ల నష్టం జరిగిందని అన్నారు. ఆ సొమ్మును మళ్లించడంలో మిథున్‌రెడ్డి ప్రధాన పాత్ర పోషించారని మద్యం కుంభకోణానికి వ్యూహరచన చేసిన నాటి నుంచి దానిని అమలు చేసే వరకు మిథున్‌రెడ్డి కీలక వ్యూహకర్తగా వ్యవహరించారంటూ సాక్షులు వాంగ్మూలం ఇచ్చినట్లు వాదనలు వినిపించారు. ఇంకా దానికి సంబంధించిన ఆధారాలు లభించాయని వివరిం చారు. మిథున్ రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారిస్తే >>2



మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులను కలిసిన టిడిపి బృందం

## వలసదారులు, వృద్ధుల

# చేర్పు కోసం ప్రత్యేక చర్యలు

### కేంద్ర ఎన్నికల కమిషన్‌కు టిడిపి వినతి

### ప్రత్యేక యాప్ ద్వారా ఓటరు సవరణ చేయాలి

**విజయవాడ.జూలై15,ప్రభాతవార్తప్రతినిధి:** భారత ఎన్నికల సంఘం తీసుకువస్తున్న సంస్కరణలపై పలు కీలకమైన సూచనలని తెలుగుదేశం పార్టీ చేసింది. ఈసీతో ఇవాళ(మంగళవారం, జులై 15) ఆరుగురు సభ్యుల టీడీపీ బృందం ఢిల్లీలో భేటీ అయింది. టీడీఎల్పీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు నేతృత్వంలో సీఈసీ జ్ఞానేశ్వరకుమార్, ఈసీలు డాక్టర్ సుఖ్బీర్ సింగ్,వివేక్ జోషిలను టీడీపీ నేతలు కలిశారు. కేంద్ర ఎన్నికల సంఘానికి ఓ లేఖను టీడీపీ బృందం అందజేసింది. ఈవీఎంలపై ఓటర్ల జాబితా పరంగా టీడీపీ నేతలు కీలక సూచనలు చేశారు. సీజీఏ ఆధ్వర్యంలో వార్షిక తృతీయ పక్ష ఆడిట్ నిర్వహించింది. పార్టీలు, ఎన్నికల విధానాల్లో మార్పులతో పాటు పలు అంశాలపై చర్చించింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలతో అన్ని పార్టీల సూచనలు తీసుకుంటున్నామని ఈసీ తెలిపింది. బీహార్‌లో ఈసీ సంస్కరణలను టీడీపీ బృందం స్వాగతించింది. గంట సేపు కేంద్ర ఎన్నికల కమిషనర్‌లతో టీడీపీ నేతలు చర్చించారు. ఆగస్టు జనవరి మధ్య ఏపీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ జరుగనుందని సీఈసీ తెలిపారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందించాలని లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. అపోహలకు చోటులేకుండా సంస్కరణలు అమలుచేయాలని సూచించారు. ప్రత్యేక యాప్ ద్వారా ఓటరు జాబితా సవరణ చేయాలని శ్రీకృష్ణదేవరాయలు కోరారు. ఏఐ ఆధారిత టూల్స్‌తో డూప్లికేట్, మరణించిన ఓటర్లని గుర్తించాలి. ఇపిఐసీ నంబర్లలో డూప్లికేట్ల తొలగింపు, ఆధార్‌తో క్రాస్ వెరిఫికేషన్ ,సరికొత్త బయోమెట్రిక్ పద్ధతికి మార్పు సూచన బీఎల్‌ఏలకు చురుకైన పాత్ర కల్పించాలి. బూత్ లెవెల్ ఏజెంట్లకు డ్రాఫ్ట్ రోల్స్ ముందుగానే ఇవ్వాలి. అన్ని గుర్తింపు పొందిన పార్టీలకు సమాన హక్కులు ఉండాలి. పబ్లిక్ యాక్సెస్, పారదర్శకతకు బలమైన పిలుపు. జిల్లా వారీగా డాటా విడుదల చేయాలి. ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపుల వివరాలు వెల్లడించాలని సూచించారు ప్రజల ఫిర్యాదుల కోసం రియల్ టైం డ్యాష్‌బోర్డు ఏర్పాటు. చట్టపరమైన సంస్కరణలు అవసరం. బ్లాక్ లెవెల్ ఆఫీసర్లు, డిస్ట్రిక్ట్ అధికారుల నిర్లక్ష్యానికి శిక్షలు విధించాలి. రాష్ట్రస్థాయిలో అంబుడ్స్‌మెన్ నియామకం చేయాలి. ఓటర్లుగా వలసదారులు, ఆదివాసీలు, వృద్ధుల చేర్పు కోసం >>2

# నేటి ప్రగతికి బీజం పివి వేసినదే



మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన పివి స్మారక సదస్సులో పాల్గొన్న సిఎం చంద్రబాబు

### ఆయన 17 భాషలు మాట్లాడేవారు..

### నేడు దేశంలో ఒక భాషపైనే చర్చ సాగుతోంది..

### ఢిల్లీలో 'ది లైఫ్ అండ్ లెగసీ ఆఫ్ పివి' సదస్సులో సిఎం చంద్రబాబు

### భారత్ ప్రధానుల మ్యూజియంలో సదస్సు

**విజయవాడ,జూలై15,ప్రభాతవార్తప్రతినిధి:** చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ఢిల్లీలోని భారత ప్రధానుల మ్యూజియం, లైబ్రరీ ప్రాంగణంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు స్మారకోపన్యాస సదస్సు జరిగింది. ద లైఫ్ అండ్ లెగసీ ఆఫ్ పీవీ నరసింహారావు పేరుతో కేంద్ర సాంస్కృతిక శాఖ ఈ సదస్సు నిర్వహించింది. ఇప్పటి వరకు ఐదుగురు మాజీ ప్రధానులకు సంబంధించిన స్మారకోపన్యాస సదస్సులు నిర్వహించిన కేంద్ర సాంస్కృతిక శాఖ ఆరో సదస్సుగా పీవీ నరసింహారావు స్మారకోపన్యాస సదస్సు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాజకీయాల్లోకి యువత రావాల్సిన అవసరం ఉంది. చదువుకున్న యువత రాజకీయాల విషయంలో విముఖత ప్రదర్శిస్తున్నారు. ఇది సరైనది కాదు. నేను యువకులైన మంచి రాజకీయ నేతల గురించి వెతుకుతున్నాను. యువత అంతా ఆల్ ఇండియా సర్వీసెస్, బిజినెస్, మంచి ఉద్యోగం.. మంచి కెరీర్ అంటున్నారు. కానీ మంచి ఉద్దేశ్యాలు మంచి భావాలు కలిగిన యువత రాజకీయాల్లోకి రావాలి, అప్పుడే దేశానికి మంచి లీడర్‌షిప్ వస్తుంది. పబ్లిక్ పాలసీలు రూపొందించేది రాజకీయ నాయకులే బ్యూరోక్రాట్లు కాదు. ప్రజలకు మంచి చేసేలా విధానాలు రూపకల్పన చేయాలంటే రాజకీయ నేతల వల్లనే సాధ్యం. ఈ విషయాన్ని యువతరం గుర్తుంచుకోవాలి. టీడీపీ దేశంలోనే యంగెస్ట్ పార్టీ.. టీడీపీలో చాలా మంది యువకులు.. చదువుకున్న వారు ప్రజా ప్రతినిధులుగా ఉన్నారు." అని చంద్రబాబు చెప్పారు. అనేక పార్టీలను ఒప్పించి పీవీ ఆర్థిక సంస్కరణలు తెచ్చారని చంద్రబాబు అన్నారు. దేశంలో లైసెన్స్ రాజ్ విధానానికి స్వస్తి చెప్పారు. పెట్టుబడిదారులు సులభంగా వచ్చేలా చర్యలు తీసుకున్నారు. దేశంలో పారిశ్రామిక పురోగతికి బాటలు వేశారు. పీవీ తీసుకున్న చర్యలవల్లే ఐటీ విప్లవం వచ్చింది. తెలుగు రాష్ట్రాల స్ఫూర్తితో వేళ్లనుకున్న పి.వి.నరసింహారావు తనకు మధ్య ఉన్న స్నేహపూర్వకమైన, గౌరవప్రదమైన సంబంధాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేసుకున్నారు. ఆయన సమతుల్యత రాజకీయ పరిణతికి ఒక ప్రకాశవంతమైన ఉదాహరణ అని ఆయనను అభివర్ణించారు. ఆయన మన గొప్ప దేశం యొక్క విధిని పునర్నిర్మించిన నిజమైన తెలుగు బిడ్డ."శ్రీ పి.వి. నరసింహారావు అసాధారణ మేధస్సు అద్భుతమని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు కొనియాడారు. పీవీ నరసింహారావు బహుభాషలలో ప్రావీణ్యం సంపాదించారు >>2

# క్షేమంగా అవనిపైకి..

>> అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో అడుగుపెట్టి చరిత్ర సృష్టించారు. 39 ఏళ్ల వయసున్న శుక్లా ఐఎస్ఎస్‌కు వెళ్లిన తొలి భారతీయుడిగా, 634వ వ్యోమగామిగా ఘనత పొందారు. మరో ప్రత్యేకత ఏంటంటే 41 ఏళ్ల తర్వాత అంతరిక్షంలోకి వెళ్లిన మొదటి భారతీయుడూ ఆయనే. రాకేశ్ శర్మ తర్వాత అంతరిక్ష యాత్రలో పాల్గొన్న రెండో భారతీయుడిగా శుక్లా రికార్డుకెక్కారు. యాక్సియమ్ 4 మిషన్‌లో భాగంగా ఫాల్కన్9 రాకెట్‌ను జూన్ 25న అంతరిక్షంలోకి ప్రయోగించారు. ఈ మిషన్‌లో శుభాంశు శుక్లాతో పాటు పెగ్గీ విట్సన్, స్లావోస్ ఉజ్నాన్స్‌కీవిస్నియెస్కీ, టిబోర్ కాపు పాల్గొన్నారు. భూమి చుట్టూ 28 గంటల ప్రయాణం తర్వాత వ్యోమగాములు బయల్దేరిన స్పేస్‌క్రాఫ్ట్ ఐఎస్ఎస్‌కు డాక్ అయింది. జూన్ 26న ఐఎస్ఎస్‌కుచేరుకున్న ఈ నలుగురు వ్యోమగాములు అమెరికా, భారతదేశం, పోలాండ్, హంగేరీ, సౌదీ అరేబియా, బ్రెజిల్, నైజీరియా, గ్రీస్, యూరప్ అంతటా ఉన్న దేశాలతో సహా 31 దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తూ మైక్రోగ్రావిటీలో దాదాపు 60 శాస్త్రీయ అధ్యయనాలు, వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించారు. వాటిలో భారతదేశం ఇస్రో ద్వారా ఏడు కీలక అధ్యయనాలను ఈ మిషన్‌కు అందించింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో 18 రోజుల పాటు విస్తృత పరిశోధనలు జరిపిన అనంతరం నిన్న అంటే జూలై 14న సాయంత్రం 4:45 గంటలకు ఐఎస్ఎస్‌తో డ్రాగన్ ది213 గ్రేస్ క్యాప్సూల్ అన్‌డాకింగ్ ప్రక్రియ నిర్వహించారు. పలు ఆర్బిటల్ ప్రక్రియల అనంతరం ఇవాళ మధ్యాహ్నం 3.01 గంటలకు కాలిఫోర్నియా తీరంలో క్రూ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ ల్యాండ్ అయింది. వెంటనే శుక్లాతో పాటు పెగ్గీ విట్సన్, స్లావోస్ ఉజ్నాన్స్‌కీ విస్నియెస్కీ, టిబోర్ కాపు వ్యోమగాములను ఏడు రోజుల పాటు క్వారంటైన్‌కు తరలించనున్నారు. అంతరిక్షంలో భారరహిత స్థితిని అనుభవించిన కారణంగా భూమిపైకి దిగిరాగానే ఇక్కడి వాతావరణానికి వారి శరీరాలు అలవాటు పడేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఇస్రో పేర్కొంది. అందుకోసం వారం రోజుల పాటు రిహాబిలిటేషన్ సెంటర్‌లో ఉంచనున్నట్లు తెలిపింది. ఇస్రోకు చెందిన వైద్యాధికారులు వ్యోమగాముల ఆరోగ్యం, ఫిట్‌నెస్ నిరంతరం పర్యవేక్షిస్తారని వివరించింది.

**చరిత్ర సృష్టించిన శుక్లా: ప్రధాని మోదీ**



అంతరిక్షం నుంచి భూమికి తిరిగి వచ్చిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాను ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించిన భారతదేశపు మొట్టమొదటి వ్యోమగామిగా శుభాంశు శుక్లా కొత్త చరిత్ర సృష్టించారు. తన అంకితభావం, ధైర్యం మార్గదర్శక స్ఫూర్తి ద్వారా బిలియన్ల కలలను నిజం చేశారు. ఇది భారత మానవ అంతరిక్ష విమాన మిషన్ – గగన్‌యాన్ వైపు మరో మైలురాయిని సూచిస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రధాని ఎక్స్ వేదికగా తన అధికారిక అకౌంట్‌లో పోస్ట్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాంశు శుక్లాను అభినందిస్తూ. చారిత్రాత్మక మిషన్ నుండి భూమికి తిరిగి వస్తున్న గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాను యావత్ దేశంతో పాటు నేను స్వాగతిస్తున్నాను. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించిన భారతదేశపు మొట్టమొదటి వ్యోమగామిగా, ఆయన తన అంకితభావం, ధైర్యం మరియు మార్గదర్శక స్ఫూర్తి ద్వారా బిలియన్ల కలలను ప్రేరేపించారు. ఇది మన స్వంత మానవ అంతరిక్ష విమాన మిషన్ – గగన్‌యాన్ వైపు మరో మైలురాయిని సూచిస్తుందని అన్నారు.

**భగవంతునికి కృతజ్ఞతలు: తల్లిదండ్రులు**



ఐఎస్ఎస్ నుంచి గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాతో పాటు యాక్సియమ్4 సిబ్బంది సురక్షితంగా భూమికి తిరిగి వచ్చిన క్షణాల్లో భావోద్వేగాలు ఉప్పొంగాయి. పసిఫిక్ మహాసముద్రంలో విజయవంతంగా స్ప్లాష్‌డౌన్ అయిన వార్తకు స్పందించిన శుక్లా తల్లి ఆశా శుక్లా కన్నీళ్లు పెట్టుకున్నారు. చాలా రోజుల తర్వాత తన కొడుకు సురక్షితంగా పుడమికి చేరుకోవడంపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు. తన కుమారుడు శుక్లా పైలట్‌గా వ్యవహరించిన యాక్సియమ్4 మిషన్ విజయంపై ఆమె మాట్లాడారు. మొదట్లో నాకు భయం వేసింది. అయితే ఇప్పుడు నాకు చాలా గర్వంగా ఉంది. రాబోయే తరం కూడా ప్రేరణ పొంది ముందుకు సాగాలని అన్నారు. ఈ క్రమంలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి యాక్సియమ్4 సిబ్బంది భూమికి చేరుకున్న తరుణంలో లైవ్ ఈవెంట్‌ను కవర్ చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.నా కొడుకు సురక్షితంగా పుడమికి తిరిగి వచ్చాడు. ఐ థ్యాంక్ టూ గాడ్. ఈ లైవ్ ఈవెంట్‌ను కవర్ చేసిన వారందరికీ కృతజ్ఞతలు. నా కొడుకు భూమికి చేరుకున్న క్షణంలో నేను భావోద్వేగానికి గురయ్యాను. ఎందుకంటే చాలా రోజుల తర్వాత నా బిడ్డ భూమికి తిరిగి వచ్చాడని ఆమె విలేకరులతో అన్నారు.

# నేటి ప్రగతికి బీజం పివి వేసినదే

>> అని వ్యాఖ్యానించారు, ఇది భారతదేశ గొప్ప సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తుంది. భాష చర్చనీయాంశంగా మారుతున్న నేటి సం దర్భంలో రావు జీవితంలోని ఈ అంశం ప్రేరణగా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆర్థిక సరళీకరణకు ముందు తరువాత భారతదేశం యొక్క సామాజికఆర్థిక మరియు రాజకీయ సవాళ్లను ఎదుర్కొన్న ప్రత్యక్ష అనుభవం ఉన్న అరుదైన నాయకులలో రావు కూడా ఉన్నారని ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు. "ఒక వినయపూర్వకమైన వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఆయన చిన్నప్పటి నుంచీ అసాధారణమైన ప్రతిభను ప్రదర్శించారు. ఆయన విద్యార్థి నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు మరియు గొప్ప పండితుడు" అని ఆయన అన్నారు. పీవీ తెచ్చిన సంస్కరణలను వాజ్‌పేయీ కొనసాగించారు.వాజ్‌పేయీ హయాంలో హైవేలు, ఎయిర్‌పోర్టులు, పోర్టులువచ్చాయని చంద్రబాబు అన్నారు.2014లో మోదీ కూడా అనేక సంస్కరణలు తెచ్చారని చెప్పారు.మోదీ హయాంలో భారత్ పేరు ప్రపంచవ్యాప్తంగా మారుమోగుతోంది.. అనేక దేశాలతో మోదీ మంచి సంబంధాలు కొనసాగిస్తున్నారు.సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్.. సబ్ కా విశ్వాస్ పేరుతో ముందుకెళ్తున్నాం.. ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచాం. యువత ఆశలు, ఆకాంక్షల సాధనకు మోదీ కృషి చేస్తున్నారు. వికసిత్ భారత్ పిలుపుతో దేశ రూపురేఖలు మారుతున్నాయి. ప్రపంచం ఎదుర్కొనే అనేక సమస్యలకు మనం పరిష్కారం చూపిస్తున్నాం.. మోదీ సంస్కరణల వల్ల దేశం వేగంగా అభివృద్ధి చెందుతోంది. అని చంద్రబాబు చెప్పారు. 2014లో దేశానికి ఓ మలుపు వచ్చింది. ప్రధాని నరేంద్ర మోదీ డిజిటల్ ఇండియా, మేకిన్ ఇండియా, స్టార్టప్ ఇండియా ఆత్మనిర్భర్ భారత్ వంటి కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ధైర్యంగా, లక్ష్యంతో ముందుకు సాగుతోంది. 2028 నాటికి జర్మనీని దాటి భారత దేశం ఆర్థిక వ్యవస్థలో మూడో స్థానానికి చేరనుంది. ఆర్థిక స్థిరత్వం, జాతీయతా భావం పెంపొందడం, అంతర్జాతీయంగా భారతదేశానికి గౌరవం దక్కడం వంటివి మోదీ నాయకత్వంలో సాధ్యమయ్యాయి. ప్రపంచ బ్యాంక్ లెక్కల ప్రకారం గత దశాబ్దంలో 17 కోట్ల మందికిపైగా ప్రజలు తీవ్రమైన పేదరికం నుండి బయటపడ్డారు ఆపరేషన్ సింధూర్ ద్వారా మోదీ టెర్రరిస్టులకు ధీటుగా సమాధానం చెప్పారు. ఇండియా సత్తా చాటారు. పబ్లిక్ పాలసీలు ప్రజల కోసం తేవాలి. నరేంద్ర మోదీ తెస్తున్న సంస్కరణలు ప్రజల కోసం.. ప్రజల మధ్య అసమానతలు తగ్గించేలా ఉన్నాయి. రైట్ లీడర్.. రైట్ టైమ్.. రైట్ ప్లేసులో ఉన్నారు. మోదీ సారథ్యంలో వివిధ రంగాల్లో భారతదేశం ప్రపంచంలో అగ్ర భాగాన నిలుస్తోంది. సంస్కరణలు తేవడం ద్వారా పీవీ దేశానికి దిశ చూపారు. వాజ్‌పేయీ బలమైన పునాదులు వేశారు. మోదీ దేశానికి ఊపు ఇచ్చారు." అని చంద్రబాబు చెప్పారు. ప్రజలు.యువత ఆలోచనలు ఎప్పుడూ దేశాభివృద్ధి దిశగానే ఉండాలి. నేను చాలామంది నేతలను చూశాను. రాజకీయ నేతల్లో దూరదృష్టి కలవారు ఉన్నారు. సమర్థులు ఉన్నారు.. విధ్వంసకారులూ ఉన్నారు. ఎవరిని నమ్మాలి.. ఎవర్ని ఎన్నుకోవాలి.. భారతదేశ అభివృద్ధి కోసం ఎవరికి సహకరించాలనే దానిపై అందరూ ఆలోచన చేయాలి. స్మార్ట్ వర్క్ చేయాలి.. టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. క్వాంటం మిషన్ కేంద్రం ప్రారంభించింది. సిలికాన్ వ్యాలీ అమెరికాకు ఉంది.. మనకు క్వాంటం వ్యాలీ ఎందుకు ఉండకూడదనే ఉద్దేశ్యంతో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నాం. సంపద సృష్టించాలి.. దాన్ని పేదలకు పంచాలి. ప్రపంచంలో మన దేశానికి ప్రత్యేకత ఉంది. మన సంస్కృతి మన గొప్పదనాన్ని చాటుతుంది, అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో భారత ప్రధానుల మ్యూజియం, లైబ్రరీ కమిటీ ఛైర్మన్ సహా ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును సన్మానించేందుకు పీవీ కుమారుడు, మనవడు వేదిక మీదకు రాగా.. తనకు కాదని.. మీకే సన్మానం చేయాలంటూ చంద్రబాబు వారికి శాలువాలు వేశారు.

# హంద్రీ నీవా ఫేజ్-1 కాలువల విస్తరణ పూర్తి

>> గణనీయంగా పెరిగేందుకు ఆస్కారం కలిగింది. 12 ఏళ్ల తర్వాత మళ్లీ 40 టీఎంసీలుగతంలో హంద్రీనీవా ఫేజ్ 1 కాలువ పూర్తి సామర్థ్యం 2,200 క్యూసెక్కులు మాత్రమే ఉండటంతో ఇప్పటి వరకూ 12 సార్లు మాత్రమే వరద సమయంలో 40 టీఎంసీల నీటిని వినియోగించుకున్న పరిస్థితి. ప్రస్తుతం కాలువల సామర్థ్యం 3,850 క్యూసెక్కులకు పెరగటంతో ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం మేరకు 40టీఎంసీల వరద జలాలను ఈ ఏడాదిలో రాయలసీమ జిల్లాలకు వినియోగించుకునే అవకాశం కలగనుంది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు శరవేగంగా హంద్రీనీవా కాలువ ఫేజ్ 1 విస్తరణ పనుల్ని జలవనరుల శాఖ పూర్తి చేసింది. నెలకు దాదాపు 4.27 టీఎంసీల చొప్పున నాలుగు నెలల వరద కాలంలో అదనంగా 17.10 టీఎంసీల నీటిని తీసుకునేందుకు అవకాశం ఈ విస్తరణ పనుల ద్వారా కలిగింది. దీంతో హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టుకు కేటాయించిన 40 టీఎంసీల నీరు కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల తాగు, సాగునీటి కష్టాల్ని తీర్చనున్నాయి. హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్ 1 ద్వారా నంద్యాల జిల్లాలో 2906 ఎకరాలు, కర్నూలు జిల్లాలో 77,094 ఎకరాలు, అనంతపురం జిల్లాలో 1,18,000 ఎకరాల ఆయకట్టుకు నీరు అందనుంది. ఫేజ్ 2 ప్రాజెక్టులో భాగంగా అనంతపురం జిల్లాలో మరో 2.27 లక్షల ఎకరాలు, కడప జిల్లాలో 37,500 ఎకరాలు, చిత్తూరు జిల్లాలో 1.40 లక్షల ఎకరాల మేర ఆయకట్టుకు నీరు అందనుంది. మొత్తంగా ఫేజ్ 1, ఫేజ్ 2 ద్వారా 6 లక్షల పైచిలుకు ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందనుంది. కూటమి వచ్చాకే మళ్లీ హంద్రీనీవా పనులు201419లో రూ.4,317 కోట్లకు పాలనానుమతులు ఇచ్చిన అప్పటి టీడీపీ ప్రభుత్వం హంద్రీనీవా కాలువల విస్తరణ పనుల్ని 47 శాత మేర పూర్తి చేసింది. 2019 నుంచి 24 వరకూ గత ప్రభుత్వం ఆ పనుల వైపు కన్నెత్తి కూడా చూడలేదు. మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక హంద్రీనీవా ఫేజ్ 1 ప్రధాన కాలువ పనుల్లో కదలిక వచ్చింది. 2025 ఏప్రిల్ లో మొదలైన విస్తరణ పనులు కేవలం వంద రోజుల్లో పూర్తి అయ్యాయి. తదుపరి ఫేజ్ 2 పనుల్ని కూడా ఈ నెలాఖరుకు పూర్తి చేసి పుంగనూరు, కుప్పంలోని చివరి ఆయకట్టుకూ నీళ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీని కోసం మొత్తం రూ.3,890 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోంది.

# వలసదారులు, వృద్ధుల చేర్పు కోసం ప్రత్యేక చర్యలు

>>ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. మొబైల్ బిఎల్‌వోలతో పున:నమోదు డ్రైవ్‌లు చేపట్టాలి. తాత్కాలిక చిరునామాల ఆధారంగా ఓటింగ్ హక్కు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ తరపున టీడీపీ నేతలు ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. 2029 వరకు ఎన్నికలు లేకపోవడంతో త్వరలో ఎస్ఐఆర్ ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ముందు కనీసం 6 నెలల ముందు మొబైల్ బిఎల్‌వోలతో పూర్తి చేయాలని అభ్యర్థించారు.ఎస్ఐఆర్ పౌరసత్వ ధ్రువీకరణ కాదని స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఇవన్నీ తెలుగుదేశం పార్టీ ప్రజాస్వామ్య బలోపేతానికి ఇచ్చిన సూచనలని ఆ పార్టీ నేతలు తెలిపారు. టీడీపీ బృందంలో ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీలు దగ్గుమళ్ల ప్రసాదరావు, బైరెడ్డి శబరి, నేతలు కూన రవికుమార్, జ్యోత్స్న ఉన్నారు.

# ఎబివిపై చర్యలు నిలిపివేత

>> ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం జీఓ ఆర్‌టి నెంబరు 1334ని ప్రభుత్వం విడుదల చేసింది. ఇంటెలిజెన్సీ డిజిగా ఉన్న సమయంలో నమోదైన కేసుల్లో ప్రొసీడింగ్స్ నిలిపివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# 10లక్షల ఉద్యోగాలు

>> షన్ హబ్‌ను త్వరలోనే ప్రారంభించనున్నట్లు మంత్రి లోకేష్ తెలిపారు. దీంతోపాటే విశాఖ, రాజమహేంద్రవరం, విజయవాడ, తిరుపతి, అనంతపురంలో ప్రాంతీయ స్పోక్స్ కేంద్రాలను కూడా ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అమరావతి క్వాంటమ్ వ్యాలీకి సంబంధించి టిసిఎస్, ఎల్ అండ్ టి, ఐబిఎంల భాగస్వామ్యంతో కంపెనీ ఏర్పాటైందని, ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలపై అధికారులు దృష్టి సారించాలని అన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 400 ఎకరాల్లో నిర్మించతలపెట్టిన డ్రోన్ సిటీని ఏడాదిలోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు అవసరమైన ఎకో సిస్టమ్ కల్పించాలని అధికారులను ఆదేశించారు. బుడమేరు వరదల సమయంలో డ్రోన్లసేవలు ఎంతగానో ఉపకరించాయని, వ్యవసాయం, పోలీసింగ్, వాతావరణం తదితర శాఖల్లో డ్రోన్ల వినియోగంపై నెలకో జిల్లాలో ఈవెంట్లు నిర్వహించి ప్రజలను చైతన్యపర్చాలని సూచించారు.

పౌరసేవల్లో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సేవలను మరింత విస్తృత ప్రచాలని మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. మొత్తం 702 సేవలకు 535 సేవలను ఇప్పటికే మనమిత్ర ద్వారా అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు తమకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం రెవిన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే విధానానికి చెక్ పెట్టాలని, కులధృవీకరణ పత్రంతో సహా విద్యాసంబంధిత అన్నిరకాల సర్టిఫికెట్లు బ్లాక్ చైన్ తో అనుసంధానం చేసి మనమిత్ర ద్వారా సులభతరంగా పత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని 45వేల ప్రభుత్వపాఠశాలల్లో ప్రతిస్కూలుకు ఇంటర్నెట్ కనెక్టివిటీ ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి వంటి ఎయిర్ పోర్టుల్లో అంతరాయం లేని ఫోన్ కనెక్టివిటీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ఐటి అండ్ సి స్పెషల్ సెక్రటరీ సుందర్ ఎపిఐఐసి ఎండి అభిషిక్త్ కిషోర్, ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డు సిఇఓ సాయికాంత్ వర్మ, ఆర్టీజిఎస్ సిఓ ప్రకార్ జైన్, ఎపిటిఎస్ ఎండి సూర్యతేజ, తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టు జడ్జిగా బి.దేవానంద్

>> కొనసాగుతారు. జస్టిస్ దేవానంద్ పదవీకాలం 2028 ఏప్రిల్ 13 వరకు ఉంది. ప్రభుత్వ ఉపాధ్యాయులు బట్టు వెంకటరత్నం,మనోరంజితం దంపతులకు కృష్ణాజిల్లా గుడివాడలో 1966ఏప్రిల్ 14న జస్టిస్ జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 1989 జులై 6న బార్‌కౌన్సిల్ న్యాయవాదిగా పేరునమోదు చేసుకున్నారు. విశాఖ జిల్లా కోర్టులో ప్రాక్టీసు ప్రారంభించి,తర్వాత హైకోర్టుకు మార్చారు. 1996 నుంచి 2వేలు వరకు హైకోర్టులో సహాయ ప్రభుత్వన్యాయవాదిగా,2014 జులై నుంచి 2019 మే వరకు ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. 2006లో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు. 2020జనవరి 13న ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా భాధ్యతలు స్వీకరించారు.బదిలీపై 2023 ఏప్రిల్ 10న మద్రాస్ హైకోర్టుకు వెళ్ళారు. ఆయన్ను తిరిగి ఏపీ హైకోర్టుకు బదిలీ చేసేందుకు సుప్రీంకోర్టు కొలీజియం ఇటీవల కేంద్రానికి సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. జస్టిస్ దేవానంద్‌కు భార్య,ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. జస్టిస్ దేవానంద్ సోదరుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విజయనగరం జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్నారు.

## ఎంపి మిథున్ రెడ్డికి హైకోర్టులో చుక్కెదురు

>>ముడుపుల సొమ్ము అంతిమంగా ఎక్కడికి చేరిందో తెలుస్తుందని ధర్మాసనానికి తెలిపారు.ముడుపులు రూపేణా డికార్ట్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్(ఏ16) నుంచి మిథున్‌రెడ్డి కుటుంబానికి చెందిన పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన బ్యాంక్ ఖాతాలో రూ.5 కోట్లు జమైందని కోర్టు దృష్టికి తెచ్చారు. ముడుపుల ద్వారా వచ్చిన సొమ్ముతో బంగారు అభరణాలు కొనుగోలు చేశారని అన్నారు. అలానే మిథున్ రెడ్డి దర్యాప్తునకు సహకరించడం ఆయనికి నేర చరిత్ర ఉందని, ఆయనపై 8 కేసులు నమోదు అయ్యాయని అన్నారు. ఇందువల్ల ముందస్తు బెయిల్ పొందేందుకు మిథున్‌రెడ్డి అనర్హులని ఆయని పిటిషన్ ను కొట్టేయాలని లూథ్రా కోరారు. ఎంపీ మిథున్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది టి. నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం విధానంతో పిటిషనర్‌కు సంబంధం లేదని అలానే పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ సంస్థలో మిథున్‌రెడ్డి డైరెక్టర్ కాదని తెలిపారు. డికార్డు లాజిస్టిక్స్ సంస్థ నుంచి పీఎల్ఆర్ సంస్థకు వచ్చిన రూ.5 కోట్లను తిరిగి ఆ సంస్థకే చెల్లించారని ఓ సాక్షి ఇచ్చిన వాంగ్మూలం మినహా పిటిషనర్ నేరానికి పాల్పడ్డారనేందుకు ఎలాంటి ఆధారాలు లేవని అన్నారు. ఇరువురి వాదనలు విన్న న్యాయస్థానం ఇటీవల తీర్పు రిజర్వ్ చేసి నేడు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## రిటైర్డ్ ఇంజినీర్ హత్య కేసులో నిందితుల అరెస్టు

**విజయబాడ,జూలై15,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో జరిగిన రిటైర్డ్ ఇంజనీర్ హత్య కేసులో పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. దీనికి సంబంధించి మాచవరం పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ దామోదర్, మాచవరం సీఐ ప్రకాశ్‌ల వివరాలు ఉన్నాయి. తెలంగాణలోని ఖమ్మం జిల్లా కొత్తగూడేనికి చెందిన పల్లపు మంగ అలియాస్ అనూష 12 ఏళ్ల వయసులోనే రమేశ్ అనే వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకుంది. ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. 5 ఏళ్ల కింద ముగ్గురు పిల్లలు, భర్తను వదిలేసి విజయవాడ వచ్చింది. ఇంటిలో పని చేసుకొని జీవనం సాగించింది. అనంతరం హైదరాబాద్ వెళ్లింది. ఓ డేటింగ్ యాప్ ద్వారా రాజా అనే వ్యక్తి పరిచయం అవ్వగా మంగ అతడిని పెళ్లి చేసుకుంది. ఒక సంవత్సరం తర్వాత అతన్ని కూడా వదిలేసింది. అనంతరం యాప్‌లో పరిచయమైన ఖమ్మం జిల్లా నారాయణపురం మండలం తల్లాడ గ్రామానికి చెందిన వేమిరెడ్డి ఉపేంద్రరెడ్డి అనే వ్యక్తిని ఈ ఏడాది మే 29న 3వ పెళ్లి చేసుకుంటుంది. విజయవాడ ఎన్టీఆర్ కాలనీకి చెందిన రిటైర్డ్ ఇంజనీర్ రామారావు ఇంటిలో కేర్ టేకర్‌గా చేరింది. ఆయన ఇంట్లో ఎక్కువ బంగారం, నగదు ఉంటాయనే ఆలోచనతో భర్త ఉపేంద్ర సహాయం తీసుకొని రామారావుని హత్య చేసింది. తర్వాత బీరువాలోని డబ్బు తీసుకుని ఇద్దరూ పరారయ్యారు. సీసీ కెమెరాలతో పాటు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా గాలించిన పోలీసులు చివరకు ఇద్దరినీ అరెస్టు చేశారు. కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్సైలు శంకర్,శ్రీనివాస్, సిబ్బంది వంశీ, మల్లేశ్వరరావు, రమేష్, తరుణ్, సుభాష్‌లను డీసీపీ దామోదర్ అభినందించారు.

# కేరళ నర్సుకు ఊరట: యెమెన్‌లో ఉరిశిక్ష వాయిదా

**సనా,జూలై 15:** ఉరికంబం ఎక్కాల్సిన కేరళ నర్స్ నిమిష ప్రియకు ఊరట లభించింది. ఈనెల 16 అమలు కావాల్సిన ఆమె ఉరిశిక్షను యెమెన్ ప్రభుత్వం వాయిదా వేసింది. ఈ మేరకు విదేశాంగ శాఖ ఓ ప్రకటన చేసింది. యెమెన్ జైలు అధికారులతోపాటు ప్రాసిక్యూషన్ కార్యాలయంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. ఈ కేసులో బాధితురాలికి సాయం చేసేందుకు భారత్ ప్రభుత్వం మొదటి నుంచి తనవంతు ప్రయత్నాలు చేస్తోంది. నిమిష, బాధిత కుటుంబాల మధ్య పరస్పర అంగీకరానికి వచ్చి కేసును పరిష్కరించుకునేలా మరింత సమయం ఇవ్వాలని కోరాం. ఈ విషయంలో స్థానిక జైలు అధికారులు, ప్రాసిక్యూటర్ ఆఫీసుతో నిరంతరం జరిపిన సంప్రదింపులు ఫలించాయి. మరణశిక్ష అమలును వాయిదా వేసేందుకు యెమెన్ అధికారులు అంగీకారం తెలిపారని విదేశాంగ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఇక ఈ కేసులో బ్లడ్ మనీ తీసుకునేలా బాధిత కుటుంబాన్ని ఒప్పించేందుకు మత గురువు కాంతాపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ సంప్రదింపులుజరపుతున్నారు. ఆచర్చలు కూడా సానుకూలంగా జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. బాధిత కుటుంబానికి ఒక మిలియన్ డాలర్ల (దాదాపు రూ.8.6కోట్ల) క్షమాధనాన్ని ఇచ్చేందుకు నిమిష ప్రియ కుటుంబం సిద్ధంగా ఉంది. ఇందుకు వారు అంగీకరిస్తే నిమిష ప్రియకు మరణశిక్ష తప్పే అవకాశం ఉంది. కేరళ పాలక్కాడ్ జిల్లాకు చెందిన నిమిష నర్సు కోర్సు పూర్తి చేసిన తర్వాత 2008లో యెమెన్ వెళ్లి అక్కడే ఉద్యోగంలో చేరారు. 2011లో థామస్‌ను వివాహం చేసుకున్న ఆమె అక్కడే ఓ క్లినిక్ తెరవాలనుకొన్నారు. ఆ దేశ నిబంధనల ప్రకారం స్థానిక తలాల్ అదిబ్ మెహది అనే వ్యక్తిని నిమిష, థామస్ జంట తమ వ్యాపార భాగస్వామిగా చేసుకొన్నారు. వారు అల్‌అమన్ మెడికల్ కౌన్సిల్ సెంటర్‌ను ప్రారంభించారు. కొన్నేళ్ల తర్వాత ఆమె భర్త, కుమార్తె కేరళకువచ్చేశారు. నిమిష యెమెన్‌లోనే ఉంటూ సెంటర్‌ను కొనసాగించారు.



మంగళవారం న్యూఢిల్లీలో నీతిఆయోగ్ సభ్యులతో భేటీ అయిన సిఎం చంద్రబాబు

# సత్వరమే నిధులు మంజూరు

>> అమిత్ షాకు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. అలాగే రాష్ట్రంలోని కరవు ప్రాంతాలకు నీటిని తరలించేందుకు కీలకమైన పోలవరం –బనకచర్ల లింక్ ప్రాజెక్టు అంశాన్ని కూడా సీఎం ప్రస్తావించారు. పోలవరం నుంచి కర్నూలు జిల్లా బనకచర్ల రెగ్యులేటర్ వరకూ 200 టీఎంసీల వరద నీటిని తరలించేలా ఈ లింక్ ప్రాజెక్టు ప్రతిపాదించినట్లు తెలిపారు. అనుసంధాన ప్రాజెక్టు పూర్తి అయితే కరవు పీడిత రాయలసీమ ప్రాంతానికి దక్కే ఫలితాలను అమిత్ షాకు సీఎం చంద్రబాబు వివరించారు. గోదావరి నదిలో ఎగువ, దిగువ రాష్ట్రాల నీటి అవసరాలు తీర్చిన తర్వాత కూడా 90 నుంచి 120 రోజుల మిగులు జలాలు ఉంటాయని ముఖ్యమంత్రి తెలిపారు. నదీ ప్రవాహ మార్గంలో చివరి రాష్ట్రంగా గోదావరి మిగులు జలాలను పూర్తిగా వినియోగించుకునే హక్కు ఏపీకి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు హోం మంత్రికి తెలియచేశారు. అంతకుముందు ఢిల్లీలోని ముఖ్యమంత్రి నివాసంలో నీతి ఆయోగ్ సభ్యులు వి.కె.సారస్వత్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఎరో స్పేస్, డిఫెన్స్ పరిశ్రమల ఏర్పాటుపై సారస్వత్‌తో ముఖ్యమంత్రి చర్చించారు. రాయలసీమ ప్రాంతంలో డిఫెన్స్ పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రభుత్వం ప్రణాళికలు చేస్తోందని ఈ పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలు ఆ రంగంలో పరిశ్రమలు, పెట్టుబడులు సాధించేందుకు అనుసరించాల్సిన అంశాలపై ఇరువురూ చర్చించారు. అనంతరం ఢిల్లీ మెట్రో రైల్ ఎండి వికాస్ కూడా ముఖ్యమంత్రిని కలిశారు. విశాఖ, విజయవాడ నగరాల్లో మెట్రో నిర్మాణంపై సహకారంపై చర్చించారు.



మంగళవారం ఢిల్లీ మెట్రో రైల్ ఎండి వికాస్‌ను కలిసిన సిఎం చంద్రబాబు

## అటవీశాఖలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

**విజయవాడ,జూలై 15,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వంలో ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ మొదటి నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటికే మెగా డీఎస్సీ వచ్చినా ఏపీపీఎస్సీ ద్వారా ఇదే తొలి నోటిఫికేషన్. అటవీ శాఖలో 256 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, 435 అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం ఈ నోటిఫికేషన్‌ను జారీచేసినట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి పి.రాజాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్‌ను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. అభ్యర్థులు ఈనెల 16 నుంచి ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. స్పోర్ట్స్ కోటా ఖాళీలు, ఎస్సీ గ్రూపుల వారీగా ఖాళీల వివరాలను అందుబాటులో ఉంచుతామన్నారు.కాంట్రాక్టు డిగ్రీ లెక్చరర్ల సేవలను రెన్యువల్ చేస్తూ ఉన్నత విద్యా శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 693 మంది లెక్చరర్ల సేవలు కొనసాగిస్తున్నట్లు పేర్కొంది. ఈ ఏడాది జూన్ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు 11 నెలలపాటు ఈ కాంట్రాక్టు కొనసాగుతుంది.

## సజ్జల శ్రీధర్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప బెయిల్‌ను తిరస్కరించిన ఎసిబి కోర్టు

**విజయవాడ,జూలై15,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న సజ్జల శ్రీధర్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్లను విజయవాడ ఏసీబీ కోర్టు కొట్టేసింది. సోమవారం న్యాయాధికారి పి.భాస్కరరావు ఈ మేరకు తీర్పును వెలువరించారు. సజ్జల శ్రీధర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌ను కొట్టేయడం ఇది రెండోసారి. ఇంతకుముందు కూడా ఆయన దాఖలుచేసిన పిటిషన్‌ను కోర్టుకొట్టేసింది. దీంతో ఆయన రెండోసారి పిటిషన్ దాఖలు చేశారు.

## ఎఐ ఆధారిత విద్యా విప్లవానికి కేంద్రంగా ఎపి: సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూలై 15,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో ఏఐ ప్లస్ క్యాంపస్ ఏర్పాటు..ఉన్నత విద్యను సమూలంగా మార్చే నిర్ణయమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఇందుకు ముందుకొచ్చిన ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్మన్,బిట్స్ విశ్వవిద్యాలయ కులపతి కుమారమంగళం బిర్లాకు సోమవారం ఎక్స్ వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. ' ఈ నిర్ణయం ఆంధ్రప్రదేశ్‌ను ఏఐ ఆధారిత విద్యా విప్లవానికి కేంద్రంగా మార్చే దిశగా గొప్ప ముందడుగు' అని చంద్రబాబు పోస్ట్ చేశారు.

**బిట్స్ క్యాంపస్ ఏర్పాటుకు స్వాగతిస్తున్నాం**

బిట్స్ కొత్త క్యాంపస్‌ను అమరావతిలో ఏర్పాటు చేయనున్నట్లు ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్మన్ కుమారమంగళం బిర్లా చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎక్స్‌లో పోస్టు చేశారు. రూ.వెయ్యి కోట్ల పెట్టుబడితో నెలకొల్పనున్న ఈ క్యాంపస్‌లో 7 వేల మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారు'అని లోకేష్ పేర్కొన్నారు.

## వారం - వర్జ్యం

16-07-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
షష్ఠి రా.9.02
పూర్వాభాద్ర ఉ.5.44, ఉత్తరాభాద్ర తె.4.50
వర్జ్యం : తె.4.41-7.44
దు.ఉ.11.49-12.40
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు.కీలక నిర్ణయాలలో కొంత భాగస్వామి సలహాలు తీసుకొంటారు.

**వృషభం :** కుటుంబ సభ్యుల నుండి సహాయసహకారాలు అందుకొంటారు. ఆరోగ్య సమస్యలు చికాకులు కలిగిస్తాయి.

**మిథునం:** గృహనిర్మాణ ఆలోచనలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి

**కర్కాటకం :** శ్రమకు తగిన ఫలితం కష్టమే. ఎదుటివారి విషయాలలో జోక్యం తగదు.ఆర్థిక పరిస్థితి అనుకూలం..

**సింహం:** పెట్టుబడుల విషయంలో తొందరపాటు వద్దు. ఇంటాబయటా కొంతవరకు ప్రోత్సాహం లభిస్తుంది.

**కన్య :** పట్టుదల పెరుగుతుంది. బంధువులకు కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు.

**తుల :** శ్రమకు తగ్గ ఫలితం దక్కుతుంది. దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు.

**వృశ్చికం:** కీలక నిర్ణయాలలో సొంత ఆలోచన మంచిది. సాంకేతిక, రాజకీయ రంగాల వారికి కొంత అనుకూలంగా వుండును.

**ధనుస్సు:** సోదరుల సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఉద్యోగాలలో స్థానచలనం వుంటుంది.

**మకరం:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**కుంభం:** శ్రమకు తగిన ఫలితం దక్కదు. దీర్ఘకాలిక సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి.

**మీనం :** దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. సేవా కార్యక్రమాలలో చురుకుపాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మహిళామణులను గొప్ప వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలి

## పట్టణాభివృద్ధి శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్



లైఫ్లీ హుడ్స్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్ షిఫ్ యాక్సిలరేషన్ ప్రోగ్రాంను ప్రారంభిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్

**విజయవాడ,జూలై 15,ప్రభాతవార్త ప్రతినిధి:** మహిళా మణులను ఆర్థికంగా శక్తివంతులను చేసి వారు గొప్ప వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్న ఆశయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రభుత్వం ముందుకు వెళుతుందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి లైఫ్లీ హుడ్స్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్ షిఫ్ యాక్సిలరేషన్ ప్రోగ్రాంను తాడేపల్లి లోని ఓ ప్రైవేటు కన్వేన్షన్ లో మంగళవారం నిర్వహించారు.జ్యోతి ప్రజ్వలన ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ' మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి లీప్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడు తుందన్నారు. వారిలో దాగున్న వ్యాపార నైపు ణ్యాలను వెలికితీసి వారిని బలమైన వ్యాపారవేత్తలుగా తయారు చేయడానికి మెప్మా చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 30వేల మందికి పైగా మహిళా వ్యాపారవేత్తలను తయారు చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల నుంచి రుణం తీసుకుని చిన్న చిన్న వ్యాపార సంస్థలు నెలకొల్పి అంచెలంచెలుగా రూ. కోటి టర్నోవర్ సాధించే సంస్థలుగా రూపాం తరం చెందేలా వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ ఏడాదిలో రాష్ట్రమంతా ఆడిట్ నిర్వహించాలన్న లక్ష్యంతో ముందకు సాగుతున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ అన్నారు. మహిళలు చాలా మంది ఆడిట్ లో పాల్గొంటే తమ కుటుంబాలకు ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అందవన్న అపోహ లో ఉన్నా రని, అది వాస్తవం కాదని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో పేదరికాన్ని శాశ్వతంగా దూరం చేయా లన్న సంకల్పంతో ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. నేడు మన సొసైటీలో ఎన్నో విధాలుగా ఆదాయం పొందే మార్గాలు ఉన్నాయని, అవకాశాలను అంది పుచ్చు కోవాలన్న సంకల్పం ఉండాలన్నారు. కుకింగ్, వివిద అంశాలపై అవగాహన కల్పించే వీడియోలు సైతం ఆదాయాన్ని సమకూర్చు తాయన్నారు. మన గ్రామంలో, మన పట్టణంలోనే సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ పై శిక్షణ పొంది ఆదాయం ఆర్జించవచ్చన్నారు. మెప్మా ఎండీఎన్. తేజ్ భరత్ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి, వారిని సంఘంలో ఒక గుర్తింపు కలిగిన వ్యాపారవేత్తలుగా తయారు చేయడానికి మెప్మా సిబ్బంది శక్తి వంచన లేకుండ పనిచేయాలని పిలుపునిచ్చారు. మహిళలకు రుణాలు ఇప్పించడంతో బాధ్యత తీరిపోయింద నుకోకూడదని, వారి వ్యాపార ఉన్నతికి తమ వంతు సలహాలు, సహాయ సహకారాలు అందించాలన్నారు. రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి కార్పొరేషన్ లలో లినితిశ ఆడిట్ చివరి దశకు వచ్చిందని, మిగిలిన 14 కార్పొరేషన్ లలో కూడా ఆడిట్ ను త్వరలోనే నిర్వహిస్తామని, అటుపై మన్సిపాల్టీలు, నగర పంచాయితీలలో దశల వారీగా నిర్వహిస్తామన్నారు. ఆడిట్ అంటే వ్యాపారంలో ఉన్న మహిళలకు మరింత మెళుకువలు అందించడం, వారిని ప్రోత్సహించడం వంటివి ఉంటాయని వివరించారు.

# పంచాయతీల్లో ఆడిటింగ్‌కు పారదర్శక ప్రణాళిక

**విజయవాడ,జూలై15,ప్రభాతలవార్తప్రతినిధి:**గ్రామ పంచాయితీల్లో ఆడిట్ ఇక పక్కాగా నిర్వహించేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోంది. ఇప్పటి వరకు అస్తవ్యస్త విధానాల కారణంగా పంచాయితీల్లో నిధుల వ్యయం,ఆదాయంపై లెక్కాపత్రం ఉండటం లేదు. కార్యదర్శులు,ఉద్యోగుల్లోనూ జవాబుదారీ తనం కొరవడుతోంది. లోకల్ ఫండ్ ఆడిట్ అధికారులు కూడ తూతూమంత్రంగా ఆడిట్ నిర్వహిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఇలాంటి పలు లోపాల నేపథ్యంలో పంచాయితీల్లో ఆదాయ,వ్యయాల్లో పారదర్శకత ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ నెల 11,12 తేదీల్లో ఇదే అంశంపై నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సులో పాల్గొన్న పంచాయితీరాజ్,లోకల్ ఫండ్ ఆడిట్,ఎకౌంట్స్ జనరల్ తదితర శాఖల అధికారులు,నిపుణులు చేసిన పలు సూచనల ఆధారంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.గ్రామ పంచాయితీ,మండల పరిషత్ కార్యాలయాల్లోనే పంచాయతీలకు సంబంధించిన ఆడిట్ నిర్వహించాలి. హోటళ్ళు, అతిథిగృహాల్లో నిర్వహించడానికి వీల్లేదు. ఆడిట్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా చేపట్టాలి. నిధుల దుర్వినియోగానికి కారకులైన వారిపై విధిగా చర్యలు సిఫార్సు చేయాలి.రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండేలా పంచాయితీ కార్యదర్శులు,సిబ్బందికి తగిన శిక్షణ ఇవ్వాలి. పంచాయితీలకు వచ్చే ఆదాయ,వ్యయంపై పక్కాగా రికార్డులు నిర్వహించకపోతే చర్యలు తప్పవన్న సంకేతాలు కార్యదర్శులకు పంపాలి. పంచాయితీల పనితీరుపైనా ఎప్పటికప్పుడు మండల,జిల్లా స్థాయిల్లో అధికారుల సమీక్షలు, క్షేత్రస్థాయి పరిశీలన విధిగా చేపట్టాలి.

# డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు జర్నలిస్టు హెల్త్ స్కీమ్ పొడిగింపు

## - సమాచార పౌర సంబంధాల శాఖ, సంచాలకులు హిమాన్షు శుక్ల

**విజయవాడ,జూలై15,ప్రభాతవార్త ప్రతినిధి:** వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమ్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంగళవారం జీవో యం.యస్ నెం. 77 ను జారీ చేసినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ, సంచాలకులు హిమాన్షు శుక్ల ఒక ప్రకటనలో తెలిపారు. కావున రాష్ట్ర వ్యాప్తంగా అక్రిడిటేషన్లు అమలులో ఉన్న వర్కింగ్ జర్నలిస్టులందరూ ఈ పథకం ప్రీమియం క్రింద రూ. 1250/ సంబంధిత వెబ్ సైట్ ద్వారా ఈ క్రింద తెలిపిన పద్దుకు చెల్లించి లబ్ధి పొందవలసినదిగా సంచాలకులు తెలిపారు. హెడ్ ఆఫ్ అకౌంట్ 8342001200103001 001, డీడీవో కోడ్ 2703 0802 003 ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజినల్ చలానా, రెన్యూవల్ చేయించుకున్న రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ జిరాక్స్ కాపీలను విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్, ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ లోని రెండవ ఫ్లోర్ లో ఉన్న సమాచార పౌర సంబంధాల శాఖ, సంచాలకుల కార్యాలయంలోనూ, జిల్లా స్థాయి జర్నలిస్టులు సంబంధిత జిల్లా కేంద్రాల్లోని సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో అందజేయాల్సిందిగా సంచాలకులు హిమాన్షు శుక్ల తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం ప్రీమియం రూ. 2,500 కాగా ఇందులో జర్నలిస్టు వాటా రూ. 1,250, ప్రభుత్వం వాటా రూ. 1,250 అన్నారు. జర్నలిస్టు, భార్య/భర్త, పిల్లలు, జర్నలిస్టుపై ఆధారపడిన తల్లిదండ్రులకు ఈ స్కీమ్ వర్తిస్తుందన్నారు. ఈ స్కీమ్ లో భాగంగా ప్రభుత్వం కార్పస్ ఫండ్ ను నిర్వహిస్తూ జర్నలిస్టుల వైద్య ఖర్చులను డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు విధి విధానాలను అనుసరించి చెల్లిస్తుందన్నారు. జర్నలిస్టు హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు, వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులకు ఏదైనా అనారోగ్యం సంభవించిన ప్రతిసారి రూ. 2 లక్షల వరకు విలువ చేసే వైద్య సేవలు అందుతాయని, ఇలా సంవత్సర కాలంలో ఎన్నిసార్లైనా పరిమితులు లేకుండా ఈ సదుపాయాన్ని అందిస్తారని తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులకు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ తరహాలో నగదు రహితంగా వైద్య సేవలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమ్ ద్వారా పొందే వైద్య సేవల విషయంలో ఎలాంటి ఆదాయ పరిమితులు లేవని, అదే విధంగా నిర్దేశిత చికిత్సలకు సంబంధించి ఉచిత అవుట్ పేషెంట్ సేవలు కూడా పొందవచ్చని ఆయన వివరించారు. ఈ పథకానికి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీగా, అదే విధంగా సమాచార పౌర సంబంధాల శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని ఆయన పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కలిగి ఉన్న జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని హిమాన్షు శుక్ల ఆ ప్రకటనలో కోరారు.

# రాష్ట్రంలో 351 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి (పిఐసి) కమిటీలు

**విజయవాడ,జూలై15,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో 351 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు (పిఏసిఎస్) నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి (పిఐసి) కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఈ మేరకు వ్యవసాయశాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలు ఎన్నికలు జరిగే వరకూ లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ కొనసాగుతాయని పేర్కొన్నారు.

# 19న అక్టోబర్ నెల ఆర్జితసేవల టిక్కెట్లు విడుదల

**తిరుమల,జూలై 15ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటిబ్రహ్మాండనాయకుడు...ఆపదమొక్కలవాడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనాలకు సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం రానున్న అక్టోబర్‌నెలకు సంబంధించి ఆన్‌లైన్ టిక్కెట్లు ఈనెల 19వతేదీ శనివారం విడుదల చేయనుంది. అక్టోబర్ నెలకోటాను 19వతేదీ ఉదయం 10గంటలకు విడుదల చేసేలా టిటిడి ఐటి విభాగం ఏర్పాట్లుచేసింది. ఆర్జిత సేవాటిక్కెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 21వతేదీ సోమవారం ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టిక్కెట్లు పొందిన భక్తులు 21వతేదీ నుండి 23వతేదీ మధ్యాహ్నం 12గంటల లోపు లక్కీడిప్‌ద్వారా టిక్కెట్లు పొందిన భక్తులు నగదు చెల్లించి టిక్కెట్లు అందుకోవచ్చు. ఇక ఆర్జితసేవా కల్యాణం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకరణ సేవల టిక్కెట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఈనెల 22వతేదీ ఉదయం 10గంటలకు విడుదల చేస్తారు. వర్చువల్ సేవల టిక్కెట్లు 22న మధ్యాహ్నం 3గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అంగప్రదక్షణ టోకెన్లను 23వతేదీ ఉదయం 10గంటలకు విడుదల చేస్తోంది. రోజువారీగా (శుక్రవారం తప్ప)750 టోకెన్లను ఆన్‌లైన్‌లోనే విడుదల చేస్తున్న విషయం విదితమే. ఇదిలా ఉండగా శ్రీవాణి టిక్కెట్లు ఆన్‌లైన్‌లో 23వతేదీ ఉదయం 11గంటలకు విడుదల చేస్తారు. 300 రూపాయలు ఎస్ఇడి టిక్కెట్లు కోటా 24వతేదీ ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. దివ్యాంగులు,
వృద్ధుల కోటా 23న మధ్యాహ్నం 3గంటలకు, 24న గదుల కోటా విడుదలచేస్తారు.

25న శ్రీవారి సేవా కోటా విడుదలవుతుంది. భక్తులు ఆర్జితసేవలు,దర్శన టిక్కెట్లను ఆన్‌లైన్‌లో టిటిదేవస్థానమ్స్. ఎపి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లో మాత్రమే బుక్‌చేసుకోవాలని టిటిడి కోరింది.

# ఎసిబి వలలో నెల్లిమర్ల కమిషనర్

## రూ.15వేలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన తారక్‌నాథ్



**నెల్లిమర్ల, (విజయనగరం జిల్లా) జూలై 15 ప్రభాతవార్త:** నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్ ఏ.తారక్‌నాథ్ మంగళవారం ఏసీబీకి చిక్కారు. పట్టణంలోని పద్మశాలివీధిలో నివసిస్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి ఇంటి నిర్మాణం నిమిత్తం ప్లాన్ అప్రూవల్ కోసం మున్సిపల్ కార్యాలయంలోని తన గదిలో రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ రమ్య అందించిన వివరాలిలా ఉన్నాయి. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని పద్మశాలివీధిలో నివశిస్తున్న బురిడి మహేష్ అదే వీధిలో ఇల్లు నిర్మించుకుంటున్నారు. సదరు ఇంటికి ప్లాన్ అప్రూవల్ నిమిత్తం ఇటీవల దరఖాస్తు చేసుకున్నారు. అయితే ప్లాన్ అప్రూవల్ కోసం నగర పంచాయతీ కమిషనర్ తారక్‌నాథ్ మహేష్ నుంచి రూ.20 వేలు లంచం డిమాండ్ చేశారు. రూ.15 వేలు నగదు రూపంలో, మిగిలిన రూ.5 వేలకు దివాన్ కాట్ బెడ్ ఇవ్వాలని కోరారు. ప్లాన్ కోసం అవసరమైన ఫీజు చెల్లించానని, లంచం ఇవ్వలేనని మహేష్ ప్రాథేయపడ్డారు. అయినా సరే కమిషనర్ అంగీకరించలేదు. దీంతో మహేష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో నగర పంచాయతీ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌కు వెళ్లిన మహేష్ రూ.15 వేలు అందజేశారు. లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రమ్య ఆధ్వర్యంలో సిబ్బంది రెడ్ హ్యాండెడ్‌గా కమిషనర్ తారక్‌నాథ్‌ను పట్టుకున్నారు. కేసు నమోదు చేశామని, బుధవారం కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు. నగర పంచాయతీ కమిషనర్ తారక్‌నాథ్‌పై మొదటి నుంచి అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలో నిర్మాణంలో ఉన్న ప్రతి భవనం వద్దకు వెళ్లి లంచాలు డిమాండ్ చేసినట్లు విమర్శలు గుప్పుమన్నాయి. ఇదే విషయాన్ని గత మూడు దఫాలుగా జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో సభ్యులు ప్రస్తావించారు. ఒకానొక సందర్భంలో బాధితులతోనే నేరుగా సమావేశాల్లో చెప్పించారు. అయినా సరే కమిషనర్ తీరులో ఏమాత్రం మార్పు రాలేదు. అంతా సవ్యంగా జరిగితే ఈ నెలాఖరుకు ఆయన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఇంతలోనే ఏసీబీ అధికారులకు పట్టుబడటం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

# సిబ్బంది నిర్లక్ష్యంతోనే హిసార్ ఎక్స్‌ప్రెస్ మంటలు !

## - ఇంజిన్ వెనుక బోగీలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్



**తిరుపతి,జూలై 15ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి రైల్వేస్టేషన్ సమీపంలో ఔటర్‌ట్రాక్‌పై మంటల్లో పూర్తిగా తగలబడిన హిసార్ ఎక్స్‌ప్రెస్‌రైలు (04717) స్లీపర్‌బోగీలో విద్యుత్‌షార్టుసర్క్యూట్ కారణమని రైల్వేవిభాగం అధికారులు నిర్ధారించారు. ఈ ఘటన జరిగిన 24గంటల తరువాత గుంతకల్లునుండి వచ్చిన రైల్వేవిభాగం ఇంజనీరింగ్,ఎలక్ట్రికల్‌అధికారులు, ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి అధికారులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో ఆ బోగీలో విద్యుత్ వైర్లు షార్టుకావడంతోనే మంటలు వ్యాపించాయని తేల్చారు. తిరుపతి రైల్వేస్టేషన్ ఉన్నతాధికారి కుప్పాల సత్య నారాయణ దీనిపై సమగ్రంగా రైల్వే అధికారులతో కలసి దర్యా ప్తులో ఈ ఉదంతమే కారణమని తేల్చారు. దీనివల్లే ఆ రైలు ఇంజిన్‌కు వెనుకనే ఉన్న బోగీ మంటల్లో పూర్తిగా కాలిపోయింది. రాజస్థాన్ హిసార్ నుండి సోమవారం ఉదయం 10.50 గంటలకు తిరుపతికి వచ్చిన ఈ రైలు షంటింగ్‌కోసం ముందుక ువెళ్ళి ఔటర్‌ట్రాక్ పట్టాలపై ఆగింది. దాదాపు రెండు గంటల ఉన్నఫళంగా రైలుబోగీలో మంటలు వ్యాపించడం స్థానికులు ,రైల్లో ఉన్న గార్డు గమనించి వెంటనే సమాచారం ఇవ్వడంతో మంటలను అదుపుచేయడంతో పెద్దప్రమాదం తప్పింది. అయితే రెండుగంటల ముందే ప్రయాణీకులు రైల్వేస్టేషన్‌లో దిగిపోయారు. వందలకిలో మీటర్ల దూరం ప్రయాణించిన ఈ రైలు వేగానికి తగ్గట్లు తిరుపతికి చేరిన తరువాత షంటింగ్‌యార్డుకు వెళ్ళాలి.

దీనికంటే ముందే రైలు ఔటర్‌ట్రాక్‌పై ఆగడంతో వేడితీవ్రత అధికంగా ఉండటంతో ఇలా జరిగిందని నిర్ధారణకు వచ్చారు.

# సుపరిపాలనలో తొలి అడుగుకు తెలుగు తమ్ముళ్లు వెనకడుగు

## పి.గన్నవరంలో అయోమయంలో పడ్డ టిడిపి శ్రేణులు..

**కోనసీమ బ్యూరో, జూలై 15, ప్రభాతవార్త..** రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా సాధించిన విజయాలు,అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయాలు, సూచనలు తెలుసుకునేందుకు తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి పి.గన్నవరం నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లు వెనకడుగు వేస్తున్నారు. రాజకీయంగా ఎంతో చైతన్యం కలిగిన పి. గన్నవరం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలమైన కేడర్ తో ముందుకు వెళ్తోంది. టిడిపి అధిష్టానం ఆదేశాలను పాటిస్తూ ఏ పక్షంలో ఉన్నా (అధికార, ప్రతిపక్ష) పాటించడమే వారి విధి. 201924 వరకు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను వ్యతిరేకించి పోరాడిన చరిత్ర పి.గన్నవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీది. రాష్ట్రంలో 2024లో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పి.గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో మండల కమిటీల నియామకం రూపంలో వర్గ పోరు బహిర్గతమయి,రెండు వర్గాలుగా చీలిపోయింది. నియోజవర్గంలోని అంబాజీపేట,అయినవిల్లి, మామిడికుదురు మండలాల్లో గ్రామ కమిటీల అధ్యక్ష, కార్యదర్శుల ఓట్ల రూపంలో మండల కమిటీలు ఎంపిక నిర్వహించి,పి.గన్నవరం మండల కమిటీ ఎంపికను వాయిదా వేసినట్లు తెలిసింది.ఈనెల రెండు నుండి ప్రారంభించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నియోజకవర్గంలో అట్టహాసంగా ప్రారంభించి మూడు రోజులు నిర్వహించి, నాల్గవ రోజు నుంచి తెలుగు తమ్ముళ్లు గ్రామాల్లో కనిపించకుండా పోయారు. నియోజవర్గ టిడిపి కన్వీనర్ గా వ్యవహరిస్తున్న రాజోలు నియోజకవర్గంనకు చెందిన నాయకుడి ప్రమేయం తమకక్కర్లేదని,పి.గన్నవరం నియోజవర్గంలో తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకుండా ఆయనను కట్టడి చేసే వరకు తాము పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనమని ఒక వర్గం పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తే, కొత్తపేట నియోజకవర్గం చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడి ప్రమేయం పి.గన్నవరం నియోజకవర్గంలో ఉన్నంతవరకు తాము పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటామని మరో వర్గం పార్టీ అధిష్టానానికి ఫిర్యాదులు చేశారని తెలిసింది. తెలుగుదేశం పార్టీ చేపడుతున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించకుండా మూడు రోజుల్లోనే మూలన పెట్టేశారు. అధికారం లేనప్పుడు ఐక్యంగా ఉండి, అధికారం చేపట్టిన తర్వాత వర్గాలుగా విడిపోవడంతో కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు.

# రాజధాని అవసరాలకు కృష్ణానదిలో ఇసుక తవ్వకాలకు అనుమతి

**విజయవాడ,జులై 15,ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి నిర్మాణ అవసరాలకు ప్రకాశం బ్యారేజీకి ఎగువున కృష్ణా నదిలో పూడిక ఇసుకను తవ్వి తీసేందుకు (డీసిల్టేషన్)కు,దానికి రూ.286.20 కోట్లు వెచ్చించేందుకు సీఆర్‌డీఏకు ప్రభుత్వం పాలనాపరమైన అనుమతులిచ్చింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇసుక తవ్వకాలకు టెండరుల పిలిచే భాధ్యతను జలవనరుల శాఖకు...పర్యవేక్షణ భాధ్యతను సీఆర్‌డీఏకు అప్పగించింది. టెండర్ల ప్రక్రియ నిర్వహణకు సీఆర్‌డీఏ ఒక కమిటీని ఏర్పాటు చేస్తుంది. అన్ని రకాల అనుమతులతో పాటు నిబంధనలకు అనుగుణంగా ఇసుక త్వకాలు చేపట్టేందుకు సీఆర్‌డీఏకు పరిశ్రమల శాఖ అనుమతులు జారీ చేసింది.

# తిరుమల సమాచారం

## కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

### - మధ్యాహ్నం 12గంటలకు సర్వదర్శనం మొదలు



**తిరుమల,జూలై 15ప్రభాత వార్తప్రతినిధి:** ఆపద మొక్కులవాడు ఏడు కొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినం పురస్కరించుకుని మంగళవారం
ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, అధికారులు మహాయజ్ఞంలా ఈ కార్యక్రమంలో పాల్గొని ఆలయం అంతటా సుగంధపరిమళ ద్రవ్యంతో శుద్ధి చేశారు. ఉదయం 6గంటల నుండి 11గంటల వరకు సాగిన ఈ మహాయజ్ఞంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ జె.శ్యామలరావు ,అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులు పనబాకలక్ష్మి, భానుప్రకాశ్‌రెడ్డి, నరేష్‌కుమార్, శాంతారాం,సదాశివరావు, జంగాకృష్ణమూర్తి, జానకిదేవి,మహేందర్‌రెడ్డి, టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ అర్చకులు, ఉద్యోగులు పాల్గొని ఆలయంలోపల బంగారువాకిలి నుండి ఉప ఆలయాలు, మహాద్వారం వరకు నీటితో శుభ్రంగా కడిగారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం,గంధంపొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంద ద్రవ్యాలు కలగలిపిన పరిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా సంప్రోక్షణ చేశారు. ఉదయం 11గంటలకు ప్రోటోకాల్ విఐపిలకు బ్రేక్ దర్శనం చేయించి నంతరం మధ్యాహ్నం 12గంటలకు సర్వదర్శనం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈసందర్భంగా ఆలయంలో జరగాల్సిన అష్టదళపాదపద్మారాధన సేవ రద్దయ్యింది. ఏడాదిలో ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, ఉగాది ఆస్థానం, వైకుంఠ ఏకాదశికి ముందువచ్చే మంగళవారాల్లో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టడం ఆనవాయితీ. ఆలయంలో (నేడు)బుధవారం ఉదయం నుండి రాత్రి వరకు సాలకట్ల ఆణివార ఆస్థానం నిర్వహిస్తారు. ఆలయం లోపల ఆనందనిలయంలోని గరుడాళ్వార్‌సన్నిధిలో ఈ వేడుక జరిపిస్తారు. సాయంత్రం ఉభయదేవేరులతో కలసి మలయప్పస్వామి సువాసనల పుష్పపల్లకిపై ఊరేగుతారు.

## అలిపిరి పాదాలమండపంలో ఆలయ శుద్ధి




**తిరుమల,జూలై 15ప్రభాత వార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి అలిపిరి వద్ద ఉన్న పాదాలమండపం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. మంగళవారం ఉదయం పాదాలమండపంలోని ఆండాల్ అమ్మవారి(గోదాదేవి) సన్నిధి, పెరియాళ్వార్‌సన్నిధి, లక్ష్మీనారాయణస్వామి సన్నిధిలలో మూలవిరాట్టులకు వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచి సుంగధపరిమళ జలంతో ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. ఆ తరువాత స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ విఆర్ శాంతి, ఎఇఒ ఏ.భాస్కర్‌నారాయణచౌదరి, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

## భక్తులకు సౌకర్యాలపై ఛైర్మన్ నాయుడు ఆరా



**తిరుమల,జూలై 15ప్రభాతవార్తప్రతినిధి:** సుదూరప్రాంతాల నుండి తిరుమలకు వచ్చిన భక్తులకు కొండపై వసతి,అన్నప్రసాదాలు, దర్శనం వంటి సౌకర్యాలు ఎలా ఉన్నాయని సామాన్యభక్తులను తానూ ఓ భక్తుడిగా మారి ఛైర్మన్ బిఆర్‌నాయుడు సమాధానాలు రాబట్టారు .మంగళవారం సాయంత్రం సహస్రదీపాలంకారసేవ అనంతరం ఆయన బోర్డు సభ్యులు పనబాకలక్ష్మి, శాంతారాం, నరేశ్, జానకిదేవిలతో కలసి ఆలయం ముందు,లడ్డూప్రసాద వితరణ శాల, అన్నదానంభవనం ప్రాంతాల్లో భక్తులతో మమేకమయ్యారు. వారిలో ఓ భక్తుడిగా ఇక్కడ సదుపాయాలు ఎలా ఉన్నాయి?తాగునీరు శుభ్రత, అన్నప్రసాదాలు రుచి, క్యూలైన్లలో సక్రమంగా అందుతున్నాయా అని భక్తులను అడిగి తెలుసుకున్నారు. తిరుమలలో మెరుగుపడిన సదుపాయాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా క్యూలైన్లలో సౌకర్యాలు బావున్నాయన్నారు.

## తిరుమల గురించి మాట్లాడేందుకు బండి సంజయ్ ఎవరు?

### తిరుపతిలో మాజీమంత్రి డాక్టర్ చింతా మోహన్




**తిరుపతి,జూలై 15ప్రభాత వార్తప్రతి నిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల గురించి వ్యా ఖ్యలు చేయడానికి బండి సంజయ్ ఎవరని?తిరుమలలో మల మూత్రాలు శుభ్రం చేస్తున్న వారిలో అనేకమంది అన్యమతస్తు లేనని, వారంతా ప్రతి ఆదివారం చర్చికి వెళుతున్నారని కాంగ్రెస్ పార్టీ మాజీకేంద్ర మంత్రి డాక్టర్ చింతామోహన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అన్యమతం పేరుతో వారందరినీ తీసేసి, తెలంగాణా నుండి 5వేలమంది కార్మికులను తీసుకువచ్చి తిరుమలలో మరుగుదొడ్లు శుభ్రం చేయించగలవా?కడిగించగలవా అనే ఘాటైన ప్రశ్నలు గుప్పించారు. బిజెపి నాయకులకు అభివృద్ధి గురించి పట్టదా?వేరే మాటలు రావా, ఎప్పుడూ పదేపదే అన్యమతం అంటూ రచ్చచేస్తారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కూటికి లేక ఉద్యోగాలు లేక ప్రజలు ప్రాణాలు పోతున్నాయని, వారి గురించి పట్టించుకుని ఆలోచన చేయాలని కోరారు. తిరుమల ఆలయంలో అంటరానితనం స్పష్టం కనిపిస్తోందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నపుడు తిరుమల ఆలయంలో పేష్కార్, డిప్యూటీ ఇఒ పోస్టులు ఎస్సీలకు ఇచ్చామని అన్నారు. కూటమిప్రభుత్వ పాలనలో ఆలయంలో ఒక ఎస్సీ అధికారి కూడా లేడని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బిసిలకు పెద్దపీట వేశామని చెబుతున్న టిడిపి టిటిడిలో ఎంతమంది బిసిలకు పెద్దపీట వేశారో జవాబుచెప్పాలని డిమాండ్ చేశారు. టిటిడిలో పనిచేసే అర్చకులకు ఒక్కొక్కరికి 5సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని గత సంవత్సరకాలంలో 36 సార్లు ఆందోళన చేసినా పట్టించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెంటనే జోక్యం చేసుకుని టిటిడి అధికారులు, ఉద్యోగులు, అర్చకులకు 5సెంట్లు అలిపిరి వద్ద ఇవ్వాలని చింతామోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం టిటిడి పరిపాలన భవనం వద్ద ఆయన కాంగ్రెస్‌పార్టీ నేతలు యార్లపల్లిగోపి, రవి,తేజోవతి, మునిశోభ, బాలగురవయ్య తదితరులతో కలసి నిరసన తెలిపారు.

## పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంకు వైద్యపరికరాల సరఫరాకు ఇ టెండర్

**తిరుమల,జూలై 15ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలోని పద్మావతిచిన్నపిల్లల హృదయాలయం ఆస్పత్రికి అవసరమైన వైద్య పరికరాలను సరఫరా చేయడానికి అర్హులనుండి ఈ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు టిటిడి తెలిపింది. జూలై 25వతేదీ సాయంత్రం 4.30గంటలకు టెక్నికల్ బిడ్ ఉంటుంది. ఆసక్తిఉన్నవారు "శ్రీవేంకటేశ్వర ప్రాణదానట్రస్ట్ "పేరున ఒక లక్షరూపాయలు డిడి తీసి ఈ టెండర్‌లో పాల్గొనాలి.
మరిన్ని పూర్తి వివరాలు "డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. తిరుమల. ఒఆర్‌జి, హెచ్‌టిటి పిఎస్: //టెండర్. ఎపిఇప్రోక్యూర్ మెంట్. జిఒవి.ఇన్‌లో తెలుసుకోవచ్చు.

వార్త

ఒక పని అంటే గాని, లేదా దానివల్ల కలిగే ఫలితాలంటే గాని భయపడి, ఆ పని చేయడాన్ని మానుకోవడం చాలా చిన్నతనం.


-మహాత్మాగాంధీ

# రాజకీయ నాయకులకూ 'విరమణ' అవసరమే!

**ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు ఏ ఉద్దేశంతో చేసినవో గాని మొత్తానికి అన్ని రాజకీయ పార్టీలో ఈ అంశం పెద్ద రాజకీయ దుమారమే లేపిందనే చర్చ జోరుగా సాగుతుంది. రాజ్యాంగపరంగా రాజకీయాల్లో నాయకులకు రిటైర్మెంట్ వయసుకు సంబంధించిన అంశం ఎంతవరకు సాధ్యం అన్న విషయాన్ని పక్కన పెడితే, వయసు పైబడిపోతున్న కొందరు చివరి వరకు రాజకీయాల్లో అలాగే కొనసాగుతూ ఉండడం, ఆధునిక రాజకీయ వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రూపాంతరం చెందిన నేటితరం యువ రాజకీయ నాయకత్వానికి కొన్ని సందర్భాల్లో తప్పితే చాలావరకు రాజకీయాల్లో మెరుగైన అవకాశాలు రాకపోవడానికి ఒక కారణం కావచ్చు అనే సంశయం కలగక మానదు. ఏదేమైనప్పటికీ దేశ రాజకీయ వ్యవస్థలో అన్ని రాజకీయ పార్టీలలో వయసులో పెద్దవారై రాజకీయాల్లో విశేష అనుభవం కలిగిన నాయకులు ఈతరం నాయకులకు మార్గదర్శకులుగా ఉంటూ, మంచి ఆలోచన వివేచన నిర్ణయాత్మక ధోరణిగల యువ నాయకత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందనే వాదనలు సమాజంలో వినిపిస్తుండడం గమనార్హం.**

దాడిశెట్టి శ్యామ్ కుమార్

ఇటీవల ఒక సమావేశంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అధినేత మోహన్ భగవత్ మాట్లాడుతూ రాజకీయాల్లో డెబ్బై ఐదు సంవత్సరాలు వయసు పైబడిన నాయకులు స్వచ్ఛందంగా హుందాతనంగా రాజకీయాల నుండి తప్పుకోవాలన్న సూచన,రాజకీయాలలో కొత్తవారికి ప్రాధాన్యత ఇవ్వాలన్న భావనకు దారితీస్తుందనే భిన్న అభిప్రాయాలు దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీల్లో సంచలనాలు రేపుతున్నాయి. అయితే రాజకీయాల్లో స్వచ్ఛంద విరమణ ప్రామాణికం డెబ్బైఐదు ఏళ్ల వయస్సు తర్వాతే ఎందుకని ఆర్‌ఎస్‌ఎస్ అధినేత వ్యాఖ్యలు ఉన్నాయన్న అంశంపై రాజకీయాల్లో విభిన్న వాదనలు తెర పైకి వస్తున్నాయి. ఈ క్రమంలో అసలు రాజకీయంలో వయస్సు పైబడిన వారికి రాజకీయాల నుండి నిష్క్రమణ ఎందుకు ఉండకూడదు అనే చర్చ మరోవైపు కొనసాగుతుంది. రాజ్యాంగ ప్రకారం ఎమ్మెల్యే, ఎంపీ కావాలన్నా ఒక ప్రత్యేకమైన వయసు పరిమితి నిర్ధారించిన భారత రాజ్యాంగం మరి రాజకీయాల నుండి తప్పుకోవడానికి రాజకీయ నాయకులకి ఏ వయసు వరకు పరిమితం కావాలని సూచించిన దాఖలాలు ఉన్నాయా లేవా అనే అంశాన్ని పక్కన పెడితే, రాజకీయ నాయకులు డెబ్బై ఐదు సంవత్సరాల జీవిత గమనంలో ప్రజల చేత ఎన్నుకోబడి ప్రజల సమస్యలకు స్వయంగా తీసుకునే నిర్ణయాలు సమస్య పరిష్కారానికి ఏ మేరకు ప్రభావితం చేయగలరనే సంశయం కొందరిలోనైన లేకపోలేదు. డెబ్బై ఐదు ఏళ్లు పూర్తయినా మనసు స్థిరంగా ఉన్నా, వయసు పైబడుతుంటే చాలావరకు శరీరం అనుకున్న స్థాయిలో సహకరించక పోవడం సహజం. అలాంటి పరిస్థితుల్లో కొత్త తరం యువ నాయకత్వంపై తప్పనిసరిగా దృష్టి సారించాల్సిన పరిస్థితులు ప్రత్యామ్నాయంగా అత్యవసరమవుతాయని అర్థం చేసుకోగల మనస్తత్వం అన్ని పార్టీలోని రాజకీయ నాయకులలో ఉండాల్సిందేమో. ప్రస్తుత ఆధునిక సాంకేతిక యుగంలో అనేక సంవత్సరాలు అనుభవం ఉన్న రాజకీయ నాయకత్వం కొత్త తరం యువ నాయకత్వానికి ప్రతిబింబంవలె గోచరిస్తూ, కొత్త తరం నాయకత్వానికి మార్గదర్శకులుగా ఉండి యువ నాయకత్వాన్ని సరేన దిశానిర్దేశంలోముందుకు నడిపించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందనే భావన అవకాశాలు రావటం లేదన్న కొత్తతరం యువ రాజకీయ నాయకులలో కొంతైన ఉంటుందని భావించే వారు లేకపోలేదు. ప్రస్తుతం దేశంలో వచ్చే ఎన్నికల వరకు అనేక రాజకీయ పార్టీలలో నాయకులు చాలావరకు పది పదులు దాటిన



వయసున్నవారే అధికంగా ఉండడం విశేషం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగస్తులకు పదవి విరమణ వయసు ఉన్నట్లు రాజకీయాల్లో కూడా పదవి విరమణ అనేది సాధ్యమవుతుందా కాదా అనే చర్చ సమాజంలో జోరుగా సాగుతుంది. నిజానికి గత ప్రభుత్వ ఉద్యోగులకు పదవి విరమణ పెన్షన్ విధానం ఉన్నట్లు ఎమ్మెల్యే, ఎంపీలకు కాలపరిమితితోపాటు వారి హోదాలను బట్టి నెలనెలా జీతాలు ఉంటాయి. తిరిగి వారు ఎన్నిక కాక పోయినా జీవితాంతం వారికి ప్రత్యేక పెన్షన్‌తో పాటు అనేక సదుపాయాలు ఉంటాయి. అలాంటప్పుడు రిటర్మెంట్ వయసు ఎందుకు ఉండకూడదు అనే సందేహం సమా జంలో లేకపోలేదు. రాజకీయ నాయకుల రిటైర్మెంట్ వయసు గురించి మోహన్ భగవత్ చేసిన సూచనలు ఏవిధంగా ఉన్నప్పటికీ, రాజకీయ నాయకులకు స్వచ్ఛంద రాజకీయ విరమణ విషయంలో అవసరమైతేతప్ప వ్యక్తి గతంగా రాజకీయాల నుంచి తప్పుకోవడానికి అవకాశం ఉంటుందేమో కానీ, రాజకీయంలోకి పోయిన తర్వాత ప్రజలు ఎన్నుకున్నంత కాలం నాయకులు రాజకీయాల్లో కొనసాగుతూ వస్తుండడం దేశ చరిత్రలో ఆనవాయితీగా వస్తూనే ఉంది. కాని మితిమీరిన వయస్సు ఎవరైనా సరే ఏ వృత్తిలోనైనా ఎల్లప్పుడూ అనుకున్న పనులు చేయుటకు శరీరం సహకరించదనే విభిన్న అభిప్రాయాలు సమాజంలో లేకపోలేదు. అధిక వయసులో ఉన్నవారు దేశ రాజకీయాల్లో ప్రాధాన్యత గల పదవుల్లో ఉన్నప్పుడు దేశ అంతర్జాతీయ విషయాల్లో సమర్థవంతమైన భావ వ్యక్తికరణ సరియైన మూర్తిమత్వాన్ని ప్రదర్శించాల్సి వచ్చినప్పుడు రాజకీయఅనుభవం ఒక మహా ఆయుధంగా కొన్ని సందర్భాల్లో ఉపయుక్తమైన, మరి కొన్ని సందర్భాల్లో అన్ని విధాల అర్హత కలిగి దేశ రాజకీయాల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచే యువనాయకత్వం కూడా అవసరమనే వాదనలు తెరపైకి రాకమానవు. ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు ఏ ఉద్దేశంతో చేసినవో గాని మొత్తానికి అన్ని రాజకీయ పార్టీలో ఈ అంశం పెద్ద రాజకీయ దుమారమే లేపిందనే చర్చ జోరుగా సాగుతుంది. రాజ్యాంగపరంగా రాజకీయాల్లో నాయకులకు రిటైర్మెంట్ వయసుకు సంబంధించిన అంశం ఎంతవరకు సాధ్యం అన్న విషయాన్ని పక్కన పెడితే, వయసు పైబడిపోతున్న కొందరు చివరి వరకు రాజకీయాల్లో అలాగే కొనసాగుతూ ఉండడం, ఆధునిక రాజకీయ వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రూపాంతరం చెందిన నేటితరం యువ రాజకీయ నాయకత్వానికి కొన్ని సందర్భాల్లో తప్పితే చాలావరకు రాజకీయాల్లో మెరుగైన అవకాశాలు రాకపోవడానికి ఒక కారణం కావచ్చు అనే సంశయం కలగక మానదు. ఏదేమైనప్పటికీ దేశ రాజకీయ వ్యవస్థలో అన్ని రాజకీయ పార్టీలలో వయసులో పెద్దవారై రాజకీయాల్లో విశేష అనుభవం కలిగిన నాయకులు ఈతరం నాయకులకు మార్గదర్శకులుగా ఉంటూ, మంచి ఆలోచన వివేచన నిర్ణయాత్మక ధోరణిగల యువ నాయకత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందనే వాదనలు సమాజంలో వినిపిస్తుండడం గమనార్హం. ●

# పేదలకు అందని ప్రభుత్వ వైద్యం?

సీజన్ మారినప్పుడల్లా విజృంభిస్తున్న దోమలు వాటి వల్ల ప్రబలే రోగాలతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది విలవిల్లాడుతున్నారు. విషజ్వరాలు ఏమీ కొత్తకాదు. వర్షాకాలం ఆరంభంతో పాత నీరుపోయి, కొత్తనీరు రావడంతో రోగాలు విజృంభిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాలతోసహా దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రజలను అతలాకుతలం చేస్తున్నాయి.ఈ యేడాది ఇప్పటికే విషజ్వరాల బారినపడి బీదా, బిక్కి,ధనిక,అని తేడా లేకుండా అల్లాడిపోతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు, ప్రభుత్వ దవాఖానాలన్నీ కిటకిటలాడిపోతున్నాయి. ఈ వ్యాధులు సోకిన లక్ష్మీప్రసన్నుల సంగతి అలా ఉంచితే మధ్యతరగతి, మరీ ముఖ్యంగా రెక్కాడితే డొక్కాడని రోజూ కూలీలు, చిన్నాచితక వ్యాపారాలపై ఆధారపడి జీవనం సాగించేవారి పరిస్థితి దారుణంగా ఉంది. ఇక ఏనాడో కూకటివేళ్లతో పెకిలించామని చెప్పుకుంటున్న వ్యాధులు కూడా అక్కడక్కడ కన్పిస్తున్నాయి.పాతరోగాలు తిరిగి మొలకెత్తి విస్తరిస్తుండడం ఆందోళన కలిగిస్తున్నది. ముఖ్యంగా భారత్ ఎదుర్కొంటున్న ప్రధాన ఆరోగ్య సమస్యల్లో మలేరియా ఒకటిగా చెప్పొచ్చు. ఒకనాడు ఈ వ్యాధి సోకిందంటే ప్రాణాలు పోయినట్లేనని భయాందోళనలు చెందేవారు. 1947లో దాదాపు ఏడు న్నర కోట్ల మందికి ఈ వ్యాధి సోకగా సుమారు ఎనిమిదిన్నర లక్షల మందికిపైగా మరణించారు. ప్రధానంగా జూన్, సెప్టెంబరుల మధ్యనే ఈ వ్యాధి విస్తరించేది. ఆనాటి నుంచే చేస్తున్న పరిశోధనలు,నూతన మందులు, చికిత్స విధానంలో మార్పుల ఫలితంగా తగ్గుముఖం పట్టాయనే చెప్పొచ్చు. గత యేడాది రెండు లక్షల ఇరవై ఏడువేల మందికి ఈ వ్యాధి సోకగా మరణాలసంఖ్య కేవలం ఇరవైమూడుకు తగ్గించగలిగారు. కేంద్రప్రభుత్వం 2006లో 'జాతీయ వ్యూహాత్మక మలేరియా నిర్మూలన ప్రణాళిక' ద్వారా ఆ వ్యాధి వ్యాపిస్తున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపట్టింది. ఒడిశా,మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ప్రత్యేక చికిత్స విధానాన్ని చేపట్టి వ్యాధి ఒకరి నుంచి మరొకరికి రాకుండా అడ్డుకట్ట వేయగలిగారు. నగరాలు, పట్టణాల్లో కొంతవరకు నియంత్రించగలుగుతున్నా ఏజెన్సీ ప్రాంతాల్లో పరిస్థితి ఆందోళనకర రంగా ఉంది. జనాభాలో ఎనిమిది శాతానికిపైగా ఉన్న గిరిజనుల్లో మలేరియా బారినపడుతున్న వారి సంఖ్య సగానికి కంటే ఎక్కువగా ఉండొచ్చని అంచనా. మెదడులో వ్యాపించే ప్రమాదకర పాల్సీ పారం మలేరియా మృతుల్లో అరవైఐదు శాతానికి పైగా గిరిజనులే.అడవుల్లో, కొండ ప్రాంతాల్లో తేమ వాతావరణం దోమల వ్యాప్తికి కారణమవుతున్నది. ఛత్తీస్‌గడ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి తెలుగు రాష్ట్రాల్లోకి ప్రవేశిస్తున్న దోమల్లో ఇమ్యూనిటీ పెరగడంవల్ల వాడుతున్న మందులు వాటిని నియంత్రించలేకపోతున్నట్లు డాక్టర్లే అంగీకరిస్తున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా పారిశుధ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలకుతిలోదకాలు ఇవ్వడం వల్లదోమలు పెద్దఎత్తున ఉత్పత్తికావడం, రకరకాల వ్యాధుల విస్తరణకు కారణమవుతున్నాయి. సిబ్బంది, నిధుల కొరతతోగ్రామీణ ప్రాంతాల్లో ప్రధానంగా ఏజెన్సీల్లో పరిస్థితి రోజురోజుకూ దారుణంగా తయారవుతున్నది. ఉన్న సిబ్బందిని కూడా ఆయా ప్రాంతాలకు పంపించి చికిత్స అందించడంలో పాలకులు విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. భారత్‌ను మలేరియా రహితంగా మార్చాలనే లక్ష్యం నెరవేరాలంటే గ్రామీణరంగంలో వైద్యాన్ని మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉంది.ప్రత్యేక నిధులను కేటాయించి పారి శుధ్యాన్ని మెరుగుపర్చాలి. ఇక కొత్తరోగాల గురించిప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.డెంగ్యూ, చికెన్‌గున్యా, స్వైన్‌ఫ్లూ లాంటి వ్యాధులు విజృంభిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో చికెన్‌గున్యా వ్యాధి గ్రామీణులను గడగడలాడిస్తున్నది. ఒకటి, రెండు రోజులు కాదు, నెలల తరబడి ఈ వ్యాధిసోకిన వారు మంచాన్ని వదలలేకపోతున్నారు. కొందరైతే రోజువారీ కాలకృత్యాలకు కూడా మరొకరి సహాయం లేకుండా చేసుకోలేకపోతున్నారు. ఈ వ్యాధివల్ల ప్రాణం పోకపోవచ్చు కానీ ఈ వ్యాధి ఇతర వ్యాధులకు తోడైతే ప్రాణాపాయం కలుగవచ్చునని వైద్యనిపుణుల అభిప్రాయం. ఇక డెంగ్యూ వ్యాధి ఇంకా వదలిపెట్టడం లేదు. ఇప్పటికీ డెంగ్యూతో మరణించేవారి సంఖ్య పెరుగుతూనే ఉన్నది. అన్నింటికంటే ముఖ్యంగా రోగ నిర్ధారణ ఒక మిథ్యగా మారుతున్నది. మామూలు జ్వరం లేక,డెంగ్యూనా, మరేదన్నా అనే విషయంకోసం పరీక్షలు చేయడంలోనే జాప్యం జరిగితే వ్యాధి ముదిరి ప్రాణాలకు ముప్పు తెస్తున్నది. ముఖ్యంగా వైద్యసహాయానికి ఆమడదూరంలో ఉండే మారుమూల ప్రాంతాల్లోని ప్రజల పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. స్వాతంత్య్రం వచ్చి ఏడున్నర దశాబ్దాల దాటినా నేటికీ కనీస ప్రాథమిక అవసరాలు తీర్చడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమ వుతున్నాయి.రాజ్యాంగం ప్రకారం ప్రజల జీవన ప్రమాణాలను పెంచి ఆరోగ్యాన్ని మెరుగుపరచడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యతల్లో ఒకటి. ఆరోగ్యం అనేది ప్రజల ప్రాథమిక హక్కు. దాన్ని ప్రజలకు సమకూర్చడంలో ప్రభుత్వాలు ఏమేరకు సఫలం అవుతున్నాయో చెప్పక్కర్లేదు. యేటా వేలాది కోట్ల రూపాయలు ఖర్చుపెడుతూ ఎన్నో సంస్కరణలు చేస్తూ ప్రభుత్వ వైద్యరంగం పురోగమిస్తుందని చెప్పుకుంటుంటే కేవలం కొందరి నిర్వాహకం వల్ల ప్రభుత్వ ఆస్పత్రుల పట్ల ప్రజల్లో నమ్మకం అంతకంత సన్నగిల్లుతున్నది. మొన్న కరోనా విజృంభణ సమయంలో దేశంలో వైద్యరంగం డొల్లతనం బయటపడింది. కనీసం ప్రాణవాయువు అందించలేకపోవడంతో ఎందరో ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఇప్పటికైనా పాలకులు ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతీసుకొని అవసరమైన చర్యలు చేపట్టాలి.

లోకులు తొందరగా నిందిస్తారు. అంతే త్వరగా అభినందిస్తారు కూడా. అందువల్ల ఇతరులు నిన్ను గురించి అనుకునే మాటలకు అంత విలువ ఇవ్వొద్దు.

రామకృష్ణ పరమహంస

ప్రతి మనిషిలోనూ ఆవరించి ఉన్న పిశాచం స్వార్థం. స్వార్థంలో ప్రతి అంశం, ప్రతి భాగం పిశాచమే.

స్వామి వివేకానంద

## ప్రజావాక్కు



### జనాభాను పెంచండి

ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి యువతరాన్ని ఎక్కువ మంది పిల్లలను కనమని సందేశం ఇచ్చారు. కొంతకాలం క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతులను చూసి వరి పంట పండించవద్దని హెచ్చరించారు. పై మూడు అంశాల్ని విడివిడిగా పరిశీలిస్తే విజయవాడలో గవర్నమెంట్‌హాస్పిటల్ పనిచేస్తున్న యువగైనకాలజిస్ట్ ముఖ్యమంత్రి గారితో ముఖాముఖిలో ఈ విషయంపై నిలదీశారు. ఉపాధి అవకాశాలతో తక్కువగా ఉన్న ఈ రోజుల్లో ఎక్కువమంది పిల్లల్ని కంటే ఎవరు పెంచుతారని ఆమె అడిగారు? వరి పంట పండిం చవద్దని,పొగాకు పత్తివంటి వ్యాపార పంటలను పండించ మనిపిలుపునిస్తూ అమరావతి రాజధాని పేరు పెట్టి కొన్ని వేల ఎకరాలు కాంక్రీట్ జంగిల్ చేయాలని చూస్తున్నారు.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### ఉపాధ్యాయులను వేధించవద్దు

మెగా పిటిఎంను జూలై 10వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అందరూ ఉపాధ్యాయులు తమకు శక్తి మేరకు విద్యార్థులు, తల్లిదండ్రులు,దాతలు, ప్రజాప్రతినిధులు, సహకారంతో విజయవంతం చేశారు. ఇప్పుడు అప్లోడ్ చేసిన ఫోటోలు వీడియోలు బాగోలేదు మరలసరిచూసి బాగున్నవి అప్లోడ్ చేయండి అని చెప్పడం సరికాదు. ఈ కార్యక్రమాలు నిర్వహించిన సందర్భంలోనే విద్యాశాఖ వారు మంచి సామర్థ్యం ఉన్న కెమెరాతో కెమెరామెన్ కూడా నియామకం చేస్తే బాగుండేది. ఉపాధ్యాయులు తమ శక్తి మేరకుతాము తీయించిన ఫోటోలు అప్లోడ్‌చేశారు. ఫోటోలు బాగో లేకపోతే రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయానికి వెళ్లి ఇవ్వాలి. సంజాయిషీలు తెలపాలి అనడం సరైనది కాదు.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### ఎంజిఎం ఆసుపత్రిని పట్టించుకోండి

ఉత్తర తెలంగాణ జిల్లాలోవరంగల్ కేంద్రంగా ఉన్న ఎంజిఎం ఆసుపత్రికి నిత్యం వేలాది మంది వివిధ జబ్బులతో బాధపడుతూ రోగులురావడం జరుగుతుంది. కొన్ని విభాగాలలో డాక్టర్లు అందుబాటులో లేకపోవడం వల్లా వివిధ రోగాలతో బాధపడేవారు ఇబ్బందులు పడుతూ వున్నారు. ప్రభుత్వంస్పందించి డాక్టర్స్ సమయపాలన పాటించేలా, రోగులకు మంచి వైద్యం అందించేలా కృషి చేయాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### అమెరికా దుందుడుకు చర్య

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 2024లో మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ నినాదంతో భారీ విజయం సాధించి గద్దెనెక్కారు. ట్రంప్ అధ్యక్ష పదవి చేపట్టిన తరువాత ప్రపంచ దేశాల వాణిజ్య వ్యవహారాల విషయంలో అనుసరిస్తున్న తీరు వివాద స్పదమవుతోంది. ఆయా దేశాలపై విధిస్తున్న సుంకాల విషయంలో గడువు తేదీలుపెట్టడం, అమెరికా ఎగుమతి చేసే వాటిపై అధిక సుంకాలు విధిస్తూ, అమెరికా దిగుమతి చేసుకునే వాటిపై సుంకాలను తగ్గించుకునే విధంగా ప్రపంచ దేశాలను ఒత్తిడి చేయటం దుందుడుకు చర్య. 'రాను రాను రాజు గుఱ్ఱం గాడిద'గా మారిన చందంగా అమెరికా వ్యవహారశైలి ఉంటోంది. గతంలోనిఅమెరికా ప్రభుత్వాలు ప్రపంచదేశాలకు నిధులను మంజూరు చేసి ప్రపంచ దేశాలను తన గుప్పెట్లో పెట్టుకునేది. ఇప్పుడు, అప్పటి పరిస్థితులు లేవు. అన్ని దేశాలు కొద్దో గొప్పో అభివృద్ధి చెందాయి. ఆ కారణం చేత ప్రపంచ దేశాలపై సుంకాలు అధికంచేస్తోంది.ప్రతిదేశానికి వాణిజ్యపరమైన కొన్ని ప్రణాళికలు ఉంటాయి. ప్రపంచంలో అమెరికా మాత్రమే దేశం కాదు. అన్ని దేశాలు సమానంగా మనుగడ సాగించే వీలు ఉంటుంది.

-కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### అందని యూరియా.. సాగు సాగేదెట్లా?

వానాకాలం మొదలయ్యి ఇప్పటికే నెలన్నర దాటింది. ఇప్పటికే లోటు వర్షాపాతంతో బాధపడుతున్న రైతన్నలకు యూరియా కరవు దిగులును మిగులుస్తుంది. దాన్ని అదనుగా తీసుకొని దళారి వ్యాపారులు నల్ల మార్కెట్‌కు తెరతీశారు. దీనివల్ల రైతు మరింత ఇబ్బందుల పాలయ్యే పరిస్థితి ఉంది. ప్రభుత్వం స్పందించి ఒక ఐఎస్ ఆఫీసర్‌ను నోడల్ ఆఫీసర్‌గా పెట్టి ఎక్కడికక్కడ పరిస్థితిని చక్కదిద్దాలి. లేకపోతే రైతులు మరింత నష్టపోయే ప్రమాదం పొంచి ఉంది.

- భారత అవినాష్,జనగామ

### తెలుగు, హిందీ, టీచింగ్‌పై నిర్లక్ష్యం

ప్రతి విద్యా సంస్థలలో, గురుకులాల్లో తెలంగాణ రాష్ట్ర మాతృ భాష అయిన తెలుగు, జాతీయ మాతృ భాష అయిన హిందీ భాషా నిర్లక్ష్యంచేయడం జరుగుతుంది. కాబట్టి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుకుంటున్నవిద్యార్థులకు తెలుగు,హిందీ భాషలలో అక్షరాలు చదవడం రాయడం రావడం లేదు. కనీసం అక్షర జ్ఞానం లేని విద్యార్థులు ఉంటున్నారు. పార్ట్ టైం జాబ్ టీచర్స్ సమయ పాలన పాటించడం లేదు.

-రాపాక రవీందర్, జనగాం

మనవి

ఎడిట్ పేజీకి..


ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ అమలు సాధ్యమేనా?

యం.అర్జున్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న నిర్ణయం రాజకీయ,సామాజిక, చట్టపరమైన చర్చలకు దారితీసింది. ఈ నిర్ణయం కేంద్రరాష్ట్ర సంబంధాలు, రాజ్యాంగ సవరణలు, న్యాయ సమీక్షలు, కులగణన ద్వారా సేకరించిన గణాంకాల వివరాలతో ముడిపడి ఉంది. రిజర్వేషన్లను 50 శాతానికి పరిమితం చేసే తీర్పులు ఉన్నందున ఏదైనా రాష్ట్రం పరిమితికి మించి రిజర్వేషన్లు అమలు చేసే ప్రయత్నం చేసినపుడు అవి న్యాయ సమీక్షకు వెళ్లే అవకాశం ఉంటుంది. అయితే, ఈ పరిమితిని అధిగమించేందుకు కాంగ్రెస్ సర్కార్ ఆర్డినెన్స్ జారీ చేయాలని నిర్ణయించినట్టు వార్తలు వస్తున్నాయి. ప్రభుత్వం తరుపున కేవియేట్ పిటిషన్ వేసినా రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా ఉందంటూ ఆశావహ అభ్యర్థులు ఈ నిర్ణయంపై హైకోర్టు లేదా సుప్రీం కోర్టుకు వెళ్ళినపుడు న్యాయ సమీక్షకు గురయ్యే అవకాశం లేకపోలేదు. రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా మాత్రమే ఈ రిజర్వేషన్‌కు చట్టబద్ధ రక్షణ లభిస్తుందని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. 2024లో నిర్వహించిన కులగణన ఈ రిజర్వేషన్ పెంపులో కీలక పాత్ర పోషించనుంది.ఈగణన ప్రకారం, తెలంగాణ జనాభా 3.70 కోట్లుగా, బిసిలు 56.33 శాతంగా నమోదైంది. ఇందులో ముస్లింలు 10.08 శాతం, హిందువులు 46.25 శాతం ఉన్నారు. ఎస్సీ కేటగిరి 17.43.శాతం, షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎస్టీ) 10.45 శాతం, ఓపెన్ కేటగిరీ 15.79శాతం, ముస్లింలు 2.48 శాతం ఉన్నారు. మొత్తం ముస్లింజనాభా 12.56 శాతం ఉన్నారు. ఈ సర్వేలో 3.54 కోట్ల మంది పాల్గొన్నారని మరో 16 లక్షల మంది సర్వేకు దూరంగా ఉన్నారని మొత్తం రాష్ట్ర జనాభా 3.70 కోట్లని ప్రభుత్వం తెలిపింది.ఈ గణాంకాలపై వివిధ కుల సంఘాలు సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి. 2014లో చేసిన సమగ్ర కుటుంబ సర్వేలో ముస్లింలను బీసీల్లో కలిపి లెక్కించారా, లేదా అన్నదానిపై స్పష్టత లేదు. 2001-2011 దశాబ్దవృద్ధి రేటును, రాష్ట్రంలో ఉన్న ఆధార్ కార్డులు, ఓటర్ కార్డుల్ని పరిగణిలోకి తీసుకున్నా రాష్ట్ర జనాభా నాలుగు కోట్లకు పైగా ఉంటుందన్నది వారి వాదన. 2011 జనగణన ప్రకారం తెలంగాణ జనాభా 3.50 కోట్లు, 2014 సమగ్ర కుటుంబ సర్వేప్రకారం 3.63 కోట్లుగా ఉంది.అంటే దాదాపు మూడు



న్నర ఏళ్లలో 13 లక్షల వరకు జనాభా పెరిగింది. కానీ, 2024 రాష్ట్ర జనాభా 3.70 కోట్లుగా తెలిపారు. 2014 నుంచి 2024 వరకు పదేళ్లలో కేవలం 7లక్షల జనాభా పెరిగినట్లు ఈ సర్వేద్వారా తెలుస్తోంది. ఇక్కడే పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ అంశం ఒకవేళన్యాయ సమీక్షకు వెళ్తే న్యాయస్థానాల్లో ఈ డేటా సమర్పించినప్పుడు, ఈ సర్వే విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తే అవకాశం లేకపోలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 2025 మార్చి 17న తెలంగాణ అసెంబ్లీ బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్‌ను 23 శాతం నుంచి 42 శాతానికి పెంచే బిల్లులను ఆమోదించింది. ఈ బిల్లు 50 శాతం పరిమితిని మించడం వల్ల, కేంద్రఆమోదం, రాజ్యాంగ సవరణ అవసరం. ఆర్డినెన్స్ ద్వారా రిజర్వేషన్ అమలు చేయడం న్యాయస్థానాల్లో నిలదొక్కుకోవడం కష్టమని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీతో పాటు పలు కుల సంఘాల నేతలు అధికార కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేస్తున్నారు. సుప్రీం కోర్టు 1992 ఇంద్రా సాహ్నికేసులో రిజర్వేషన్‌ను 50శాతంగా పరిమితం చేసింది. అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే ఈ పరిమితిని మించవచ్చని, దీనికి శాస్త్రీయమైన గణాంకాలు అవసరమని తీర్పును ఇచ్చింది. వివిధ రాష్ట్రాల్లో రిజర్వేషన్ పరిమితిని మించినప్పుడు న్యాయస్థానాలు జోక్యంచేసుకున్న సందర్భాలు చాలానే ఉన్నాయి. 2021లో మహారాష్ట్రలో మరాఠా రిజర్వేషన్ 50 శాతం పరిమితిని మించడంతో సుప్రీంకోర్టు దానిని రద్దుచేసింది. అసాధారణ పరిస్థితులను రుజువు చేయడంలో విఫలమైందని తీర్పు ఇచ్చింది. 2024లో బీహార్‌లో65శాతం రిజర్వేషన్‌ను పాట్నా హైకోర్టు రద్దు చేసింది. కులగణన డేటా సమర్థనీయం కాదని పేర్కొంది. తమిళనాడు 69శాతం రిజర్వేషన్‌ను 1994లో 9వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా చట్టబద్ధ రక్షణ పొందింది.ఇదే విధమైన రాజ్యాంగ రక్షణ కల్పించాలని బిసి కుల సంఘాల నేతలు అభిప్రాయపడుతున్నారు. లేకుంటే గతంలో వెలువడిన తీర్పుల వల్ల తెలంగాణలో 42 శాతం రిజర్వేషన్ అమలు న్యాయస్థానాల్లో నిలదొక్కుకోవడం కష్టమని వాపోతున్నారు. కేంద్రం 2026లో జనగణనతో పాటు కులగణన చేపట్టనుంది. తెలంగాణ కులగణన గణాంకాలు, కేంద్రం సేకరించే డేటాతో సరితూగకుంటే, రిజర్వేషన్ అమలు సంక్లిష్టమవుతుంది. కేంద్ర ఆమోదం లేకుండా రాష్ట్రం ఏకపక్షంగా చేసే ప్రయత్నాలు చట్టపరమైన సమస్యలను తెచ్చిపెడతాయి. రాష్ట్రం తన డేటాను కేంద్రానికి సమర్పించి, 9వ షెడ్యూల్‌లో చేర్చడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ, రాజకీయ ఒత్తిళ్లు, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల్లో వేర్వేరు పార్టీలు అధికారంలో ఉన్నపుడు ఈ ప్రక్రియను ఆలస్యం అయ్యే అవకాశం ఉంటుంది. రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్‌లో చేర్చడం లేదా న్యాయ సమీక్షకు వెళ్ళినపుడు శాస్త్రీయమైన గణాంకాల్ని సమర్పించడం ద్వారా ఈ రిజర్వేషన్ చట్టబద్ధమైన రక్షణ పొందే అవకాశం ఉంటుంది. ●

# హస్త భూషణమా! మస్తక వ్యసనమా?



మేకిరి దామోదర్

ఆధునిక సమాజంలోని మనుషులు వివిధ రకాల భావజాలాలతో ఉంటారు. అలా మితవాదులు, అతివాదులు, హేతువాదులు వీరంతా వారివారి వాదాలను దృఢంగా నమ్ముతారు. కొన్నిసార్లు వారి వాదాలను పక్కనపెట్టి అందరికీ సమ్మతమైన మానవతావాద దృక్కోణంలో చూస్తారు.పూర్వకాలంలో పురాణాల్లో రాముడు కోదండపాణి ధారి,కృష్ణుడు చక్రధారి మరి ఆధునిక యుగంలో మనమంతా స్మార్ట్‌ఫోన్ ధారులం. పైన చెప్పిన వారి వాదాలకైనా,ఆయుధాలకైనా విరామం ఉంటుందేమో గాని విశ్వమానవాళి స్మార్ట్‌ఫోన్‌కు బానిసై నిర్విరామంగా అదే పనిగా చూస్తూ, అందులోనే మునిగిపోతున్నారు. వారి విలువైన కాలాన్ని వృథాగా గడిపేస్తున్నారు. ఎప్పుడో ముసలితనంలో మనిషికి 'చాదస్తం' అనే 'మూడో హస్తం' మొలుస్తుందంటారు. కానీ నేటి ఆధునిక టెక్నాలజీ యుగంలో చిన్నతనంలోనే స్మార్ట్‌ఫోన్ అరచేతిని ఆక్రమించింది. పుస్తకం 'హస్తభూషణం' అనేది పాత మాట, స్మార్ట్‌ఫోనే 'హస్తభూషణం' అనేది నేటిపాటగా మారింది. పొద్దస్తమానం ఆన్‌లైన్‌లో ఉంటారు. రింగ్‌రింగో అంటూ మ్రోగుతోంది.డ్రగ్స్, గంజాయి, మద్యం ఇవే కాదు డిజిటల్ రూపంలోనూ వ్యసనం యువతను, పిల్లల్ని వెంటాడుతోంది. వారు సెల్‌ఫోన్ వదల్లేకపోతున్నారు.చిన్నపిల్లలు అయితే మొబైల్ ఇస్తేనేతింటాం, చెప్పింది చేస్తామంటూ మారం చేస్తున్నారు. తల్లిదండ్రులు కూడా వారిని బుజ్జగించే క్రమంలో పిల్లల చేతిలో మొబైల్ పెట్టేస్తున్నారు. దీంతో ఆడుతూ పాడుతూ గడపాల్సిన బాల్యం స్మార్ట్‌ఫోన్ చెరలో బందీ అవుతోంది. పిల్లలు వారికి తెలియకుండా ఆవలలో చిక్కుకుంటున్నారు. వారించే ప్రయత్నం చేస్తే తల్లిదండ్రులని కూడా చూడకుండా క్రూరంగా దాడులకు తెగబడుతున్నారు. ఏ అలవాటైనా వ్యసనంగా మారినప్పుడు ఎవరైనా నిరోధించడానికి ప్రయత్నిస్తే తీవ్ర ప్రతిఘటనకు దారితీస్తుంది. ఆ కోపంలో దాడి చేసేందుకు కూడా వెనకాడరని మానసిక నిపుణులు చెప్తున్నారు.ఇలాంటి వారికి ఒకపద్ధతి ప్రకారం నచ్చచెబుతూ వాటినుంచి దూరం చేయాలని సూచిస్తున్నారు. రోజులో ఒక ఖచ్చితమైన సమయంలో ఫోన్ చూసేందుకు అనుమతించాలి. అరగంటలేదా గంట గడువు పెట్టాలి. ఇది పిల్లలు స్క్రీన్‌పై ఎక్కువ సమయం గడపకుండా నిరోధిస్తుంది. దినచర్యలో నిర్ణీత సమయం భాగమైనప్పుడు వ్యసనం కూడా అడ్డుకట్ట వేయవచ్చు. ప్రస్తుతం చాలా మంది పిల్లలు ఆటలకు దూరం అవుతున్నారు. పిల్లల శారీరక,మానసిక ఆరోగ్యానికి ఆటలు ఎంతో ముఖ్యం.రోజూ ఒక గంటపాటు అవుట్ డోర్ ఆటల వైపు మళ్ళించడం వల్ల ఫోన్, ఇతర వ్యసనాల బారిన పడకుండా చూసుకోవచ్చు. హోంవర్క్ చేస్తే, అన్నం తింటేఫోన్ ఇస్తానని పిల్లలకు కొందరు తల్లిదండ్రులు ఆశ చూపుతుంటారు. ఆ పని చేసిన వెంటనే ఆడుకోవడానికి ఫోన్ ఇచ్చేస్తుంటారు. ఇలా చేయడం కూడా వారిని వ్యసనం వైపు మళ్లి



స్తుందని గుర్తించాలి.చాలామంది తల్లిదండ్రులు స్మార్ట్‌ఫోన్‌లో ఎక్కువ సమయం గడుపుతూ పిల్లలకు మాత్రం ఉపయోగించ వద్దని సూచిస్తుంటారు. దీనివల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. ముందు మీరు క్రమశిక్షణ పాటించాలి. దీంతో పిల్లలు మిమ్మల్ని చూసి అనుసరిస్తారు. సామాజిక మాధ్యమాల వినియోగం తగ్గించేలా ఆటలు, ఈత, మ్యూజిక్, డాన్స్‌వంటి వాటిపై దృష్టి సారించేలా చేయాలి. చిన్నప్పటి నుంచి ప్రత్యేక లక్ష్యం దిశగా పిల్లల్ని నడిపించాలి. డ్రగ్స్, గంజాయి, మద్యం వంటి వాటికి అలవాటు పడితే బయటపడడం చాలా కష్టం. ఆపాలని చూసినా కొందరు చాలా క్రూరంగా మారిపోతారు. ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ కూడా వ్యసనంగా మారుతోంది. పిల్లలకు అర్థమయ్యేలా చెప్పి ఒప్పించడంలో తల్లిదండ్రులదే కీలకపాత్ర. కచ్చితంగా కొంత సమయమే వినియోగించేలా చూడటం. పిల్లలతో ఎక్కువ సమయం గడపడం, అవసరమైతే కౌన్సిలర్ సలహా తీసుకోవడం వంటి చర్యలతో వ్యసనం నుంచి క్రమేపి దూరం చేయాలి. స్మార్ట్ ఫోన్ అతి వినియోగానికి అడ్డుకట్టుట వేయడం ద్వారా భావితరం జీవితాలు ప్రమాదంలో పడకుండా చూడాల్సిన బాధ్యత మనందరిది.ప్రపంచ దేశాలలో సామాజిక మాధ్యమాల వినియోగంపై కఠిన నిబంధనలు ఉన్నాయి. ఆస్ట్రేలియాలో 16 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియా వినియోగించడం పై నిషేధం విధించింది. దేశంలోని పిల్లల మానసిక ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ చర్యలు తీసుకుంది. స్వీడన్‌లో 13 నుంచి 18 ఏళ్లలోపు పిల్లలు మూడు గంటల కంటే ఎక్కువ సమయం సామాజిక మాధ్యమాలను వినియోగించకూడదు.దక్షిణకొరియాలో 16 ఏళ్లలోపు పిల్లలు మధ్య రాత్రి నుంచి ఉదయం 6 గంటల వరకు ఆన్లైన్ గేమ్‌లు ఆడకూడదు. చైనాలో రోజుకు 40 నిమిషాలకు మించి టిక్‌టాక్ ఆన్లైన్ గేమింగ్‌పై నిషేధం. ఇంగ్లాండ్‌లో 16 ఏళ్లలోపు పిల్లలకు సామాజిక మాధ్యమాల వినియోగానికి తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి. స్పెయిన్‌లో 16 ఏళ్ల వరకు సోషల్ మీడియా వినియోగంపై బ్యాన్ విధించింది.ఇలా ఇతర దేశాలవలె పిల్లల సామాజిక మాధ్యమాల వినియోగంపై కఠిన నిబంధనలు రావాలి. మన దేశంలో కూడా డిజిటల్ డేటా,ప్రొటెక్షన్ యాక్ట్2023 ప్రకారం పిల్లలు సామాజిక మాధ్యమాలను వినియోగించాలంటే తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి. కానీ తల్లిదండ్రులే వయసు తారతమ్యం లేకుండా పిల్లలనుంచి వృద్ధుల వరకు స్మార్ట్ ఫోన్లో బానిసలై వ్యసనపరులుగా మారిన దుర్భర స్థితి మన దేశంతో పాటు విశ్వమానవ సమాజాన్ని వెంటాడుతోంది. స్మార్ట్‌ఫోన్ తయారీ అధినేత తన పిల్లలను 14 ఏళ్లు దాటేదాకా స్మార్ట్ ఫోన్‌కు దూరంగా ఉంచారు.16 సంవత్సరాల వయసువరకు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంచాలని ఆయన సూచన. ఈ వ్యసనం భావోద్వేగాలపై తీవ్ర ప్రభావం చూపుతుందనే సోయి కూడా మర్చిపోతున్నారు. మనుషుల కోరికలకు సమాజ కట్టుబాట్లకు, ఆరోగ్యానికి మధ్యసంఘర్షణను..అనుబంధాల సంక్లిష్ట గాఢతను ఫోన్ దూరం చేస్తోంది. వ్యక్తి స్వేచ్ఛ, సామాజిక బాధ్యతలను విస్మరించిన మనిషి ఫోను మోజులో పడి ఎంతో నలిగిపోతూ ఒత్తిడికి గురవుతున్నాడు. స్మార్ట్‌ఫోను అవసరానికి వాడితే ఫర్వాలేదు. అతి చేసి మితిమీరి గతి తప్పితే మతి చెడుతుంది. నేటి, రేపటి తరంలో స్వీయ మనోవికాసం తగ్గి, సృజనాత్మకత, వినూత్నత కొరవడుతుంది. ●

# రష్యా చమురుకొంటే 100% అదనపు సుంకాలే!

## ప్రత్యేక బిల్లు తెస్తున్న అమెరికా

**మాస్కో,జులై 15:** రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తున్న భారత్, చైనా, బ్రెజిల్ సహా ఇతరదేశాలు షాక్ ఇచ్చేందుకు అగ్రరాజ్యం అమెరికా సిద్ధమవుతోంది. రష్యాతో వ్యాపారాన్ని కొనసాగిస్తే భారత్ సహా ఇతర దేశాలపై 500 శాతం టారిఫ్‌లు విధిస్తామని హెచ్చరించింది. రష్యా అధ్యక్షుడు పుతిన్ 50 రోజుల్లో ఉక్రె యిన్‌తో యుద్ధాన్ని ముగించడంలో విఫలమైతే మాస్కోపై 100 శాతం సెకండరీ టారిఫ్‌లు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన తర్వాత యూఎస్ సెనేటర్లు లిండ్సే గ్రాహం, రిటర్డ్ బ్లూమెంటర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. రష్యాతో వ్యాపారాన్ని కొనసాగిస్తే భారత్ సహా ఇతర దేశాలపై కూడా భారీ ఆర్థిక ఆంక్షలు విధిస్తామని లిండ్స్ గ్రాహం, రిటర్డ్ బ్లూమెంటర్ హెచ్చరించారు. అలాగే రష్యాపై 100 శాతం సెకండరీ టారిఫ్‌లు విధిస్తా మన్న ట్రంప్ నిర్ణయాన్ని స్వాగతించారు. అమె రికా అధ్యక్షుడి నిర్ణయాన్ని ప్రశంసిస్తూ, దీన్ని కీలకమైన ముందడుగుగా అభివర్ణించారు. ఈ క్రమంలో యూఎస్ సెనేటర్లు లిండ్స్ గ్రాహం, రిటర్డ్ బ్లూమెంటర్ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. చైనా, భారత్, బ్రెజిల్, ఇతర దేశాలు రష్యా నుంచి చౌకగా చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తున్నాయి. ఈ దేశాలు రష్యా యుద్ధ పరిస్థి తులను ఆసరాగా చేసుకుంటున్నాయి. రష్యాకు సహాయం చేసే దేశాలపై 500 శాతం వరకు సుంకాలు విధిస్తాం. రష్యా ఉక్రెయిన్ యు ద్ధాన్ని ముగించడానికి అంతిమ అవకాశం చైనా, భారత్, బ్రెజిల్ వంటి దేశాలపై సుంకాలు విధిం చడమే. రాబోయే 50రోజుల్లో శాంతి ఒప్పందం కుదరకపోతే రష్యన్ చమురు, గ్యాస్‌ను కొను గోలు చేసే దేశాలపై 100 శాతం సుంకాలను అమలు చేయాలనే అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాన్ని గౌరవిస్తున్నాం. వీటి లక్ష్యం పుతిన్ శాంతి ఒప్పందానికి వచ్చేలా చేయడమే. రష్యా నుంచి చమురు, గ్యాస్ ను కొనుగోలు చేసి ఉక్రెయిన్‌కు సహాయం చేయని దేశాలపై 500 శాతం వరకు సుంకాలను అమలు చేసే మా ద్వైపాక్షిక రష్యా ఆంక్షల చట్టంపై వైట్‌హౌస్‌తో కలిసి పనిచే స్తామని గ్రాహం, బ్లూమెంటల్ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. దక్షిణ కరోలినా రిపబ్లికన్ సెనేటర్ గ్రాహం, డెమొక్రటిక్ సెనేటర్ బ్లూమెంటల్ ఈ ఏడాది ప్రారంభంలో కాం గ్రెస్‌లో ప్రవేశపెట్టిన ద్వైపాక్షిక బిల్లుపై 85 సహ స్పాన్సర్లకు నాయకత్వం వహించారు. ఈ బిల్లు ను మాస్కోపై ఆంక్షలను అమలు చేసేందుకు రూపొందించారు. భారత్, చైనా, బ్రెజిల్, ఇతర దేశాలను పుతిన్ యుద్ధతంత్రానికి ఆజ్యం పోయకుండా నిరోధించడానికి సెనేటర్ గ్రాహం, నేను రష్యా ఆంక్షల బిల్లు కోసం ఒత్తిడి చేస్తూనే ఉంటామని రిచర్డ్ బ్లూమెంటల్ తన సోషల్ మీడియా హ్యాండిల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుత్తెతో సమావేశం అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను రష్యా వైఖరిపట్ల చాలా అసంతృప్తిగా ఉన్నా న్నారు. 50రోజుల్లో శాంతి ఒప్పందం కుదరక పోతే రష్యాపై 100శాతం సెకండరీ టారిఫ్‌లను విధిస్తామని హెచ్చరించారు. రష్యా వైఖరి పట్ల



# యుద్ధాలను ఆపాలంటే నన్ను మించినవారు లేరు..

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్,జులై 15:** దేశాల మధ్య యుద్ధాలను ఆపడంలో తనను మించిన వారు లేరని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యా నించారు. ప్రపంచంలో ప్రస్తుతం నెలకొన్న యుద్ధ వాతావరణాన్ని తన చాతుర్యంతో తప్పించానని చెప్పారు. భారత్ పాకిస్తాన్ ల మధ్య అణు యుద్ధం జరిగే ప్రమాదాన్ని తానే తప్పించేశానని మరోమారు పేర్కొన్నారు. ఇటీవల ఆ రెండు దేశాలు పరస్పరం దాడులు చేసుకున్నాయని, యుద్ధం మరింత అణ్వాయుధ ప్రయోగానికి దారి తీసే ముప్పు ఏర్పడిందని ఆయన గుర్తు చేశారు. దీంతో తాను జోక్యం చేసుకుని ఇరు దేశాలను గట్టిగా హెచ్చరించినట్లు తెలిపారు. యుద్ధం ఆపకపోతే వాణిజ్య ఒప్పందాలను రద్దు చేసుకుంటామని, భవిష్య త్తులో ఎలాంటి ఒప్పందాలు కుదుర్చుకోబోమని ఒత్తిడి చేశానని వివరించారు. దీంతో ఇరు దేశాలు వెనక్కి తగ్గాయని, ప్రపంచానికి మరో అణు యుద్ధ ముప్పు తప్పిందని ట్రంప్ తెలిపారు. రువాండా కాంగోల మధ్య గడిచిన 30 ఏళ్లుగా కొనసాగుతున్న వివాదం గురించి ప్రపంచం మొత్తానికి తెలుసని ట్రంప్ గుర్తు చేశారు. ఇందులో సుమారు 70 లక్షల మంది చనిపోయారని ట్రంప్ చెప్పారు. ఈ వివాదాన్ని కూడా తాను సమసిపోయేలా చేశానని చెప్పుకు న్నారు. ఈమేరకు సోమవారం అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్‌లో ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

తాము చాలా అసంతృప్తిగా ఉన్నామని తెలియ జేయడానికి నాటో చీఫ్‌తో భేటీ అయ్యానని తెలిపారు. రష్యాపై ఆంక్షలు విధించే అమెరికా బిల్లు గురించి ఇటీవలే భారత విదేశాంగ మంత్రి జైశంకర్ స్పందించారు. రష్యాపై బిల్లుకు సంబం ధించి భారత రాయబార కార్యాలయం సెనేటర్ గ్రాహంతో సంప్రదింపులు జరిపిందన్నారు. ఇంధనం, భద్రతపై భారత్ తమ ఆందోళనలు, ఆసక్తులను గ్రాహంకు వివరించిందని పేర్కొ న్నారు. సెనేటర్ లిండ్సే గ్రాహం రూపొందించిన బిల్లు భారత ప్రయోజనాలను ఏమైనా ప్రభావి తం చేస్తుందా అనేది తెలుసుకుంటున్నాం. అందుకే మేము సెనేటర్ లిండ్సే గ్రాహంతో సంప్రదింపులు జరుపుతున్నాం. అమెరికాలోని భారత రాయబారి ఆయనతో చర్చలు జరిపారు. ఇంధనం, భద్రతపై భారత్ ఆందోళనలు, ఆసక్తులను ఆయనకు తెలియజేశామని జైశంకర్ తెలిపారు.

# ఉక్రెయిన్ ప్రభుత్వంలో ప్రక్షాళన





## ప్రధానిగా ఆర్థిక మంత్రి యూలియా స్విరిడెంకో నియామకం


### ప్రస్తుత ప్రధాని డెనిస్ ష్మీహాల్‌ను రక్షణమంత్రిగా నియమించుకున్న జెలెన్‌స్కీ

**కీవ్(ఉక్రెయిన్), జులై 15:** మూడేళ్లుగారష్యాతో జరుగుతున్న యుద్ధంతో సతమతం అవుతున్న ఉక్రెయిన్‌లో ఇపుడు ప్రభుత్వ ప్రక్షాళన సాగుతోంది. అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్‌స్కీ కొత్తప్రధానమంత్రిని నియమించారు. అంతేకా కుండా ఇప్పటివరకూ ప్రధానిగా కొనసాగిన డెనిస్ ష్మీహాల్‌ను తన కేబినెట్‌లో రక్షణ మం త్రిగా నియమించుకున్నారు. కొత్తప్రధాన మంత్రిగా ఇప్పటివరకూ మొదటి డిప్యూటీ ప్రధానిగా కొనసాగిన యూలియా స్విరిడెంకోను నియమిస్తున్నట్లు ప్రకటించారు. సోషల్‌మీడియా టెలిగ్రామ్‌లో డెనిస్ తన రాజీనామా లేఖను కూడా పోస్టు చేసారు. తనను ఇప్పటిరకూ సమ ర్థించినవారికి రుణపడి ఉంటానని, ఇపుడు మరింత కీలక స్థానంలోకి వస్తున్నామని, ఉక్రె యిన్‌ను శత్రుమూకలనుంచి రక్షించేందుకు అధ్య క్షుడు జెలెన్‌స్కీతో కలిసి పనిచేస్తామన్నారు. డిప్యూటి ప్రధానిగా ఉన్న యూలియా ఎకానమి మంత్రిగా కూడా పనిచేసారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం అనుకోని సవాళ్లను తెచ్చింది. దీనికి తోడు అంతర్జాతీయంగా కూడా దౌత్యబంధాల పటిష్టతకు దోహదంచేసేవిధంగా ఉండాలని రష్యా పూర్తిస్థాయిలో మూడేళ్లుగా సాగిస్తున్న యుద్ధానికి చెక్‌పెట్టేందుకే ఈ విధానం అను సరిస్తున్నట్లు వెల్లడి అయింది. జెలెన్‌స్కీ అధికార సోషల్‌మీడియా ఛానెళ్లు ప్రభుత్వానికి కొత్త ఉత్తేజం తీసుకురావాల్సిన అవసరం ఉందన్న వార్తలుప్రసారంచేసాయి. అందువల్లనే జెలెన్‌స్కీ యూలియా స్విరిడెంకోను ప్రధానిగా నియమిం చా రని చెపుతున్నారు. అలాగే విశేష అనుభవం ఉన్న ప్రస్తుత ప్రధాని డెనిస్‌ను రక్షణమంత్రిగా నియమించుకోవడం జెలెన్‌స్కీకి ఎంతోమేలు చేస్తుందన్న భావన వ్యక్తం అవుతోంది. ఉక్రెయిన్ ఆర్థిక నాయకత్వంలో కీలక పాత్రపోషించిన 39 ఏళ్ల స్విరిడెంకో అమెరికాతో చర్చల్లోకూడా కీలకపాత్రపోషించారు. అత్యంత కీలకమైన మిలి టరీ భాగస్వామితో జరిగిన చర్చల్లోకూడా ఆమె పాల్గొని కీలకపాత్రపోషించారు.

# చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో జైశంకర్ భేటీ

## ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు

**బీజింగ్,జులై 15:** భారత విదేశాంగ మంత్రి జైశంకర్ మంగళవారం చైనా అధ్యక్షుడు జిన్ పింగ్‌ను కలిశారు. ఇటీవలి కాలంలో ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో జరిగిన పరిణామాల గురించి ఆయనకువివరించారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ తరఫున ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. 2020లో గల్వాన్ ఘటనతో ఇరుదేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తిన విషయం తెలిసిందే. ఇది జరిగిన తర్వాత భారత విదేశాంగశాఖ మంత్రి చైనాలో పర్యటించడం ఇదే మొదటిసారి. ఈ రోజు ఉదయం బీజింగ్‌లో నా తోటి షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) విదేశాంగ మంత్రులతో కలిసి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను కలిశాను. ఇటీవల ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల పురో గతి గురించి ఆయనకు వివరించాను. ద్వైపాక్షిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లడంలో దేశ నాయకత్వాల నిరంతర మార్గదర్శకత్వం ఎంతో అవసరమని వివరించాను. 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత తొలిసారి షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సు కోసం జైశంకర్ చైనాలో



పర్యటిస్తున్నారు. చైనా ఉపాధ్యక్షుడు హాన్ జెంగ్ , విదేశాంగమంత్రి వాంగ్ యీతో భేటీ అయిన ఆయన, చైనాభారత్ సంబంధాలు క్రమంగా బలపడుతున్నట్లు వివరించారు. ద్వైపాక్షిక సంబంధాలు, సహకారాలను మరింత బలోపేతం చేసుకోవడం వల్ల ఇరుదేశాలతో పాటు ప్రపంచానికి కూడా ప్రయోజనకరమని అభిప్రాయపడ్డారు. చైనా వైపు నుంచి ప్రవహించే సరిహద్దు నదుల్లో నీటికి సంబంధించిన సమాచారాన్ని అందించడంపై జైశంకర్ వారితో చర్చించారు. సరిహద్దు సమస్యలను పరిష్కరిం చడం, ప్రజల రాకపోకలను అనుమతించడం, నిర్బంధ వాణిజ్య చర్చలను, అడ్డంకులను నివారించడం మా బాధ్యత. పరస్పర గౌరవం, ఆసక్తులు, సున్నితత్వం ఆధారంగా ద్వైపాక్షిక సంబంధాలు సానుకూల పథంలో అభివృద్ధి చెందుతాయని ఆశిస్తున్నాము. రేపు టియాం జియన్‌లో జరిగే ఎస్‌సీఓ విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరుకావడానికి ఎదురుచూస్తు న్నాము. మంచి ఫలితాలు, నిర్ణయాలను నిర్ధరించడానికి భారత్ కట్టుబడి ఉందని జైశంకర్ అన్నారు. సింగపూర్ పర్యటన ముగించుకున్న జైశంకర్ ఎస్‌సీఓ సమావేశంలో పాల్గొనేందుకు చైనా వెళ్లారు. ఈ సందర్భంగా ఇరుదేశాల మధ్య విమానాల పునరుద్ధరణ సహా భారత్ పాక్ ఉద్రిక్తతలు, దలైలామా వారసత్వంపై ఇటీవల చెలరేగిన వివాదం మొదలైన అంశాల గురించి ఆయన చర్చించే అవకాశం ఉందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. జూన్ నెలలో భారత రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్‌లు చైనాలో పర్యటించారు. అప్పుడు రాజనాథ్ సింగ్ చైనాలోని క్వింగ్డావోలో జరిగిన షాంఘై సహకార సంస్థ సభ్యదేశాల రక్షణ మంత్రిత్వ స్థాయి సదస్సుకు హాజరయ్యారు.



# ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన నగరం సింగపూర్

**సింగపూర్‌సిటీ, జులై 15:** విలాసానికి అవధులుం డవు. కానీ, దానిని అనుభవించాలంటే కచ్చి తంగా డబ్బు కావాల్సిందే. మీరు ఖర్చుకు వెన కాడని వ్యక్తి అయితే ప్రపంచంలో బోలెడు ఖరీదైన నగరాలున్నాయి. సకల సౌకర్యాలను అనుభవించడంతోపాటు ఎంచక్కా మీకు కావాల్సిన ఖరీదైన వస్తువులను కూడా కొనుక్కో వచ్చు. జూలియస్ బేర్ వార్షిక నివేదిక ప్రకారం ప్రపంచంలోనే అత్యంత ఖరీదమైన నగరంగా సింగపూర్ నిలిచింది. వరుసగా మూడో యేడాది ఈ ఘనతను సింగూర్ దక్కించుకోవడం విశేషం. మరోవైపు రెండో స్థానంలో ఉన్న హాంగ్‌కాంగ్‌ను పక్కను నెట్టి ఆ స్థానాన్ని లండన్ కైవసం చేసుకుంది. హాంగ్‌కాంగ్ మూడో స్థానా నికి పరిమితమైంది. కనీసం 1 మిలియన్ డాలర్ల బ్యాంక్ బ్యాలెన్స్ కలిగిన వ్యక్తులు కొనుగోలు చేస్తున్న వివిధ రకాల ఉత్పత్తులు, వారు అనుభ విస్తున్న విలాసాల ఆధారంగా వారి జీవన వ్యయాన్ని జూలియస్ బేర్ లైఫ్‌స్టయిల్ ఇండెక్స్ విశ్లేషించి ఈ నివేదికను తయారుచేసింది. ఈ యేడా ఫిబ్రవరి–మార్చి మధ్య డేటాను పరిగణన లోకి తీసుకున్నట్లు జూలియస్ బేర్ వెల్లడిం చింది. **ఖరీదైన నగరంగా సింగపూర్ ఎందుకు?** సింగపూర్ ఆర్థిక, రాజకీయ పరిస్థితులు అందరికీ అనుకూలంగా ఉన్నాయి. దీంతో పలువురు అంతర్జాతీయ వ్యాపారులు సింగపూర్ కేంద్రంగానే తమ బిజినెస్‌ను నిర్వహించేందుకు మొగ్గు చూపుతున్నారు. అంతేకాకుండా గతంలో వెళ్లిపోయిన వ్యాపారులను కూడా తిరిగి రప్పిం చేందుకు సింగపూర్ కొన్ని సంస్కరణలు చేప ట్టింది. దీంతో అక్కడి జీవన వ్యయం అమాం తం పెరిగిపోయింది. ఇక్కడి ప్రజలు ఎక్కువగా బంగారం కొనుగోలు చేసేందుకు ఇష్టపడతారు. ఇదే సింగపూర్‌ను అత్యంత ఖరీదైన నగరంగా నిలిచేలా చేసిందని రిపోర్టు పేర్కొంది. అంతేకా కుండా స్థానికులు ఎక్కువగా ఆహారం, బూట్లు, హెల్త్‌కేర్ ప్రొడక్ట్స్, విద్యపై ఎక్కువగా ఖర్చు చేస్తున్నట్లు జూలియస్ బేర్ నివేదిక పేర్కొంది. తాజా ఫలితాల ప్రకారం కరోనా మహమ్మారి తీవ్రత సాధారణ స్థితికి వచ్చినప్పటికీ.. ద్రవ్యోల్బణం, పెరుగుతున్న జీవన వ్యయాలు, భౌగోళిక రాజకీయ పరిస్థితులు ప్రపంచవ్యాప్తం గా ధరలను ప్రభావితం చేస్తూనే ఉన్నాయని నివేదిక పేర్కొంది.

**హాంగ్‌కాంగ్‌ను వెనక్కి నెట్టి..** గతేడాది ఫలితాలతో పోల్చుకుంటే లండన్ మహానగరం ఓ మెట్టు ఎక్కింది. రెండో స్థానంలో ఉన్న హాంగ్‌కాంగ్‌ను వెనక్కి నెట్టి ఆ స్థానాన్ని కైవసం చేసుకుంది. జ్యూరిచ్ సహా ఇతర ఐరోపా నగరాలు కూడా ర్యాంకింగ్స్‌లో మెరుగుపడ్డాయి.

**టాప్ 10 ఖరీదైన నగరాలు ఇవే:** 1. సింగపూర్ 2. లండన్ 3. హాంగ్‌కాంగ్ 4. షాంఘై 5. మొనాకో 6. జ్యూరిచ్ 7. న్యూయార్క్ 8. పారిస్ 9. సావోపాలో 10. మిలాన్.

# ఆత్మహత్యకాదు వ్యవస్థీకృత హత్య: విద్యార్థిని మృతిపై భగ్గుమన్న విపక్షాలు



**భువనేశ్వర్,జులై 15:** ఒడిశాలో ప్రొఫెసర్ లైంగిక వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని మృతి చెందడంతో ప్రతిపక్ష పార్టీలు భగ్గుమన్నాయి. ఇది ఆత్మహత్య కాదని, వ్యవస్థీ కృత హత్య అని దుయ్యబట్టాయి. మాజీ ముఖ్య మంత్రి నవీన్ పట్నాయక్‌తో పాటు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బిజెపి తీరును తీవ్రంగా ఖండించారు. ఒడిశాలో ప్రొఫెసర్ లైంగిక వేధింపులు తాళలేక నిప్పంటించుకున్న 22 ఏళ్ల విద్యార్థిని 3 రోజులుగా ప్రాణాలతో పోరాడి ఓడిపోయింది. 95శాతం కాలిన గాయాలతో ఐసీయూలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమెకు మూత్రపిండాల మార్పిడి కూడా చేసినట్లు ఎయిమ్స్ భువనేశ్వర్ వైద్యులు తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థ వైఫల్యం వల్ల ఒక ప్రాణం పోయిందని తలుచుకుని ఆవేదన చెందుతు న్నాం. ఇది అత్యంత బాధాకరమైన విషయం. వాస్తవానికి ఇది ప్రమాదం కాదు. ఆమెకు సాయం చేయకుండా సైలెంట్‌గా ఉన్న వ్యవస్థ వైఫల్యం వల్లే ఇలా జరిగింది. కళాశాల అధికా రులు పట్టించుకోకపోయినా ఆమె ధైర్యం కోల్పోలేదు. న్యాయం కోసం కేంద్ర విద్యాశాఖ మంత్రిని, ముఖ్యమంత్రిని న్యాయం చేయాలని అడిగింది. బాలేశ్వర్ ఎంపీని స్వయంగా కలిసింది. ఎవరైనా ఒకరు బాధ్యత తీసుకుని ఉంటే ఆ విద్యార్థిని బతికే అవకాశం ఉండేదని మాజీ సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు. కాగా, ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ఇది ఆత్మహత్య కాదని, వ్యవస్థీకృత హత్య అని బిజెపిపై మండిపడ్డారు. బాధితురాలిని రక్షించడంలో ఒడిశాలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందంటూ రాహుల్ మంగళవారం ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం కోసం బాధిత విద్యార్థిని ధైర్యంగా, లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా తన గొంతుకను వినిపించింది. అందుకు, ఆమెకు న్యాయం చేయడానికి బదులుగా బెదిరించి, హింసించారు. పదేపదే అవమానించారు. ఎప్పటిలాగే బిజెపివ్యవస్థ నిందితుడిని కాపాడేం దుకు ప్రయత్నిస్తోంది. ఒక అమాయకురాలైన విద్యార్థిని తనకు తాను నిప్పంటించుకునేలా చేసింది. ఇది ఆత్మహత్య కాదు వ్యవస్థీకృత హత్య. మోడీజీ ఒడిశా లేదా మణిపూర్‌లో అయినా దేశంలో కుమార్తెలు కాలిపోతున్నారు, ప్రాణాలు కోల్పోతున్నారు. మీరు ఇంకా మౌనం గానే ఉంటారా దేశానికి మీ మౌనం అవసరం లేదు. వీటన్నింటికీ సమాధానాలు కావాలి. భార తదేశ మహిళలకు భద్రత, న్యాయం కావాలని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

# న్యూయార్క్, న్యూజెర్సీలను ముంచెత్తిన ఆకస్మిక వరదలు

**వాషింగ్టన్, జులై 15:** అమెరికాలోని న్యూయార్క్, న్యూజెర్సీ నగరాలకు వరదలు ముంచెత్తాయి. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాల కారణంగా ఆకస్మిక వరదలు సంభవించాయి. ఈ వరదలకు అనేక ఇళ్లు నీట మునిగాయి. ప్రధాన రహదారులు సాధారణ జనజీవనం స్తంభించి పోయింది. రవాణా ఆగిపోయింది. ఈ ప్రభావం విమానాల రాకపోకలపై కూడా తీవ్ర ప్రభావం పడింది. భారీ వర్షాలు, ఆకస్మిక వరదల నేపథ్యంలో న్యూజెర్సీ గవర్నర్ ఫిల్ మర్ఫీ రాష్ట్రంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు, అధిక వర్షపాతం కారణంగా అత్యవసర పరిస్థితి ప్రకటిస్తున్నట్లు తెలిపారు. నివాసితులు ఇళ్లలోనే ఉండాలని, అనవసర ప్రయాణాలను పెట్టుకోవద్దని ప్రజలకు సూచించారు. మరోవైపు న్యూయార్క్ సిటీలోని మన్‌హటన్, బ్రూక్లిన్, క్వీన్స్, స్టేటెన్ ఐలాండ్ ప్రాంతాలకు నేషనల్ వెదర్ సర్వీస్ ఆకస్మిక వరద హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు న్యూయార్క్ సిటీ మెట్రో వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నది. సబ్‌వేల్లోకి వరద పోటె త్తింది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయింది. దీంతో అనేకమంది నివాసితులు అంధకారంలో ఉండిపోయారు. పలు ప్రాంతాలను వరదలు చుట్టుముట్టడంతో



వేలాది మంది నివాసితులు జలదిగ్బంధంలో చిక్కుకుపోయారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు విమాన రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపాయి. వరదలు, వర్షాల కారణంగా పలు విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి.

# సంజయ్‌దత్ తలుచుకుంటే ముంబయి పేలుళ్లు ఆపేవారు

## ప్రముఖ న్యాయవాది ఎంపి ఉజ్వల్‌నికమ్



**ముంబయి, జులై 15:** మహానగరం ముంబైలో 1993లో జరిగిన పేలుళ్ల కేసును వాదించిన ప్రముఖ న్యాయవాది ఉజ్వల్ నికమ్ తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ తలుచుకుని ఉంటే ఆ పేలుళ్లను ఆపి ఉండేవాడని ఆయన పేర్కొన్నారు. న్యాయ వాదిగా పలు సంచలన కేసులను వాదించిన ఉజ్వల్ నికమ్ ఆ తర్వాత రాజకీయ అరంగేట్రం చేశారు. మీడియా ఇంటర్వ్యూల్లో ఆయన ముంబై పేలుళ్ల గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. 1993, మార్చి 12న ముంబైలో వరుస పేలుళ్లు జరిగాయి. ఆ పేలుళ్లకు కొన్ని రోజుల ముందు సంజయ్ ఇంటికి ఆయుధాలతో నిండిన ఓ వ్యాన్ వచ్చింది. గ్యాంగ్‌స్టర్ దావూద్ ఇబ్రహీం అనుచరుడు అబూం సలేం తీసుకొచ్చిన ఆ వ్యాన్‌లో హ్యాండ్ గ్రనేడ్లు, ఏకే 47 తుపాకులు, బాంబులు ఉన్నాయి. వాటిని సంజయ్ పరిశీలిం చారు. వాటిల్లో నుంచి ఒక ఏకే 47 తుపాకీని తీసుకుని తన దగ్గర ఉంచుకున్నారు. అయితే ఆ ఆయుధాల వ్యాన్ గురించి పోలీసులకు సంజయ్ సమాచారం ఇచ్చి ఉంటే ఆ పేలుళ్లు జరిగి అంత మంది చనిపోయి ఉండేవారు కాదు అని ఉజ్వల్ పేర్కొన్నారు. ముంబై పేలుళ్లతో సంబంధం ఉందనే కారణంతో సంజయ్‌పై అప్పట్లో టాడా కేసు నమోదైంది. సంజయ్ ఉగ్రవాది అని ఆరోపణలు వచ్చాయి. కోర్టు మాత్రం సం జయ్‌ను నిర్దోషిగా ప్రకటించింది. అయితే అక్ర మంగా ఆయుధాలు కలిగి ఉన్నాడనే అభియోగం మాత్రం రుజువు కావడంతో సంజయ్‌ను దోషిగా నిర్ధారిస్తూ కోర్టు ఐదేళ్లు జైలు శిక్ష విధించింది. పుణెలోని యరవాడ జైల్లో శిక్ష అనుభవించిన సంజయ్ 2016లో విడుదల అయ్యాడు. కాగా, న్యాయవాది ఉజ్వల్ నికమ్ బిజెపిలో చేరి 2024లో ముంబై నార్త్‌సెంట్రల్ లోక్‌సభ్ స్థానానికి పోటీ చేసి ఓడిపోయారు. తాజాగా ఆయనను బిజెపిరాజ్యసభకు నామినేట్ చేసింది.

# మారథాన్ యోధుడు రోడ్డుప్రమాదంలో దుర్మరణం

**జలంధర్,జులై 15:** మారథాన్‌ను పూర్తి చేసిన అత్యధిక వయస్కుడిగా ప్రపంచ రికార్డు సృష్టించిన ఫౌజా సింగ్ ఓ రోడ్డు ప్రమాదంలో మరణించారు. సోమవారం జలంధర్ పఠాన్ కోట్ జాతీయ రహదారిపై ఆయనను ఓ కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన ఫౌజా సింగ్‌ను స్థానికులు హుటాహుటిన దగ్గర్లోని ఆసుపత్రిలో చేర్పించారు. ఈ ప్రమా దంలో ఫౌజా సింగ్ తలకు తీవ్ర గాయమైందని, రక్తస్రావం కారణంగా ఆయన తుదిశ్వాస వది లారని వైద్యులు ప్రకటించారు. విదేశాల్లో ఉంటున్న ఆయన పిల్లలు వచ్చే వరకూ ఫౌజా సింగ్ మృతదేహాన్ని మార్చురీలో ఉంచుతామని వారు చెప్పారు. పంజాబ్ లోని జలంధర్ జిల్లా బేయాస్ గ్రామంలో 1911 ఏప్రిల్ 1న ఫౌజా సింగ్ జన్మించారు. ఆయనకు ప్రస్తుతం 114 ఏళ్లు. భార్య, కొడుకు మరణం తర్వాత ఫౌజా



సింగ్ రన్నింగ్ ప్రాక్టీస్ చేశారు. 89 ఏళ్ల వయసులో మొదలు పెట్టిన పరుగును వం దేళ్లు దాటినా ఆపలేదు. ఈ వయసులోనూ ఫౌజా సింగ్ ఉత్సా హంగా పరుగులు తీసి రికార్డులకెక్కారు. పలు మారథాన్లను పూర్తిచేసిన ఘనతను సొంతం చేసుకున్నారు. లండన్, న్యూయార్క్, టొరంటోలలో జరిగిన మారథాన్ లలో ఫౌజా సింగ్ పాల్గొన్నారు. ఫౌజా సింగ్ మరణంపై పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా విచారం వ్యక్తంచేశారు. వందేళ్లు దాటి నా ఉత్సాహంగా పరుగులు తీస్తూ యువతకు ఆయన స్ఫూర్తిగా నిలిచారని అన్నారు.

# సంక్షిప్తంగా

## రైతుల భూమిసేకరణపై వెనక్కి తగ్గిన కర్ణాటక సర్కార్

**బెంగళూరు, జులై 15:** కర్ణాటకలోని దేవనహళ్లి తాలూకా చెన్నరాయపట్న హుబ్లి వద్ద 1,777 ఎకరాల రైతు భూములను సేకరించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను పూర్తిగా ఉపసంహరిం చుకున్నట్టు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంగళవారంనాడు ప్రకటించారు. బెంగళూరు రూరల్ జిల్లా చెన్నరాయపట్న హుబ్లి, సమీప గ్రామాల్లో 1,777 ఎకరాల సారవంతమైన వ్యవసాయ భూములను సేకరించాలన్న కర్ణాటక ప్రభుత్వ ప్రతిపాదనకు వ్యతిరేకంగా మూడున్నర ఏళ్లుగా రైతులు, ల్యాండ్ రైట్ యాక్టివిస్టులు తీవ్ర నిరసనలు సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో హైటెక్ డిఫెన్స్, ఏరోస్పేస్ పార్క్ పెట్టాలని ప్రభుత్వ ఆలోచనగా ఉంది. రైతుల సుదీర్ఘ




ఆందోళన నేపథ్యంలో సిద్ధరామయ్య అధ్యక్షతను మంగళవారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వ హించారు. ప్రభుత్వ అధికారులు, రైతు సంఘాలు, భూముల యజమానులు, ల్యాండ్ రైట్స్ యాక్టివిస్టులు విధానసౌధలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. భూసేకరణకు సంబంధించిన తుది నోటిఫికేషన్‌ను రద్దు చేయా లని ఈ సమావేశంలో ప్రభుత్వం నిర్ణయించింది.

## సైన్యంపై వ్యాఖ్యల కేసులో రాహుల్‌గాంధీకి బెయిల్

**లక్నో, జులై 15:** ఇండియన్ ఆర్మీపై పరువునష్టం కలిగించే వ్యాఖ్యలు చేశారన్న కేసులో కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీకి ఊరట లభించింది. ఆయనకు ఎంపి/ఎమ్మెల్యే కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. రూ. 20,000 వ్యక్తిగత పూచీకత్తు, రెండు ష్యూరిటీలు సమర్పించాలని అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ అలోక్‌వర్మ ఆదేశించారు. తదుపరి విచారణకు ఆగస్టు 13వ తేదీకి వాయిదా వేశారు. రాహుల్ మంగళవారం కోర్టు ముందు హాజరుకాగా, గతంలో ఐదుసార్లు ఆయన విచారణకు గైర్హాజరయ్యారు. 2020లో భారత్, చైనా బలగాల మధ్య ఘర్షణలు సమయంలో భారత సైనికుల మనోభావాలను దెబ్బతీసేలా రాహుల్ వ్యాఖ్యలు చేశారంటూ బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ మాజీ డైరెక్టర్ ఉదయ్‌శంకర్ శ్రీవాస్తవ ఈ పిటిషన్ వేశారు. భారత్ జోడో యాత్ర సమయంలో సరిహద్దుల్లోని పరిస్థితిని రాహుల్ ప్రస్తావిస్తూ అరుణాచల్ ప్రదేశ్‌లో భారత సైనికులను 'కొడుతుంటే' మీడియా ఎలాంటి ప్రశ్నలు వేయడం లేదని అన్నట్లు పిటిషనర్ పేర్కొన్నారు.

## ఎన్నికల్లో పార్టీ బలంతోనే ప్రభుత్వం ఏర్పాటుచేస్తాం: పళనిసామి



**చెన్నై,జులై 15:** బీజేపీ తదితర పార్టీల కలయి కతో ఏర్పడిన పొత్తు పటిష్టమని, సొంత బలం తోనే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని మాజీముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్షనేత ఎడప్పాడి పళని సామి మరోమారు ధీమా వ్యక్తంచేశారు. సేలం అసెంబ్లీ నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటుచేసిన పార్టీ కార్యాలయాన్ని సోమవారం ఉదయం ప్రారంభించిన ఈపీఎస్ అక్కడినుంచి ఎన్నికల ప్రచారానికి బయలుదేరారు. ఈపీఎస్ మీడి యాతో మాట్లా డుతూ, అన్నాడీఎంకే కూటమి ఏకాభిప్రాయంతో దృఢంగా, విజయం సాధిస్తా మన్న నమ్మకంతో ఉందని, అందువల్ల 2026లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమ కూటమి ఘన విజయం సాధించి తీరుతుందని అన్నాడీఎం సొంత బలంతోనే అధికార పీఠమె క్కుతుందని ధీమా వ్యక్తం చేశారు.

## విద్యార్థినిపై లెక్చరర్ల అఘాయిత్యం: తల్లిదండ్రుల ఫిర్యాదుతో అరెస్ట్

**బెంగళూరు, జులై 15:** విద్యార్థులకు విద్య నేర్పి మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురువులే మానవ మృగలలా ప్రవర్తించారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ దారుణం జరిగింది. బెంగళూరులోని ఓ ప్రైవేట్ కాలేజీలో నరేంద్ర అనే వ్యక్తి ఫిజిక్స్ లెక్చరర్‌గా, సందీప్ బయాలజీ లెక్చరర్‌గా, అనూప్ నాన్‌టీచింగ్ స్టాఫ్‌గా పనిచే స్తున్నారు. అదే కాలేజీలో ఇంటర్ చదువుతున్న విద్యార్థినిని నరేంద్ర అకడమిక్ నోట్స్ షేరింగ్ పేరుతో పరిచయం చేసుకున్నాడు. ఆ తర్వాత అనూప్ ఇంటికి పిలిపించుకుని ఆమెపై అత్యా చారానికి పాల్పడ్డాడు. నరేంద్ర విషయం బయ టపెడతానని బ్లాక్‌మెయిల్ చేసి కొన్ని రోజుల తర్వాత సందీప్ కూడా అత్యాచారం చేశాడు. ఆ ఇద్దరితో కలిసేందుకు తన రూమ్‌కు పలుమార్లు వచ్చిన సిసి ఫుటేజ్ ఉందని బెదిరించి అనూప్ కూడా అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇలా ముగ్గు రూ ఆమెను బెదిరిస్తూ దఫాలుగా అఘాయి త్యా నికి ఒడిగట్టారు. చివరికి ఆ విద్యార్థిని తనను కలిసేందుకు వచ్చిన తల్లిదండ్రులతో విషయం చెప్పగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. బాధితురాలికి వైద్యపరీక్షలు చేయించారు.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు



- ప్రతీ నియోజకవర్గంలో 50 నుండి 100 ఎకరాల భూమిని గుర్తించండి
- ఏటా 15 శాతం వృద్ధిరేటు లక్ష్యంతో జిల్లా, నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ లను రూపొందించండి




**ఏలూరు ప్రభాతవార్త :** జిల్లా స్థూల ఉత్పత్తిని రెట్టింపు చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలి– విజన్ యాక్షన్ ప్లాన్ సమీక్షా సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మరియు జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు జిల్లాలో ప్రతీ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటుచేసేందుకు 50 నుండి 100 ఎకరాల భూమిని వెంటనే గుర్తించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మరియు ఏలూరు జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో మంగళవారం జిల్లా, నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ లపై అధికారులతో మంత్రి సమీక్షించారు. జిల్లా కలెక్టర్ సెల్వి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, బడేటి రాధాకృష్ణయ్య (చంటి), సొంగా రోషన్ కుమార్, మద్దిపాటి వెంకటరాజు, ఎస్పీ కె. పి.ఎస్. కిషోర్, జేసి పి. ధాత్రిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయాల మేరకు స్వర్ణాంధ్రప్రదేశ్2047 లక్ష్యాలకు అనుగుణంగా జిల్లా, నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ లను ఏటా 15 వృద్ధిరేటు లక్ష్యంతో జిల్లాలో పటిష్టంగా అమలు చేసేందుకు నియోజకవర్గ ప్రత్యేక అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, వచ్చే సమావేశం నాటికి విజన్ యాక్షన్ ప్లాన్ తుది ప్రణాలికను స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలతో సిద్ధంచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న నూతన పారిశ్రామిక విధానం ద్వారా పరిశ్రమల స్థాపనకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి, ప్రధాన నగరం విజయవాడ ఏలూరు నగరానికి దగ్గరలో ఉండడం, జాతీయ రహదారి, రవాణా సౌకర్యాలు మెరుగ్గా ఉండడంతో పారిశ్రామికవేత్తలు జిల్లాలో పరిశ్రమల స్థాపనకు మొగ్గు చూపుతున్నారని, జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన మంచి వాతావరణాన్ని కల్పించి,, పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూములను గుర్తించడంతోపాటు, ప్రాథమిక మౌలిక సదుపాయాలు కల్పించినట్లయితే పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకువస్తారన్నారు. పరిశ్రమల స్థాపనతో స్థానిక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని, జిల్లా స్థూల ఉత్పత్తి మరింత పెరుగుతుందన్నారు. జిల్లాలో వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన ఆక్వా, ఉద్యానవనాలు రంగాలలో అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల స్థాపనతో జిల్లా స్థూల ఉత్పత్తిని రెట్టింపు చేసేలా వివిధ శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో 100 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల లక్ష్యానికిగాను ఇప్పటివరకు 27 యూనిట్లు ఏర్పాటుచేశామని, నూజివీడులో పెద్దతరహా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని, మిగిలినవి నిర్దేశించిన సమయంలోగా ఏర్పాటుచేస్తామన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుచేయడం జరిగిందని, మిగిలిన నియోజకవర్గాలలో త్వరలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ జిల్లాలో విద్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల స్థాయిని పెంచడంతోపాటు, విద్యార్థుల స్థాయిని అనుసరించి అదనపు తరగతి గదులు నిర్మాణం, మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించేలా చూస్తున్నామన్నారు. ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా

7వ పేజీలో

## గ్రామీణాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది

### కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

**భీమవరం, జూలై 15 ప్రభాతవార్త :** వికసిత్ భారత్ లక్ష సాధనలో గ్రామీణ అభివృద్దే కీలకపాత్ర అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. నీతి ఆయోగ్ యొక్క ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా రాజస్థాన్‌లోని సిరోహి జిల్లా, మౌంట్ అబూ బ్లాక్‌లలో రెండు రోజులపాటు కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పర్యటించారు. రెండో రోజు మంగళవారం మౌంట్ అబూ బ్లాక్ లో పర్యటించిన కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ ప్రధాని మోడీ పిలుపుమేరకు అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో పాల్గొని మొక్కను నాటారు. మౌంట్ అబూలోనీ బ్రహ్మకుమారి ప్రధాన ఆశ్రమాన్ని సందర్శించారు. అనంతరం అయోధ్యలోని రామమందిర నిర్మాణంలో పాలుపంచుకున్న స్థానిక కార్మికులు, కళాకారులను కలిసి మాట్లాడారు. మౌంట్ అబూ గ్రామీణ ప్రాంతంలో కేంద్ర నిధులతో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను స్థానిక జాలోర్ ఎంపీ లుంబారామ్ చౌదరి, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన స్వయంగా పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి, కార్యక్రమాల లక్ష్యాలను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్ మరియు ఉన్నతాధికారులతో అధికారులతో సుదీర్ఘంగా నిర్వహించిన సమీక్షా సమావేశంలో శ్రీనివాస వర్మ ఆదేశించారు. ఈ సందర్భంగా



కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉందని ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం, నిర్వహణ ద్వారా రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం కోసం ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన, ప్రతి కుటుంబానికి సురక్షితమైన త్రాగునీటిని అందించడం కోసం జల్ జీవన్ మిషన్, గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతను పెంపొందించడం, బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా మార్చడం కోసం స్వచ్ఛ భారత్ మిషన్, ప్రజలకు ఆరోగ్య సంరక్షణ సేవలను అందుబాటులోకి తీసుకురావడం కోసం ఆయుష్మాన్ భారత్ వంటి ఎన్నో పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. స్థానిక ప్రజలు తమ సమస్యలను కేంద్రమంత్రి వర్మ దృష్టికి తీసుకురాగా, వాటిని తక్షణమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు

మొగల్తూరు జులై 15 (ప్రభాతవార్త) కాళీపట్నం పడమర పంచాయతీ పరిధిలో వెలసివున్న శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కి మంగళవారం ఆలయ అర్చకులు కొత్త లంక గజిని ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు మరియు అభిషేకములు నిర్వహించారు, ఈ సందర్భంగా చుట్టుప్రక్కల గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని నైవేద్యములు సమర్పించారు, అనంతరం ఆలయ ఆవరణలో అఖండ అన్న సమారాధన నిర్వహించారు.



# కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వమే మేలు

## ఉమ్మడి పశ్చిమ జిల్లా న్యాయమూర్తి శ్రీదేవి




**ఏలూరు న్యాయవిభాగం.. ప్రభాతవార్త :** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఒక వారం రోజులపాటు "మధ్యవర్తిత్వం- దేశం కోసం" అంశం పై వివిధ రకాల అవగాహన సదస్సులు నిర్వహించమని అందులో భాగంగా ఈరోజు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్పర్సన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ శ్రీదేవి ఏలూరు న్యాయవాదుల బార్ అసోసియేషన్ న్యాయవాదులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్పర్సన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి న్యాయవాది తమ యొక్క కక్షిదారులకు మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల కలిగే ఉపయోగాల పైన అవగాహన కలిగించాలని, పరిష్కారానికి మార్గమైన అనుకూలమైన కేసులను మధ్యవర్తిత్వానికి రిఫర్ చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని న్యాయవాదులు, కక్ష దారులు ఉపయోగించుకుని కేసులు పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్న ప్రసాద్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనెరు సీతారాం మరియు న్యాయవాదులు పాల్గొన్నారు.






## వైసిపి పార్టీ మొగల్తూరు మండలం ఉపాధ్యక్షులుగా

### సాధనాల నాగ రాజు కుమార్ కుక్కల మణికుమార్ ఎన్నిక

మొగల్తూరు జులై 15(ప్రభాతవార్త) ఇటీవల వైసిపి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మరియు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, వైసీపీ పార్టీ, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు మరియు మాజీ శాసనసభ్యులు ముదునూరి ప్రసాదరాజు ఆధ్వర్యంలో మండల కమిటీలు ఏర్పాటు చేయడం జరిగింది. దీనిలో భాగంగా, ఆదివారం ఒక ప్రకటనలో విడుదల చేశారు, మండలాధ్యక్షులుగా రేవు నారాయణ రాజు, ఉపాధ్యక్షులుగా సాధనాల నాగరాజు కుమార్(1) కుక్కల మణికుమార్ రెండవ ఉపాధ్యక్షులుగా, మరియు ప్రధాన కార్యదర్శులుగా నలుగురు, కార్యదర్శులుగా ఐదుగురు,



సభ్యులుగా 27 మంది నియమించడం జరిగింది

## మావుళ్ళమ్మను దర్శించుకున్న ధూళిపాల నరేంద్ర

భీమవరం జులై 15 ప్రభాతవార్త : పొన్నూరు శాసనసభ్యుడు సంఘం డైరీ చైర్మన్ ధూళిపాలి నరేంద్ర, ఏపీఐఐసీ చైర్మన్ పశ్చిమగోదావరి జిల్లా టిడిపి అధ్యక్షుడు మంతెన రామరాజు సతీ సమేతంగా భీమవరంలోని మావుళ్ళమ్మ ,గునుపూడి సోమేశ్వరస్వామి దేవాలయాలను సందర్శించారు.దేవాలయ అధికారులు అర్చకులు అధికార లాంఛనాలతో స్వాగతం పలికి వారి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.దర్శనం అనంతరం వేద పండితులతో ఆశీర్వచనాలు అందించారు.



# స్మార్ట్ మీటర్లు వ్యతిరేకించాలని రౌండ్ టుబుల్ సమావేశం

తణుకు, జులై 15(ప్రభాత వార్త): ప్రజలపై భారం పెరిగే విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జె.ఎన్.వి.గోపాలన్ పిలుపునిచ్చారు. మంగళవారం తణుకు అమర వీరుల భవనంలో ఆదాని స్మార్ట్ మీటర్లు వద్దు %-%ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రజలకు భారంగా మారి ఆదాని స్మార్ట్ మీటర్లు ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, విద్యుత్ కోతలు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా విచ్చేసిన గోపాలన్ మాట్లాడుతూ ఆదానితో రాష్ట్ర ప్రభుత్వం చేసుకొన్న ఒప్పందాలు ప్రజలకు చాలా ప్రమాదకరమన్నారు. గత ప్రభుత్వం చేసుకొన్న ఒప్పందాలు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా అమలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల్లో విద్యుత్ భారాలు తగ్గిస్తామని కూటమి అధికారంలోకి వచ్చాక రూ.15 వేల కోట్లు భారం వేసిందని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు వలన బిల్లు గూబ గుయ్ మంటుందని అన్నారు. డే అండ్ నైట్ డిమాండ్ బట్టి రేట్ పెంచే విదంగా ఒప్పందాలు ఉన్నాయని అన్నారు. ఇప్పటికే ట్రూ అప్, సర్దుబాటు వంటి పేర్లతో భారీగా బిల్లు వస్తున్నాయని పేర్కొన్నారు. కరెంట్ తక్కువ వాడినా, వాడక పోయినా స్మార్ట్ మీటర్లు వలన బిల్లు భారీగా వస్తుందని అన్నారు. ఇప్పటికే పెరిగిన భారాలతో ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో విద్యుత్ భారాలు వేయడం సరికాదని అన్నారు. గత ప్రభుత్వం ఉన్నప్పుడు లోకేష్ మీటర్లు పగలు కొట్టమని చెప్పి ఇప్పుడు అదే మీటర్లు పెట్టమని చెప్పడం సిగ్గు చేటన్నారు. ఈ ఒప్పందాలు రద్దు చేయకుంటే 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ ఉద్యమం మళ్ళీ పునఃరావృతం అవుతుందని హెచ్చరించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు మాట్లాడుతూ అధికారంలో ఉంటే ఒక విధంగా, ప్రతి పక్షంలో ఉంటే ఒకవిధంగా చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని



విమర్శించారు. స్మార్ట్ మీటర్లు ద్వారా ప్రజలకు జరిగే నష్టం ఎక్కువగా ఉంటుందన్నారు. విద్యుత్ బిల్లులు తగ్గిస్తామని చెప్పి పెంచడం అన్యాయం అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ళ చినవీరబద్రం, గార రంగారావు, సూరిబాబు, అంబటి రామకృష్ణ, ఉషా, దున్నే నాగేశ్వరావు, వి.నాగేశ్వరావు, యం.గంగాధర్ రెడ్డి, టి.వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## వరి పంట వరుస క్రమంలో వేయండి - వ్యవసాయ అధికారి శివశంకర్

చాట్రాయి, జూలై 15, ప్రభాతవార్త : వరి పంట వరుస క్రమంలో వేయటం వల్ల అధిక దిగుబడి సాధించేందుకు అవకాశం ఉందని మండల వ్యవసాయ అధికారి శివ శంకర్ అన్నారు. మండల కేంద్రమైన చాట్రాయిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి నాట్లు వేసే విధానాన్ని ఆయన పరిశీలించి మాట్లాడుతూ మొక్కకు మొక్కకు దూరం ఉండటం వల్ల గాలి ఆడటమే కాకుండా మనము చల్లే ముందు ప్రయోజనం కలుగుతుందని ఆయన చెప్పారు. గాలి ఎక్కువగా రావటం వల్ల వరి దుబ్బు దానివల్ల వరి ధాన్యం ఎక్కువ బస్తాలయ్యే అవకాశం ఉందని అని చెప్పారు. రోటరీ కొనోవేటర్ యంత్రం సహాయంతో కలుపు



తీసేందుకు అవుతుందని చెప్పారు. దోమలను కూడా అరికట్టేందుకు అవకాశం ఉన్నందున రైతులు సూచనలు తప్పక పాటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మోసకారి సంక్షేమాన్ని అమలు చేసిన గత వైసిపి ప్రభుత్వం

- ఏడాదిలోనే 80 శాతం హామీలను అమలు చేసిన కూటమి
- అభివృద్ధితోపాటు సంక్షేమాన్ని అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం
- సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు/ ఇరగవరం, జులై 15(ప్రభాత వార్త): గత వైసిపి ప్రభుత్వం మోసకారి సంక్షేమాన్ని అమలు చేసిందని గ్రహించిన రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వానికి భారీ ఆదిత్యంతో పట్టం కట్టారని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇరగవరం మండలం రేలంగి గ్రామంలో మంగళవారం ఇంటింటికి పర్యటించిన ఎమ్మెల్యే రాధాకృష్ణ గత ఏడాది కాలంగా అందుతున్న సంక్షేమాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ఏడాది కాలంలోనే 80 శాతం ఇచ్చిన హామీలను అమలు చేసినట్లు గుర్తు చేశారు. అయితే వైసిపి నాయకులు మాత్రం ఉద్దేశపూర్వకంగా కూటమి ప్రభుత్వంపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు పెన్షన్లు, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు, ఏడాదికి ఉచితంగా మూడు సిలిండర్లు పథకాలతోపాటు నిరుద్యోగులకు డీఎస్సీ పరీక్ష నిర్వహించామని చెప్పారు. సంపూర్ణ మద్యపాన నిషేధం చేసి 2024 ఎన్నికలకు వెళ్తానని శపథం చేసిన వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారని ఆరోపించారు. గత 5 ఏళ్లలో ఒక్క డీఎస్సీ అమలు చేయకపోగా కేవలం నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. త్వరలోనే రైతులకు ఇచ్చిన హామీ మేరకు అన్నదాత పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు. రాజధాని నిర్మాణంతోపాటు పోలవరం నిర్మాణాన్ని చేపడుతూ పెద్ద ఎత్తున పరిశ్రమలను రాబట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశేష కృషి చేస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఇంటికి వెళ్లిన ప్రజలు సంతప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. రిటైర్డ్ ఉద్యోగస్తులకు సైతం ప్రతినెలా సక్రమంగా పెన్షన్లు ఇవ్వకుండా గత వైసిపి పాలకులు కాలయాపన చేశారని విమర్శించారు. ఉద్యోగులకు సైతం మొదటి తేదీన జీతాలు అందజేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదని అన్నారు. గ్రామాల్లో అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని ప్రణాళిక బద్దంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## యాంటీ లార్వా ఆపరేషన్ పరిశీలించిన అధికారి.

అత్తిలి జులై 15( ప్రభాతవార్త ): అత్తిలి గ్రామంలో ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో గ్రామ పంచాయతీ వారు నిర్వహిస్తున్న యాంటీ లార్వాల్ ఆపరేషన్ ను క్షేత్ర స్థాయిలో సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు పరిశీలించారు.డ్రైన్స్,సుదీర్ఘ నీటినిల్వ కుంటలు మొదలగు ఔట్ డోర్ బ్రీడింగ్ సోర్సెస్ పై ఈ యాంటీ లార్వాల్ స్ప్రేయింగ్ వలన లార్వా దశలోనే దోమ పుట్టుకకు బ్రేక్ పడుతుందని అన్నారు. ప్రజలు డ్రైన్ లలో చెత్త వేయవద్దని,చెత్త వేయడం వలన మురుగు నీరు పారుదలకు ఆటంకం కల్గి,తిరిగి దోమల పుట్టుకకు స్థావరాలుగా



మారతాయన్నారు. ప్రతీ రోజూ డ్రైడే పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ వెంకటరాజు,హెల్త్ అసిస్టెంట్ గనిరాజు,ఆరోగ్య కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించిన అధికారి

అత్తిలి జులై -15( ప్రభావం వార్త) ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవలను ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని తాడేపల్లిగూడెం డివిజనల్ డెవలప్మెంట్ అధికారి ఎం.ప్రభాకరరావు అన్నారు. అత్తిలి, గ్రామ సచివాలయంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఆధార్‌కేంద్రాన్ని డివిజనల్ డెవలప్మెంట్ అధికారి .ప్రభాకరరావు, ఇంచార్జి డిప్యూటీ ఎంపీడీఓ ఎం. శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 0-5 సంవత్సరాల పిల్లలకు క్రొత్త ఆధార్ లు అప్‌డేట్ చేయించడం, మార్పులు చేసుకోవడం, మొబైల్ నెంబర్లు లింకు చేసుకోవడం తదితర కార్యక్రమాలను క్యాంపులో అందుబాటులో ఉంచామన్నారు. ఈ



నెల 15 నుండి 18 వరకు తిరిగి 22 నుండి 25 వరకు అవకాశ ముందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాస్కర్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు..

# విద్యార్థులకు స్టీల్ కంచాలు, గ్లాస్ లు పంపిణీ



భీమవరం జులై 15 ప్రభాతవార్త : ప్రభుత్వంపాటు దాతలు కూడా విద్య విషయంలో ప్రోత్సహిస్తే విధ్యార్థులు ఇంకా అభివృద్ధి పథంలో ఉంటారని ఝాన్సీ లక్ష్మి బాయి మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కృష్ణ కుమారి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మంగళవారం భీమవరం జెఎల్ బి మున్సిపల్ హైస్కూల్లోని 150 మంది బాలికలకు స్టీల్ కంచాలు, గ్లాస్ లను దాతల సహకారంతో పంపిణీ చేశారు. దాతలందిస్తున్న సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పట్టణంలోని భోగలింగేశ్వర స్వామి దేవస్థానం అర్చకులు పుసలూరి కృష్ణమూర్తి (మంగేష్) ఆర్థిక సహకారంతో 150 మంది విద్యార్థులకు స్టీల్ కంచాలు, గ్లాస్ లు అందించామన్నారు. కార్యక్రమంలో డ్రిల్ మాస్టర్ రోజా, ఉపాధ్యాయులు సుచిత్ర, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని వినతి

## - షెడ్యూల్ కులాల జాతీయ కమిషన్ సభ్యులు రామచంద్రర్ కు వినతి



భీమవరం ప్రభాతవార్త : ఇటీవల కాలంలో ఎస్టీ ఎస్టీల దళితులపై దాడులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ది బుదిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్, బిఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ ఫౌండర్ కోనా జోసెఫ్ కోరారు. మంగళవారం భీమవరం విచ్చేసిన జాతీయ షెడ్యుల్డ్ కులముల కమీషన్ మెంబర్ గవర్నమెంట్ అఫ్ ఇండియా వడ్డేపల్లి రామచందర్, జాతీయ షెడ్యుల్డ్ కులముల కమీషన్ డైరెక్టర్ గవర్నమెంట్ అఫ్ ఇండియా డా జి సునీల్ కుమార్ బాబుకు వినతిపత్రాన్ని అందించారు. ముందుగా బిఆర్ అంబేద్కర్ సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# గర్భిణీలకు ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్లు ఇవ్వాలి.



అత్తిలి జూలై -15 ( ప్రభాతవార్త ): రక్తహీనతతో బాధపడే గర్భిణీలకు ఐరన్ ఇంజక్షన్లు ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జి. గీతా బాయి అన్నారు. అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఐరన్ ఇంజక్షన్లు గర్భిణీలకు ఇవ్వటం వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల తీసుకుంటున్న జాగ్రత్తలు, వ్యాధి నివారణ చర్యలను వైద్యాధికారి డాక్టర్ జి నాగరాజును అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో సహజ ప్రసవాలు ఎక్కువగా జరిగేలా చూడాలని వైద్యాధికారిని ఆదేశించారు. దోమల నిర్మూలనకు తీసుకుంటున్న జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు. హెచ్ ఎస్ జి ప్రమీల రాణి,, హెచ్ ఎ ఏ అమ్మాజీ, జెఎస్ గనిరాజు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# సత్యవరం సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా మైగాపుల రాము ఎంపిక



పెనుమంట్ర, జూలై-15, ప్రభాతవార్త: పెనుమంట్ర మండలంలోని సత్యవరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం (సొసైటీ) త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా టిడిపి సీనియర్ నాయకులు మైగాపుల నాగ వెంకట శ్రీరాములు (రాము) ఎంపికయ్యారు. గతంలో ఆయన 2012 నుండి 2019 వరకు సొసైటీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ కమిటీలో సభ్యులుగా దిగమర్తి వేణు, కట్టా సత్యనారాయణలు నియమితులయ్యారు. వారి ఎంపికను సత్యవరం గ్రామస్తులు, కూటమి నాయకులు హర్షాతిరేకాలతో స్వాగతిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# దోమల లార్వా నిర్మూలనకై పిచికారి



చాట్రాయి, జులై 15,ప్రభాతవార్త : వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఆరుగొలను పేట, పర్వతాపురం గ్రామాలలో దోమల లార్వా నిర్మూలనకై డ్రైనేజీలు ఇతర నీటి నిల్వ గుంటలలోనూ క్రిమిసంహారిక మందు పిచికారి చేసినట్లు చాట్రాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. కె విజయలక్ష్మి, డాక్టర్ బి దుర్గాప్రసాద్ తెలిపారు. వర్షాకాలం కారణంగా డ్రైనేజీలు నీటి నిల్వ గుంటలలోనూ నీరు చేరి దోమలు అభివృద్ధి చెందుతాయని ఇండ్లలోని చెత్త చెదారాలను డ్రైనేజీలలో వేయకుండా ప్రజలు సహకరించాలని వారు కోరారు. ఇంటి ఆవరణలో టైర్ల లోనూ పాడైపోయిన ప్లాస్టిక్ వస్తువులలోనూ, వాడేసిన కొబ్బరి బొండాల్లోనూ వర్షపునీరు చేరుతాయి కాబట్టి అలాంటి వాటిని నిర్మించుకోవాలని కోరారు. ఇంటిలోని కూలర్లు, ఫ్రిజ్ ల వెనుక భాగంలోనూ ఉండే నీటిని వారానికి ఒకసారి తీసివేయాలని అన్నారు. తద్వారా దోమల అభివృద్ధి తగ్గి డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా లాంటి వ్యాధుల నుండి రక్షణ పొందవచ్చని అన్నారు . ఈ కార్యక్రమంలో ఆరుగొలను పేట, పర్వతాపురం సర్పంచులు పి. అప్పిరెడ్డి, యం. శివాజీ సూపర్వైజర్ జి. ప్రభాకర్, పి. హెచ్. యన్.. జి. నాగమణి,పంచాయతీ సెక్రటరీలు నరసింహారావు, సూర్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ డి. సురేష్,ఏఎన్ఎంలు శ్రీలక్ష్మి , మధురవాణి, యం.యల్.హెచ్.పి. ప్రకాష్, ఆషాలు పాల్గొన్నారు

# చింతలపూడి మున్సిపల్ కార్మికుల వేతన వ్యత్యాసాలు అమలు చేయాలి



చింతలపూడి.. ప్రభాత వార్త: చింతలపూడి నగర పంచాయతీ కార్మికుల సమావేశం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద జరిగింది. కార్మికులకు చెల్లించవలసిన ప్రభుత్వ జీవో ప్రకారం జీతాలు చింతలపూడి నగర పంచాయతీ చెల్లించడం లేదని, నగర పంచాయతీ అయిన దగ్గర నుండి పారిశుధ్య కార్మికులకు ఇవ్వవలసిన జీతాలు ప్రభుత్వ జీవోల ప్రకారం అమలు చేయకుండా అరకొర జీతాలు ఇస్తున్నారని, ప్రభుత్వ వ్యవస్థలోనే కార్మికులకు ప్రభుత్వ జీవోల ప్రకారం జీతాలు అమలు చేయకపోవడం పారిశుధ్య కార్మికుల శ్రమను దోచుకోవడమేనని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ వి ఎస్ నారాయణ చింతలపూడి మున్సిపల్ కార్మికుల సమావేశంలో అన్నారు. ప్రభుత్వ జీవోల ప్రకారం ఒక్కొక్క పారిశుధ్య కార్మికునకు రెండు లక్షల పైనే జీత వ్యత్యాసం బకాయి చింతలపూడి నగర్ పంచాయతీ ఇవ్వాలని ప్రభుత్వ సంస్థలే కార్మికులను ఈ విధంగా మోసం చేయడం సోచనీయమని అన్నారు. చింతలపూడి మేజర్ పంచాయతీ స్థాయి నుండి నగర పంచాయతీగా రూపుదిద్దుకొని నాలుగు సంవత్సరాలు దాటింది. అప్పటినుండి ప్రజల వద్ద మున్సిపల్ నిబంధనల ప్రకారం పన్నులు వసూలు చేస్తున్నప్పుడు కార్మికులకు మున్సిపల్ జీవో నిబంధనలు ఎందుకు వర్తింప చేయట్లేదని, కార్మికులకు ఇవ్వవలసిన సెలవులు గాని, జాతీయ సెలవులు గాని కార్మికులకు ఇవ్వటం లేదని, పని భారం విపరీతంగా పెంచి రోజుకు 9 గంటల పైగా పనిచేపిస్తున్నారని ఇందుకు నిరసనగా పారిశుధ్య కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు పెంచాలని, పని భారం తగ్గించాలని, క్యాజువల్ లీవులు అమలు చేయాలని, ఇంజనీరింగ్ కార్మికులకు ఇవ్వవలసిన ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెకు సంఘీభావంగా చింతలపూడి నగర పంచాయతీ కార్మికులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు అవుతారని, ఈనెల 19వ తేదీన మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలియజేసి సమ్మె నోటీసు నగర పంచాయతీ కమిషనర్ కు, లేబర్ డిపార్ట్మెంట్ కు అందజేస్తామని సమస్యను పరిష్కరించుకుంటే సమ్మె చేయటానికి కూడా వెనకాడబోమని సిఐటియు మండల అధ్యక్షులు నత్త వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు రోటరీ క్లబ్ జంగారెడ్డిగూడెం అధ్యక్ష కార్యదర్శులు పెనుమర్తి సురేష్ బాబు, సంధ్యా ప్రవల్లిక ఆధ్వర్యంలో ప్రోత్సాహకం అందించే దిశగా స్థానిక విద్యా వికాస్ కాలేజీ నందు మంగళవారం మెడల్స్ బహుకరణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పదో తరగతిలో 600 మార్కులకు 592 సాధించిన ముగ్గురు విద్యార్థులను మద్ద జయనిస్సీ,వంటిపల్లి దివ్యశ్రీ, మద్దు సుజనాలకు,584 సాధించిన నేలగోవుల వి జగదీష్ లకు కేయూ రోటరీ స్మారక మెడల్స్ బహుకరణ జరిగింది. కాలేజీ యాజమాన్యం పూదోడ సతీష్ చంద్ర,ప్రసన్నలక్ష్మి, సిటీ కేబుల్ ఎండి పాలపర్తి శ్రీనివాస్,రోటరీ ప్రెసిడెంట్ పెనుమర్తి సురేష్ బాబు, సెక్రెటరీ సంధ్యా ప్రవల్లికలు ఈ మెడల్స్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ సీనియర్ సభ్యులు చల్లారి మాణిక్యాలరావు, భవిరిశెట్టి తిలక్,రోటరీ నూతన సభ్యులు కుబేర చిట్స్ పసల సూర్యచంద్రరావు,తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ భక్తాంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు



మొగల్తూరు జూలై 15 ( ప్రభాతవార్త) రామన్నపాలెం గ్రామంలో వెలసి ఉన్న శ్రీ భక్తాంజనేయ స్వామివారి ఆలయం నందు మంగళవారం ఆలయ అర్చకులు వాడపల్లి గోపాల మూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

# 180 కేజిలతో బాలాత్రిపుర సుందరికి ఆషాఢ మాస సారె




భీమవరం జులై 15 ప్రభాతవార్త : భీమవరం మెంటేవారి తోటలోని శ్రీబాల త్రిపుర సుందరి దేవి అమ్మవారికి మంగళవారం 180 కేజిలతో ఆషాఢ మాస సారె అందించారు. తోటకూర కృష్ణ, ఫణిలక్ష్మి దంపతుల సహకారంతో ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ముందుగా 108 మహిళలచే ఆలయ ప్రాంగణం నుంచి మెంటేవారి తోటలో 180 కేజిలతో ఆషాఢ మాస సారె తో ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

# ఏఎంసి వైస్ చైర్మన్ కు అభినందన.



అత్తిలి-జులై 15( ప్రభాత వార్త): అత్తిలి మండలం దంతుపల్లి గ్రామానికి చెందిన కడలి రామాంజనేయులు ను అత్తిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులుగా నియమించిన సందర్భంగా అభినందన సభను నిర్వహించారు. కార్యక్రమానికి వర్రే శ్రీను అధ్యక్షత వహించారు. టిడిపి నాయకులు శిరగాని నాగేశ్వరరావు, కోరివల్లి హరి, కడలి వెంకటనారాయణ,దండరాజు, కలిగితి దయానంద మూర్తి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. తనను ఏఎంసీ ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు తణుకు శాసన సభ్యుడు ఆరిమిల్లి రాధాకృష్ణ కు రామాంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రామాంజనేయులు ను అభినందించారు.

# ముప్పర్తిపాడును పాఠశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే.



అత్తిలి- జులై 15( ప్రభాతవార్త ):గణపవరం మండలం ఉప్పర్తిపాడు గ్రామంలో నంబర్తో ప్రాథమిక పాఠశాలలను ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు ప్రారంభించారు. పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. మండల విద్యాధికారి గొర్రెల బాలయ్య ముప్పర్తిపాడుగ్రామ నాయకులు పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మానవ తప్పిదాలే పర్యావరణ ప్రమాదాలకు కారణాలు



జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: మానవ తప్పిదాలే పర్యావరణ ప్రమాదాలకు కారణమవుతున్నా యన్న ప్రముఖ న్యాయవాది అచ్యుత శ్రీనివాసరావు, ఆధ్యాత్మిక వేత్త కే ఎల్ ఎం ధన కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెం శ్రీ రామచంద్ర డిగ్రీ కళాశాలలో చైర్మన్ బీవీ కృష్ణారావు అధ్యక్షతన మంగళవారం పర్యావరణ ప్రమాదాల తులనాత్మక అధ్యాయనం విపత్తును తగ్గించుకునే విధానాలపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పర్యావరణ ప్రమాదాలు నివారించుకునే పద్ధతులపై పరిశోధన పత్రాలు సమర్పించారు. వారి అనుభవాలను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అలాగే పరిశోధనా పత్రాలు సమర్పించిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ ఎం.ఎన్.వి సూర్యకుమారి,సీఈవో టి సురేష్,రాధిక,ఉమా మౌనిక, హిమబిందు,బోస్,అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు



ఏలూరులో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని, వారికి పరిశ్రమల ఏర్పాటులో అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలన్నారు. ఏలూరు నియోజకవర్గంలో ఎన్నో ఇంజనీరింగ్ కళాశాలలు, వైద్య కళాశాలలు ఉన్నాయని, కోర్స్ పూర్తిచేసుకున్న యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఏలూరులో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ కొల్లేరు ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరైనా అటవీ శాఖ వారు అభ్యంతరాల కారణంగా చేపట్టలేకపోతున్నారన్నారు. దెందులూరు నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. పాడిపశువుల కొనుగోలుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంపై రైతులకు మరింత అవగాహన కలిగించాలన్నారు. చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ చింతలపూడి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుచేయడం జరిగిందని, ప్రవాసాంధ్రులు పరిశ్రమలు ఏర్పాటుచేసేందుకు ముందుకు వస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ప్రాథమిక అవసరాలైన రోడ్లు మంజూరుచేయాలని మంత్రి కోరారు. ఈ విషయంపై మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందిస్తూ చింతలపూడి నియోజకవర్గంలో పంచాయతీయరాజ్, రహదారులు, భవనాల శాఖకు సంబందించిన రోడ్ల మరమ్మత్తులు, కొత్త రోడ్ల నిర్మాణాలపై బుధవారం సాయంత్రంలోగా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్ కలెక్టర్ బి. స్మరణ రాజ్, జంగారెడ్డిగూడెం ఆర్డీఓలు అచ్యుత్ అంబరీష్, ఎం.వి. రమణ, ఆర్టీసీ విజయవాడ ప్రాంతీయ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, నియోజకవర్గ యూనిట్ల కార్యాలయాల సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కనసనపల్లి యువతికి సాయి ప్రియకు హిప్నోసిస్ అవార్డు





ఆగిరిపల్లి 15 ప్రభాత వార్త. :మండల పరిధిలోకనసనపల్లి గ్రామానికి చెందిన పేట సాయి ప్రియ గ హైదరాబాద్‌లో జరిగిన హిప్నోసిస్ అవార్డ్స్ 2025 కార్యక్రమంలో 'కిక్ స్టార్ట్ అవార్డు – ప్రొఫెషనల్ హిప్నోథెరపిస్ట్ అవార్డు' ను అందుకొన్న సందర్భంలో ఆమెకు అభినందనలు తెలిపారు. పేట సాయి ప్రియ గత కొంతకాలంగా సైకాలజిస్ట్ & హిప్నోథెరపిస్ట్‌గా విద్యార్థులు, మహిళలు, వృద్ధులకు సానుకూల మార్పులు తీసుకువస్తూ అనేక మందికి నూతన జీవితం అందిస్తున్నారు. ఈ అవార్డు అందుకోవడం ద్వారా కనసా నపల్లి గ్రామానికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు హలో గ్రామమంతా ఉత్సాహంతో ఉన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "ఈ గుర్తింపు నా ఒక్కదానిది కాదు ఊరి ఆశీర్వాదాలు, కుటుంబం, మైండ్ సపోర్ట్ టీమ్ ప్రోత్సాహం వలనే సాధ్యమైంది. ముందు రోజుల్లో ఇంకా ఎక్కువ మందికి మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించి, హిప్నోథెరపీ ద్వారా మార్పులు తీసుకురావాలన్నది నా లక్ష్యం" అని తెలిపారు. ఈ విజయాన్ని ఊరంతా సంతోషంగా జరుపుకుంటూ, గ్రామ పెద్దలు, యువత, కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు. "మన ఊరిలో ఇలాంటి ప్రతిభావంతులు పెరగాలి" అని స్థానికులు తెలిపారు. పేట సాయి ప్రియ ఊరికి, యువతకు ఒక చక్కటి రోల్ మోడల్ అని పలువురు అభినందించారు.

# ఏపీ ట్రాన్స్కో ఇంజినీర్లకు శిక్షణ అవగాహన సదస్సు



ఆగిరిపల్లి జూలై 15 ప్రభాతవార్త : ఆగిరిపల్లి సమీపంలోని ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం పునరుత్పాదక ఇంధన వనరులపై అవగాహన సదస్సు జరిగింది. పవర్ రీసెర్చ్ & ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి టి. శైలజ మార్గదర్శకత్వం వహించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ వెంకటరావు మాట్లాడుతూ పునరుత్పాదక ఇంధన వనరుల ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులు, ఇంజినీర్లు ఈ రంగంలో అవకాశాలు చర్చించాలని పేర్కొన్నారు. గ్రేట్ ఇండియా సంస్థకు చెందిన చీఫ్ ఇంజనీర్ కేబీవీ రామకుమార్ ఆధ్వర్యంలో సాంప్రదాయేతర ఇంధన నిర్వహణ, సామర్థ్యం అంశాలపై ఏపీ ట్రాన్స్కో ఇంజినీర్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగభాస్కర్, ఈఈఈ విభాగాధిపతి మరియు పరీక్షల నియంత్రణాధికారి ఎన్. సాంబశివరావు పాల్గొన్నారు. వారు ఏపీ ట్రాన్స్కో మరియు పవర్ రీసెర్చ్ & ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆక్వారంగానికి నాణ్యమైన విద్యుత్తును అందించాలి

## పీ4 సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ




కైకలూరు జూలై 15 (ప్రభాతవార్త) :నియోజకవర్గంలో ఎక్కువగా ప్రజలు ఆక్వారంగంపై ఆధారపడి ఉన్నారు కాబట్టి ఇక్కడ ప్రజలు విద్యుత్ సమస్యలతో తరచూ ఇబ్బందులు పడుతున్నారని కాబట్టి నాణ్యమైన విద్యుత్తు కైకలూరు నియోజకవర్గంలో అందించవలసిందిగా రాష్ట్ర శాసన మండలి సభ్యులు జయ మంగళ వెంకటరమణ కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరకాలం అయిన సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఏలూరు జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్, పీ4 సమీక్ష సమావేశంలో భాగంగా మంగళవారం ఏలూరు జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన ఏలూరు కలెక్టరేట్ లోని గౌతమి హాల్ నందు నిర్వహించగా శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ పాల్గొని కైకలూరు నియోజకవర్గంలోని సమస్యలపై వివరించారు. కైకలూరు పంచాయతీలో మంచినీటి సమస్య చాలా తీవ్రంగా ఉన్న సందర్భంగా పాడైపోయిన ఫిల్టర్ బెడ్లు గత నాలుగు సంవత్సరాల నుండి రిపేరుకు నోచుకోలేదని అందువలన కైకలూరు గ్రామ ప్రజలు అపరిశుభ్రమైన నీరు త్రాగుట వలన వివిధ రకాలైన అంటూ వ్యాధులు ప్రబలుతున్నాయని,తక్షణమే పాడైపోయిన ఫిల్టర్ బెడ్ లను రిపేర్ చేయించవలసిందిగా మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.కొల్లేరు ప్రాంతంలో ప్రజలు పనుల కోసం సుదూర ప్రాంతాలకు వలస వెళ్లవలసిన వస్తుంది కాబట్టి కొల్లేరు లో ఉన్న ప్రధాన డ్రైన్లు ఉపాధి హామీ పథకం కింద పనులు చేయుటకు ఏలూరు కలెక్టర్ వారికి ఆదేశాలు జారీ చేయవలసిందిగా మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

# ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి




జంగారెడ్డిగూడెం,ప్రభాత వార్త: జంగారెడ్డిగూడెం ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పాటించకపోతే వారి మీద కఠిన చర్యలు తీసుకుంటామని జంగారెడ్డిగూడెం డిఎస్పి రవిచంద్ర హెచ్చరించారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం పట్టణంలోని వివిధ ఆటో డ్రైవర్ల యూనియన్ సభ్యులతో విస్తృత సమావేశం జరిగింది. డి.ఎస్.పి రవిచంద్ర మాట్లాడుతూ ఆటోలలో పరిమితి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని,ప్రయాణికులతో మర్యాదగా మాట్లాడాలని, లౌడ్ స్పీకర్లు పెట్టుకొని ఆటోలు నడపవద్దని సూచించారు. డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపినా,ఆటోలు నడిపినప్పుడు అన్ని పత్రాలు దగ్గర ఉంచుకోవాలన్నారు. జిల్లాలో జంగారెడ్డిగూడెం ఆటో డ్రైవర్ లు మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సి ఐ ఎంవి సుభాష్, ఎస్సై షేక్ జబీర్, ట్రాఫిక్ ఎస్ఐ కుటుంబరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 20 ఆటో యూనియన్లతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మద్దిలో హనుమద్ కళ్యాణం



జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త : మండలంలోని గుర్వాయిగూడెం లోని శ్రీ మద్ది ఆంజనేయ స్వామి వారి ఆలయంలో మంగళవారం ఉదయం నుంచి ఆలయ అర్చకులు పలుపూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయం మండపంపై శ్రీ సువర్చల హనుమద్ కళ్యాణ క్రతువు నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన మంగళవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు బారులు తీరి స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం వరకు దేవస్థానమునకు వివిధ సేవల,విరాళాల ద్వారా 1,83,399 లు సమకూరిందని ఆలయ కార్య నిర్వహణ అధికారిణి ఆర్.వి చందన తెలిపారు. నిత్యాన్నదాన సత్రం నందు సుమారు 1000 మంది భక్తులు అన్నప్రసాద వితరణ చేశారని ఆమె తెలిపారు.

# తెర



## జూనియర్‌కి బాస్..

ప్రముఖ రాజకీయ నాయకుడు, వ్యాపారవేత్త గాలి జనార్ధన్ రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి రాధా కృష్ణ దర్శకత్వం వహించిన యూత్ ఎంటర్‌టైనర్ జూనియర్‌తో హీరోగా అరంగేట్రం చేస్తున్నాడు. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. జెనీలియా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ సినిమాలో నాది ఒక మంచి బాస్ క్యారెక్టర్. సినిమా ముందు కెళ్తున్న కొద్దీ ఆ క్యారెక్టర్‌లో చాలా మార్పులు వస్తాయి. అవన్నీ కూడా చాలా కొత్తగా ట్రీట్ చేశారు డైరెక్టర్. జీవితమన్నప్పుడు అన్ని ఉంటాయి. అయితే ఎన్నో అద్భుతమైన సినిమాలు చేశాను. బొమ్మరిల్లు హాసిని వెరీ మెమొరబుల్ క్యారెక్టర్. అలాగే హ్యాపీలో మధుమతి, కథ సినిమా.. ఇప్పటికీ ఆడియన్స్ నా క్యారెక్టర్స్ పేరుతోనే నన్ను పిలుస్తుంటారు. అది ఒక నటిగా చాలా గొప్ప ఆనందాన్ని ఇస్తుంది. మంచి క్యారెక్టర్స్ వస్తే నటించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. చిన్న క్యారెక్టర్ అయినా గుర్తుండిపోయే క్యారెక్టర్ చేయడం నాకు ఇష్టం. ఇండస్ట్రీలోకి రావడం, ఇన్ని పాత్రలు చేయడం, ప్రేక్షకుల నుంచి విశేషమైనటువంటి అభిమానాలు పొందడం ఇదంతా కూడా నాకు ఒక డ్రీమ్ లాగా అనిపిస్తుంది. ఇంతకుమించిన డ్రీమ్ ఏమీ లేదు. మజిలీ రీమేక్ చేశాం. అది అద్భుతమైన విజయాన్ని ఇచ్చింది. మరో మంచి లవ్ స్టోరీ కుదిరితే సినిమా చేయాలని ఆలోచన అయితే ఉంది.




### ఓ రాజకీయ కుటుంబ నేపథ్యం

## ప్రభుత్వ సారాయి దుకాణం

జాతీయ అవార్డ్ దర్శకులు నరసింహ నంది తాజాగా ఎస్వీఎస్ ప్రొడక్షన్స్, శ్రీనిధి సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ప్రభుత్వ సారాయి దుకాణం సినిమా ఫస్ట్‌లుక్ విడుదల కార్యక్రమం గ్రాండ్‌గా జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్మాత ప్రసన్న కుమార్, దర్శకులు సముద్ర, నటుడు పృధ్వితో పాటు చిత్ర యూనిట్ పాల్గొన్నారు. షేక్స్పియర్ కథలోని పాత్రల ఆధారంగా తీసుకొని తెలంగాణలో ఒక మారుమూల ప్రాంతంలో జరిగే పొలిటికల్ ఫ్యామిలీ ఇతివృత్తంగా పగ, ద్వేషం, ఈర్ష్య, అసూయ, ప్రేమ మనిషిలోని వివిధ కోణాలను చూపిస్తూ ప్రభుత్వ సారాయి దుకాణం సినిమా కథను తయారు చెయ్యడం జరిగింది. 1980 నాటి పరిస్థితులు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మలిచారు. ఈ సందర్భంగా దర్శకులు నరసింహ నంది మాట్లాడుతూ కమర్షియల్ అంశాలతో కూడుకున్న కథ ఇది. అన్ని వర్గాల ప్రేక్షకులు ఈ కథకు కనెక్ట్ అవుతారని తెలిపారు. దర్శకుడు సముద్ర మాట్లాడుతూ....నేను నరసింహ నంది మంచి స్నేహితులం. ప్రతి సినిమా విభిన్నంగా చేస్తూ వచ్చారు. ప్రభుత్వ సారాయి దుకాణం మోషన్ పోస్టర్ చాలా బాగుంది అని అన్నారు. నిర్మాత ప్రసన్న కుమార్ మాట్లాడుతూ నరసింహ నంది డైరెక్ట్ చేసిన 1940లో ఒక గ్రామం సినిమాకు నేషనల్ అవార్డ్ రావడం విశేషం. ఈ చిత్ర యూనిట్ చాలా క్రమశిక్షణతో కనిపిస్తున్నారు. ఆర్టిస్ట్‌గా కాకుండా గెస్ట్‌గా వచ్చిన పృధ్వి ఈ సినిమా చాలా బాగుందని చెపుతున్నారు. తప్పకుండా ఆయన మాటలు నిజం కాబోతున్నాయని తెలిపారు. నటుడు పృధ్వి మాట్లాడుతూ ఈ సినిమాలో మా అమ్మాయి శ్రీలు చక్కటి రోల్‌లో నటించింది. తనతో పాటు అందరికి ఈ సినిమా ఒక మంచి బ్రేక్ రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. నిర్మాత నరేష్ గౌడ మాట్లాడుతూ.... త్వరలో మా ప్రభుత్వ సారాయి దుకాణం సినిమా థియేటర్స్ లో అందరిని అలరించబోతోందన్నారు. నిర్మాత పరిగి మల్లిక్ మాట్లాడుతూ నరసింహ నంది ప్రాణం పెట్టి ఈ సినిమాను తెరకెక్కించాని చెప్పారు. హీరో విక్రమ్ మాట్లాడుతూ..ఈ చిత్రం తప్పకుండా మీ అందరికి నచ్చుతుందని భావిస్తున్నానన్నారు. ఈ సినిమా నా కెరీర్‌లో ఒక మంచి సినిమాగా మిగిలిపోతుందని నమ్మకం ఉంది అని హీరో సదన్ పేర్కొన్నారు. హీరో వినయ్, హీరోయిన్ అధితి మైకేల్, హీరోయిన్ శ్రీలు దాసరి, హీరోయిన్ మోహన సిద్ధి, నటుడు తిలక్ తదితరులు మాట్లాడారు.

## 18న ఓం సంత్ తుకారాం

పదిహేడవ శతాబ్దపు మరాఠీ సాధువు, కవి భక్తిని ప్రతిఘటనగా మార్చిన సంత్ తుకారాం జీవితం, వారసత్వం, సాహిత్య విప్లవం ఆధారంగా దర్శకుడు, నిర్మాత, నటుడు అయిన ఆదిత్య ఓం సంత్ తుకారం చిత్రాన్ని రూపొందించారు. ఈ చిత్రంలో ప్రముఖ మరాఠీ నటుడు సుబోధ్ భావే టైటిల్ రోల్‌ను పోషిస్తున్నారు. మరాఠీ, హిందీ సినిమాల్లో భావే తన అద్భుతమైన నటనతో అందరినీ మెప్పించారు. ఈ చిత్రం జూలై 18న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ క్రమంలో తాజాగా ఈ మూవీకి సంబంధించిన రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో శివ సూర్యవంశీ, షీనా చోహన్, సంజయ్ మిశ్రా, అరుణ్ గోవిల్, శిశిర్ శర్మ, హేమంత్ పాండే, గణేష్ యాదవ్, లలిత్ తివారీ, ముఖేష్ భట్, గౌరీ శంకర్, ట్వింకిల్ కపూర్, రూపాలి జాదవ్, దీరి అక్బర్ సామి వంటి ప్రఖ్యాత నటులు కీలక పాత్రలకు జీవం పోశారు. ప్రముఖ నటుడు ముఖేష్ ఖన్నా ఇచ్చిన వాయిస్ ఓవర్ సినిమాకి హైలెట్ కానుంది. నిఖిల్ కామత్, రవి త్రిపాఠి, వీరల్, లావన్ స్వరపరిచిన పాటలు అందరినీ ఆకట్టుకోనున్నాయి. శాస్త్రీయ, జానపద, భక్తి భావాల్ని కలిగించేలా పాటలు ఉండనున్నాయి. ప్రతి పాట తుకారాం పాత్ర భావోద్వేగ, తాత్విక పరిణామాన్ని ప్రతిధ్వనిస్తుంది. పురుషోత్తం స్టూడియోస్‌తో కలిసి బి. గౌతమ్‌కు చెందిన కర్జన్ ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రం పాన్‌ఇండియా వైడ్‌గా రిలీజ్ కాబోతోంది.



### హాలీవుడ్ స్థాయికి

## హైదరాబాద్ ఎదగాలి

**శ్రీమద్ భాగవతం తెలంగాణ సినిమా పరిశ్రమకు కొత్త ఊపిరి అవుతుంది**

**చిత్ర షూటింగ్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్ష**

హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక రామోజీ ఫిల్మ్ సిటీలో 'శ్రీమద్ భాగవతం పార్ట్ 1' చిత్రం షూటింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే రంగారెడ్డి, ప్రముఖ నిర్మాత మోతీ సాగర్, రామోజీ గ్రూప్ ఎండీ కిరణ్, విజయేశ్వరి (ఎండి, రామోజీ ఫిల్మ్ సిటీ) తదితర ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీమద్ భాగవతం సినిమా తీయాలన్న ఆలోచన వచ్చినందుకు సినిమా టీమ్‌ను అభినందిస్తున్నా. తరం మారుతున్న ఈ సమయంలో శ్రీమద్ భాగవతం లాంటి సినిమాలు చాలా అవసరం. నలభై ఏళ్ల క్రితం రామాయణం సీరియల్ రామాయణాన్ని అందరికీ చేరువ చేసింది. కోవిడ్ టైమ్‌లో మళ్లీ రామాయణం సీరియల్‌ను టెలికాస్ట్ చేస్తే రికార్డు సృష్టించింది. 2035 లోగా తెలంగాణను 1 ట్రిలియన్ ఎకానమిగా తీర్చి దిద్దాలని మేం సంకల్పించాం. 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమిగా తీర్చిదిద్దాలని ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఇందుకోసం 2047 విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసుకుంటున్నాం.. ఇందులో సినిమా రంగానికి ఒక ప్రత్యేక చాప్టర్ ఉంటుంది. ఆనాడు రామానంద్ సాగర్ తీసిన రామాయణం సీరియల్ ఎంత పాపులర్ అయిందో.. శ్రీమద్ భాగవతం పార్ట్1 సినిమా అంత హిట్ అవ్వాలని కోరుకుంటున్నా.. రాబోయే రోజుల్లో హాలీవుడ్ సినిమాలు కూడా హైదరాబాద్‌లో షూటింగ్ చేసే స్థాయికి ఎదగాలని మా ఆకాంక్ష.. అని ఆయన పేర్కొన్నారు.

ఈ చిత్రం తెలంగాణలో సినిమా పరిశ్రమకు కొత్త ఊపిరి పోసే అవకాశం ఉందని, రామోజీ ఫిల్మ్ సిటీ వంటి అత్యాధునిక సౌకర్యాలు దీనికి దోహదపడతాయని సినీ పరిశ్రమ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. శ్రీమద్ భాగవతం పార్ట్1 చిత్రం తెలుగు సినిమా ఖ్యాతిని మరింత పెంచే దిశగా ఒక ముందడుగుగా భావిస్తున్నారు.




రామోజీ ఫిల్మ్ సిటీలో 'శ్రీమద్ భాగవతం పార్ట్ 1' చిత్రం షూటింగ్ ప్రారంభోత్సవానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి

### ఎన్టీఆర్ పాత్రల ప్రేరణతో

## వీరమల్లు విల్లు



పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మక చిత్రం హరి హర వీరమల్లు జూలై 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. తాజాగా ఈ చిత్రం గురించి దర్శకుడు జ్యోతి కృష్ణ ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. హరి హర వీరమల్లు చిత్రంలో పవన్ కళ్యాణ్ పాత్రను రూపొందించడానికి దిగ్గజ నటులు ఎన్టీఆర్, ఎంజీఆర్‌ల నుండి ప్రేరణ పొందానని జ్యోతి కృష్ణ వెల్లడించారు. ఎన్టీఆర్, ఎంజీఆర్ వంటి దిగ్గజ వ్యక్తుల మాదిరిగానే పవన్ కళ్యాణ్‌లో ఉన్న అద్భుతమైన లక్షణాలను గమనించిన తర్వాతే ఆయన పాత్రను రాయడానికి ప్రేరణ పొందానని జ్యోతి కృష్ణ పేర్కొన్నారు. ధర్మపరుడిగా, బలవంతుడిగా మరియు ప్రజల మనిషిగా పవన్ కళ్యాణ్‌కి ఉన్న ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకొని హరి హర వీరమల్లులో ఆయన పాత్రను చాలా జాగ్రత్తగా రూపొందించినట్లు దర్శకుడు జ్యోతి కృష్ణ తెలిపారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా ఎంజీఆర్ సందేశాత్మక, నిజాయితీతో కూడిన సినిమాలు చేస్తూ నట జీవితాన్ని కొనసాగించారు. ఈ అంశం నాకు స్ఫూర్తినిచ్చింది. అందుకే హరి హర వీరమల్లులో 'మాట వినాలి' అనే శక్తివంతమైన మరియు ఆలోచింపజేసే పాటను స్వరపరిచాము. ఈ పాట యొక్క సారాంశం పవన్ భావజాలాన్ని ప్రతిబింబిస్తూ జీవితంలో సానుకూలత మరియు ధర్మాన్ని స్వీకరించడాన్ని తెలియజేస్తుంది. ఈ పాట ప్రేక్షకులను బాగా ప్రభావితం చేసింది.. అని జ్యోతి కృష్ణ అన్నారు. నటుడిగా ఎన్టీఆర్ యొక్క గొప్ప ప్రదర్శనలు పౌరాణిక మరియు జానపద చిత్రాల నుండి వచ్చాయి. ముఖ్యంగా రాముడు, కృష్ణుడు పాత్రలలో ఆయన ఒదిగిపోయిన తీరు చిరస్థాయిగా నిలిచిపోయింది. ఎన్టీఆర్ తన శక్తిని మరియు ధర్మాన్ని నిలబెట్టే సామర్థ్యాన్ని సూచించే విల్లు, బాణం పట్టుకున్న శ్రీరాముడిగా అద్భుతంగా చిత్రీకరించబడ్డారు. ఈ అంశం నుండి ప్రేరణ పొంది, హరి హర వీరమల్లులో పవన్ కోసం విల్లు, బాణాన్ని రూపొందించాము. పవన్ కళ్యాణ్ యొక్క శక్తిని సూచించడానికి, న్యాయం కోసం పోరాడటానికి మరియు ధర్మాన్ని నిలబెట్టడానికి ప్రతీకగా ఈ ఆయుధాలు రూపొందించబడ్డాయి అని జ్యోతి కృష్ణ వివరించారు. అలాగే తాను స్క్రిప్ట్ రాస్తున్నప్పుడు ప్రజలు పవన్ కళ్యాణ్‌ను కథానాయకుడిగా కాకుండా నాయకుడిగా చూస్తున్నారని గ్రహించానని ఆయన అన్నారు. కథనాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దేలా ప్రతి సన్నివేశాన్ని ప్రత్యేకంగా సృష్టించాలనుకున్నాను.. అని జ్యోతి కృష్ణ చెప్పారు.

## 'సయారా' ఈ తరానికి ప్రతిబింబం

భారతదేశంలో అత్యంత ప్రసిద్ధమైన ఫిల్మ్ మేకర్స్‌లో ఒకరైన మహేష్ భట్ తాజాగా 'సయార్హా' పై స్పందించారు. ప్రతి తరానికి ఒక ప్రేమకథ ఉంటుంది. ఆ తరానికి ప్రతిబింబంలా ఆ ప్రేమ కథ నిలుస్తుంది. నా దృష్టిలో 'సయార్హా' ఈ తరానికి చెందిన ప్రేమ కథగా, ప్రేమకు నిర్వచనంగా మారుతుంది. నేను ఆషికి సినిమాను ఎంతో నిజాయితీతో, స్వచ్ఛమైన ప్రేమతో చేశాను. అందుకే ప్రేక్షకులు ఆ చిత్రానికి ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యారు. నేటి తరానికి రొమాంటిక్ సినిమా ఎలా ఉండాలో చెప్పే నియమాల్ని 'సయార్హా' తిరిగి రాస్తుందని నమ్మకంగా చెప్పగలను. ఇంత వరకు మోహిత్ తీసిన చిత్రాల్లో ఇది చాలా భిన్నంగా అనిపిస్తోంది. ఈ చిత్రంలో మోహిత్ తనలోని ప్రేమ, లోతుని చూపించినట్టుగా కనిపిస్తోంది. తెరపై ఇద్దరు ప్రతిభావంతులైన నటులతో సయారాను తెరకెక్కించారు. ఇంత గొప్ప సినిమాను తీసేందుకు ముందుకు వచ్చిన వైఆర్‌ఎఫ్ వంటి స్టూడియోని చూస్తే గర్వంగా, సంతోషంగా ఉంది. సయారా చాలా కొత్తగా కనిపిస్తోంది. కొత్తవారితో మాత్రమే జరిగే ఓ మ్యాజిక్‌లా ఉంది. సయారా చిత్రంపై నా అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. జూలై 18న ఈ మూవీని చూడాలని వెయిట్ చేస్తున్నాను అని అన్నారు.





## 4వేల కోట్లతో రామాయణ

నితీష్ తివారి దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ప్రాజెక్ట్ రామాయణ. ఈ సినిమాపై రోజు రోజుకూ ప్రేక్షకుల్లో అంచనాలు భారీగా పెరిగి పోతున్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో నిర్మాత నమిత్ మల్హోత్రా ఈ సినిమా బడ్జెట్ గురించి చేసిన వ్యాఖ్యలు మరోసారి అందరి దృష్టిని ఆకర్షించాయి. ఏకంగా రూ. 4000 కోట్లతో దీన్ని నిర్మిస్తున్నట్లు చెప్పి ఆశ్చర్యపరిచారు. భారతీయ సినీ చరిత్రలో ఇప్పటివరకూ.. ఇంత భారీ బడ్జెట్ చిత్రం తెరకెక్కలేదని.. రామాయణ చరిత్ర సృష్టించడానికి సిద్ధంగా ఉందని అన్నారు. ఏ భారతీయ సినిమా కూడా ఈ ప్రాజెక్ట్ దరిదాపుల్లోకి కూడా రాలేదని తెలిపారు.

### సమ సమాజ స్థాపన కోసం

## అగ్రహారంలో అంబేద్కర్





మన భారత రాజ్యాంగ రూపశిల్పి బాబా సాహెబ్ అంబేద్కర్ సిద్ధాంతాల స్ఫూర్తితో రూపొందిన చిత్రం 'అగ్రహారంలో అంబేద్కర్'. ఇప్పటికే పలు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలలో పురస్కారాలు అందుకున్న ఈ చిత్రాన్ని రామోజీ లక్షమోజి ఫిల్మ్స్ పతాకంపై మంతా కృష్ణచైతన్య స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. హీరో కూడా ఆయనే కావడం విశేషం. ఈ సినిమా టైటిల్ సాంగ్‌ను దళిత సంచలనం పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ రిలీజ్ చేశారు. కృష్ణచైతన్య ఎన్నో కష్టాలు పడి తెరకెక్కించిన ఈ చిత్రం అసాధారణ విజయం సాధించాలని ఆయన ఆకాంక్షి ంచారు. అంబేద్కర్ అభిమానులైన ప్రతి ఒక్కరూ అగ్రహారంలో అంబేద్కర్ చిత్రం చూసి తీరాలని పిలుపునిచ్చారు. కృష్ణచైతన్య మాట్లాడుతూ అంబేద్కర్ భావజాలాన్ని విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యంగా తెరకెక్కించిన ఈ చిత్రాన్ని సినిటేరియా మీడియా వర్క్స్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం.. కుల మత ప్రాంత వర్గ వైషమ్యాలకు అతీతంగా సమ సమాజ స్థాపన కోసం కృషి చేసిన అంబేద్కర్‌కు గొప్ప నివాళిగా.. ఎన్నో వ్యయప్రయాసలకు లోనై చిత్రీకరించిన ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ ఆదరిస్తారని ఆశిస్తున్నాం అన్నారు.

## 'మిస్టర్ రెడ్డి'కి ఎమోషన్లు ఎన్నో..



ఎంతో తపన ఉంటేనే సినిమాలు నిర్మిస్తారు. ఎన్నో వ్యయ ప్రయాసలు పడితే గానీ ఓ మూవీ బయటకు రాదు. ఈ క్రమంలో నన్ను ఎంతో మంది మోసం చేశారు. కానీ నేను ఎప్పుడూ ఎక్కడా భయప డలేదు. నా టాలెంట్‌ను నమ్ముకుని ఇక్కడి వరకు వచ్చాను అని 'మిస్టర్ రెడ్డి' చిత్ర నిర్మాత టి. నరసింహారెడ్డి అన్నారు. ఈ మూవీని జూలై 18న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ ఇది అన్ని రకాల ఎమోషన్‌తో తీసిన చిత్రమన్నారు.

## రాశి నెగెటివ్ షేడ్



యదార్థ సంఘటనలతో రూపొందిన ఓ వైవిధ్యమైన గ్రామీణ ప్రేమకథగా ఉసురే ఆగస్టు 1న థియేటర్స్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. సీనియర్ హీరోయిన్ రాశి ఈ చిత్రంలో ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్‌ను చూస్తుంటే ఇదొక సహజమైన, వైవిధ్యమైన ప్రేమకథలా అనిపిస్తుంది. ప్రముఖ హీరోయిన్ రాశి నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపిస్తుందని అర్థమోతుంది.

### 'పోలీసు వారి హెచ్చరిక'తో

## బాధ్యత పెరుగుతుంది



తూలికా తనిష్క్ క్రియేషన్స్ బ్యానర్‌పై అభ్యుదయ దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్ధన్ నిర్మాతగా ఈ నెల 18న ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం 'పోలీసు వారి హెచ్చరిక'. ఈ చిత్రానికి కిషన్ సాగర్, నళినీ కాంత్ సినిమాటోగ్రాఫర్స్‌గా పనిచేయగా గజ్వేల్ వేణు సంగీతాన్ని అందించారు. శివ శర్వాణి ఎడిటింగ్ వర్క్ చేశారు. ఈ చిత్ర తొలి టికెట్ లాంచ్ చేసిన సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరు అయిన మట్టి కవి బెల్లి యాదయ్య మాట్లాడారు. 'నేను ఎన్నో సంవత్సరాల క్రితం నాటక రంగంలో నటించా.. ఇంతకాలం తర్వాత ఈ సినిమా కోసం ఇప్పుడు కెమెరాల ముందుకు వచ్చి మాట్లాడుతున్నాను. ఈ సినిమా మా ప్రాంతంలో కొన్ని నిజమైన లొకేషన్స్‌లో షూటింగ్ చేశాం. ఈ సినిమాలో మంచి కంటెంట్ ఉంది. అలాగే సమాజానికి మంచి సందేశాన్ని ఇస్తుంది' అని అన్నారు. నాకు చిన్నప్పటి నుండి సినిమాలపైన ఉన్న ఆసక్తితో ఈ సినిమాలో మంచి పాత్రను పోషించానని నటుడు సన్నీ అఖిల్ చెప్పుకొచ్చారు. నేను సాధారణంగా నాటికల ద్వారా ప్రేక్షకులకు పరిచయం. ఎక్కువగా నెగటివ్ రోల్స్‌లో నటించా.. ఈ సినిమాలో నా పాత్ర ఇప్పటి వరకు ప్రేక్షకులు నన్ను చూసిన పాత్రలతో పోలిస్తే కొంచెం భిన్నంగా ఉంటుంది అని నటి జయ వాహిని అన్నారు.

నిర్మాత బెల్లి జనార్ధన మాట్లాడుతూ... నేను ఆర్మీలో పని చేసి వచ్చాను. ఒక సినిమాను తెరపై చూపించేందుకు ముందుగా దర్శకులు ఎంతో కష్టపడతారు. మంచి కంటెంట్ ఉన్న ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తారని కోరుకుంటున్నాను అన్నారు. దర్శకుడు బాబ్జి మాట్లాడుతూ మనకు సాధారణంగా బయట కనిపించే సినిమాలు కాకుండా ఈ సినిమా కాస్త భిన్నంగా ఉండబోతోంది. ఈ సినిమాలో నెగటివ్ క్యారెక్టర్ల మధ్య మంచి సన్నివేశాలు ఉండబోతున్నాయి. వారి మధ్య ప్రేమ, పాటలు ఉండబోతున్నాయి. మా చిత్ర టైటిల్ ఇప్పటికే ప్రేక్షకులలోకి బాగా వెళ్ళింది. దానికి పోలీస్ వారికి మేము ధన్యవాదాలు తెలుపుకోవాలి. ఒక మంచి సందేశాన్ని ఈ చిత్రం ద్వారా ప్రేక్షకులకు తెలుపబోతున్నాము. ఈ సినిమా చూసిన ప్రేక్షకులు సమాజం మీద ఒక ప్రేమతో, బాధ్యతతో థియేటర్ నుండి బయటకు వెళ్తారు. మా సినిమాను అందరూ సపోర్ట్ చేయండి అంటూ ముగించారు.

# ఫోన్ కేస్‌తోనూ ముప్పే !



అవసరం, వ్యాపకం.. అమ్మాయిలకు ఫోన్ ఇంతకే పరిమితం కావడం లేదు. అది వాళ్లకో ఫ్యాషన్ స్టేట్‌మెంట్ కూడా. అందుకే క్యూట్ బొమ్మలు, చెయిన్లు, స్టోన్లంటూ భిన్న ఫోన్‌కేస్‌లతో అలంకరించేస్తుంటారు. అయితే అది అందానికి చేటవుతోందని గుర్తించారా మరి?

ఒక్కసారి ఊహించుకోండి... ఉదయం లేచి ఫోన్ చేతిలోకి తీసుకున్న దగ్గర్నుంచి... దాన్ని ఎక్కడెక్కడ పెడతాం! మంచం, డెస్క్‌టాప్, టీపాయ్, మనం ఎక్కడుంటే దాన్ని అందుబాటులో పెట్టాల్సిందే. వీటిల్లో తెర కాస్త మేలు దానిమీద దుమ్ము కనిపించినా, జిడ్డుగా తోచిన శుభ్రం వేసేస్తాం. కానీ వెనకా శుభ్రం చేయాలన్న ఆలోచనే రాదు.

దీంతో అది కాస్త సూక్ష్మజీవులకు ఆవాసంగా మారుతుంది. వాటిని తాకి ఆ చేతులతో ముఖాన్ని తాకితే అవి కాస్త మన చర్మంలోకి చేరతాయి. దీనితో యూక్నే, నైట్‌వాడ్స్, బ్లాక్‌హెడ్స్ వంటి సమస్యలన్నీ. పైగా అన్నీ తయారయ్యేది సింథటిక్ పదార్థాలు, ప్లాస్టిక్‌తోనే, అంటే తయారీలో రసాయనాలు వాడాల్సిందే. ఈ అలర్జీలు, కాంటాక్ట్ డెర్మటైటిస్‌లకు కారణం. అంతేనా, కొన్నిసార్లు ఏదో పనిచేసుకుంటూ భుజానికి ముఖానికీ మధ్య ఫోన్ బంధించి ఉంచుతాం. లేదా మాట్లాడేటప్పుడు అనుకోకుండా చెవికి, చెంపకీ ఫోన్ అదిమి పెడతాం ఈ రాపిడి అక్కడి హెయిర్ ఫాలికల్స్ మీద ప్రభావం చూపడమే కాదు, యాక్నేకీ కారణమవుతుంది. కాబట్టి, ఈ సమస్యలు తప్పాలంటే ఫోన్‌తోపాటు దాని కేసుని తరచుగా శుభ్రం చేయాలి. అలాగే ఇప్పుడు ఆంటీబ్యాక్టీరియల్ మెటీరియల్‌తో తయారవుతోంది. వాటిని తెచ్చుకుంటే సరిగ్గా ఎప్పుడూ హెడ్‌ఫోన్‌లు, ఇయర్ పాడ్స్ నిడివి వాడినా యాక్నే, అలర్జీల నుండి దూరంగా ఉండొచ్చు. వీటితోపాటు స్కిన్ కేర్ హైజీన్... అంటే బయటికి వెళ్లొచ్చాక ముఖం శుభ్రం చేసుకోవడం, మేకప్ తొలగించుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకుంటే తిప్పలే ఉండవు. □

# మహిళలకు పథకాలపై అవగాహన కల్పిస్తూ..

**రైతులు, గిరిజనులు, మహిళలనే కాకుండా పల్లెల్లో అందరి కోసం అన్నీ తానై పనిచేస్తున్నారు లచ్చిపతిని శాంతి. దీని కోసం 'దీక్ష' స్వచ్ఛంద సంస్థను స్థాపించి వేల కుటుంబాల్లో మార్పు తెచ్చారు. అధికారులు సైతం ఈమె కృషికి అభినందనలు తెలుపుతున్నారు. ఆ ప్రయాణం గురించి తెలుసుకుందాం..**



శాంతి

అమ్మవాళ్లది రాజమహేంద్రవరం సమీపంలోని నీలధరావుపేట. పెళ్లి తర్వాత విజయనగరం జిల్లా బాడంగి మండలం, వీరసాగరం వచ్చాక ఇక్కడి రైతులు, మహిళలు పడుతున్న ఇబ్బందుల్ని గమనించా. వీళ్లకోసం ఏదైనా చేయాలనుకున్నా. అప్పట్లో మా గ్రామ రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు లేక, బ్యాంకు రుణాలు అందేవి కాదు. అధికారుల సాయంతో పాసు పుస్తకాలు చేయించా. మహిళల కోసం 'అక్షర విజయం' కార్యక్రమాన్ని నిర్వహించా. నేనూ దూరవిద్యలో పిజి పూర్తి చేశా.

**నాబార్డ్ మెచ్చింది..**

గ్రామం కోసం కలసికట్టుగా పనిచేయాలని 1999 'దీక్షా మహిళా సంక్షేమ సంఘం' స్థాపించా. మొదట రోడ్లు, వీధులు, చెరువుల్ని బాగు చేసుకున్నాం. తర్వాత 'మన సంరక్షణ సమితి'లో భాగమై ప్రస్తుత పార్వతీపురం మన్యం జిల్లాలోని ఐదు గిరిజన గ్రామాల్లో చెట్ల సంరక్షణ, పోడు వ్యవసాయం, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన.. వంటివి చేపట్టాం. 2005లో గ్రామాల్లోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపైన అవగాహన కల్పించా. మా గురించి తెలుసుకున్న నాబార్డ్.. రైతు క్లబ్‌లు పెట్టమంటూ 2012లో సూచించింది. మొత్తం 45 గ్రామాల్లో క్లబ్‌లు ఏర్పాటుచేశాం. వీటిద్వారా రైతులు తమ సమస్యల్ని చర్చించి అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించు కుంటారు. మా ప్రాంతంలో రైతుల నుంచి దళారులు తక్కువ ధరకు వ్యవసాయ ఉత్పత్తుల్ని కొనడమే కాకుండా, ఆ డబ్బు సమయానికి ఇచ్చేవారు కాదు. పరిష్కారంగా 'రైతుల జట్టు' ఉత్పత్తిదారుల కంపెనీని నాబార్డ్ సహకారంతో ఏర్పాటుచేసుకున్నాం. దీన్లో 10 గ్రామాలకు చెందిన రైతులు సభ్యులు 2017 నుంచి బెల్లం ప్రాసెస్ చేసి, మార్కెటింగ్ చేస్తున్నాం. అనకాపల్లి పరిశోధన కేంద్రం నుంచి బెల్లం పొడి, క్యూబ్స్, చాక్లెట్లు.. తయారీపైన శిక్షణ తీసుకున్నాం. రాగి లడ్డూలు, పల్లీ ఉండలు, సున్నుండలు తయారుచేస్తున్నాం. బెల్లం ప్రాసెసింగ్ పరిశ్రమ కోసం ఎంపి ఫుడ్ ప్రాసెసింగ్‌లో దరఖాస్తు చేయగా.. డిసిసిబి, యాప్ ద్వారా రూ.5 కోట్ల రుణం వచ్చింది. ఈ యూనిట్ అందుబాటులోకి వస్తే బెల్లంతో మరిన్ని ఉత్పత్తులు తెస్తాం. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాయలం. అనుబంధ సంస్థలైన ఎఆర్ఎస్, కెవికెల ద్వారా పంట రైతులకు యాజమాన్య పద్ధతుల్లో శిక్షణ ఇచ్చి జీడి, పసుపు, తృణధాన్యాల్ని ప్రాసెసింగ్ చేయిస్తున్నాం.

**పథకాలపై అవగాహన...**

'దీక్షా' నిర్వహణలో రైతుల జట్టు, అక్షయ ధరణి, రైతు నేస్తం ఎఫ్‌పిసిలు ఉన్నాయి. మొత్తం 3500 మంది రైతులు వీటిలో అంకితభావంతో పనిచేస్తున్నారు. విశాఖకు చెందిన వై.లక్ష్మి, రైతుల జట్టుకు సిఇఒ, 'అక్షయ సిఇఒ లక్ష్మి.. మొదట్నుంచీ నాతో కలిసి ప్రయాణిస్తున్నారు. ఈ ఎఫ్‌పిసిలకు వ్యవసాయశాఖ, ఉద్యాన శాఖల నుంచి నిరంతర సహకారం, ప్రోత్సాహం అందుతున్నాయి. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నందుకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పురస్కారం అందించడంతోపాటు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ (ఆర్ఇఎసి) సభ్యురాలిగా, ఆర్ఎఆర్ఎస్ గుంటూరు సలహాదారుగా నియమించింది. 750 మంది మహిళలకు టైలరింగ్‌లో, వివిధ వ్యవసాయ ఉత్పత్తులపై విలువ ఆధారిత ఉత్పత్తుల్ని తయారుచేసుకునేలా నాబార్డ్ సహకారంతో శిక్షణ ఇచ్చాం. వీరందరికీ డిసిసిబి ద్వారా రుణాలనూ అందించాం. మేం పనిచేసే ప్రతిచోటా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు అందేలా అవగాహన కల్పిస్తున్నాం. గిరిజన గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తూ వాలంటీర్లకు 'గూంజ్' స్వచ్ఛంద సంస్థ సహకారంతో గృహోపకరణాల కిట్లు అందిస్తున్నాం. ఉచిత నేత్ర శిబిరాలు నిర్వహించి ఇప్పటివరకూ 30 వేల క్యాటరాక్ట్ ఆపరేషన్లు చేయించాం. 'లీఫార్మసీ-విశాఖపట్నం సంస్థ ద్వారా రక్తహీనత ఉన్న 1500 మంది గిరిజన గర్భిణులకు ప్రతి నెలా పౌష్టికాహారం అందిస్తున్నాం. □

# శాకాహారుల మెనూలో..



**శరీరంలో జీవక్రియలు సక్రమంగా జరగాలన్నా, కండరాలు బలోపేతం కావాలన్నా ప్రొటీన్లు ఎంతో అవసరం. ప్రత్యేకించి ఉదయాన్నే నిద్ర లేచింది మొదలు.. ఊపిరి సలపని పనులతో నిత్య బిజీగా ఉండే మహిళలు అలుపు లేకుండా ఉత్సాహంగా ఉండాలంటే ప్రొటీన్లు** అధికంగా ఉండే ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. అయితే ఇవి ఎక్కువగా లభించే మాంసాహారం, కోడిగుడ్లను పక్కన పెట్టి శాకాహారానికే ప్రాధాన్యమిస్తుంటారు కొందరు. ఇలాంటి వారు ప్రొటీన్లు పొందాలంటే ఈ పదార్థాల్ని మెనూలో చేర్చుకోవాలంటూన్నారు నిపుణులు.

**పప్పుధాన్యాలు....** కందులు, పెసలు, మినుములు మొదలైన వాటిలో ఉండే పోషకాలతో ఎన్నో ఆరోగ్య



ప్రయోజనాలు ఉన్నాయి. పప్పుధాన్యాల్లో ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. వీటిలోని పీచు పదార్థాలు కూడా శరీర బరువును క్రమబద్ధీకరిస్తాయి. అదేవిధంగా వీటిలో ఉండే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ డయాబెటిస్ లాంటి దీర్ఘ కాలిక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి.

**చిక్కుళ్లు..** కిడ్నీ బీన్స్ (రాజ్మా), బ్లాక్ బీన్స్.. వంటి చిక్కుడు జాతికి చెందిన పదార్థాల్లో ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. వీటిని ఆహారంలో భాగం చేసుకుంటే



ప్రొటీన్లతో పాటు బి-విటమిన్, ఫైబర్ శరీరానికి పుష్కలంగా అందుతాయి. అలాగే వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు.. గుండె జబ్బులు, క్యాన్సర్ లాంటి వ్యాధుల నుంచి రక్షణనిస్తాయి.

**నట్స్...** ప్రొటీన్లతో నిండి ఉండే బాదం పప్పు, పిస్తా, అక్రోట్ వంటి గింజలను ప్రతిరోజూ తీసుకుంటే గుండెకు ఎంతో మేలు కలుగుతుంది. వీటితో పాటు కొన్ని రకాల విటమిన్లు ఫైబర్ శరీరానికి అందుతాయి. అయితే నట్స్‌లో క్యాలరీలు కూడా ఎక్కువగానే ఉంటాయి. కాబట్టి మితంగా తీసుకోవడం మంచిదని



ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

**.పచ్చి బఠాణీలు..**ఒక కప్పు పచ్చి బఠానీల్లో 8 గ్రాముల వరకు ప్రొటీన్ ఉంటుంది. వీటిలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు శరీరం లోని చెడు కొలెస్ట్రాల్ స్థాయుల్ని తగ్గిస్తాయి. తద్వారా క్యాన్సర్, డయాబెటిస్ లాంటి దీర్ఘకాలిక వ్యాధుల నుంచి దూరంగా ఉండచ్చు. ఇక వీటిలో 'ఎ'. 'కె', 'సి'.. విటమిన్లు, ఫైబర్ వంటి పోష కాలు కూడా సమృద్ధిగా లభిస్తాయి.

**సోయా బీన్స్...** సోయా బీన్స్‌లో మాంసాహారానికి సరిసమానమైన స్థాయిలో ప్రొటీన్లు ఉంటాయి. ఇందు లోని బి, డి, ఇ- విటమిన్లు, క్యాల్షియం, ఐరన్, జింక్, అన్‌శ్యాచురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాలు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గించి.. రక్తపోటును నివారి స్తాయి. సోయాలో ఉండే యాంటీ ఆక్సిడెంట్ సమ్మేళనాలు మహిళల్లో మెనోపాజ్ దుష్ప్రభావాల్ని తగ్గించడంతో పాటు రొమ్ము క్యాన్సర్ నుంచి కూడా రక్షణ కల్పిస్తాయి. □

## చెలి చిట్కా

✦ సూప్‌ను స్టవ్‌మీద నుండి దించి రెండుచెంచాల పాలమీగడ కలపండి రుచిగా ఉండటమే కాక చిక్కదనం వస్తుంది. ✦ బ్రష్‌ను ఉప యోగించేముందు ఉప్పునీటిలో కొంచెం నానబెట్టండి. వేడినీరు వాడండి. ✦రాత్రి పడుకోబోయే ముందు మౌత్‌వాష్ చేసుకోవాలి. □

# చింతించడానికీ ఓ సమయం..



మనిషో చోట... మనసో చోట... చాలామంది అమ్మాయిలూ, మహిళలు ఎదుర్కొన్న పరిస్థితే ఇది, దీనంతటికీ కారణం మైండ్‌ఫుల్‌నెస్ లేకపోవడం. చేస్తోన్న పని మీద మనసు నిలవకపోవడం దీనికన్నా ముఖ్యమైన విషయాలు మనసుని వేధిస్తూ ఉండటం. ఇకపై ఇలా కాకూడదంటే... వ్యాయామాలకీ అల్పాహారానికి, భోజనానికి, పని సమయాన్ని ఎలా కేటాయిస్తామో.... సమస్యల కోసం ఆలోచించడానికీ ఓ సమయం కేటాయించాలి. దాన్నే 'వర్రీ విండో టైం' అంటున్నారు నిపుణులు.

15-20 నిమిషాలు చాలు! రోజులో మనకు వచ్చిన ప్రతికూల ఆలోచనలన్నీ ఓ చోట రాకుంటే ఉదయం ప్రయాణాల్లోనో, పనులన్నీ అయిపోయాకో, బ్రేక్ సమయంలో రాసిన వాటి ఎంపికగా చదువుతూ... వాటికోసం ఆలోచించమంటున్నారు. దీనికి పూర్తిగా 15-20 నిమిషాలు సరిపోతాయి. అలా చేయడం వల్ల ఒకదాని మీదే దృష్టి కేంద్రీకృతమై ఉంటుంది. దాంతో సమస్యలకు పరిష్కారాలు దొరుకుతాయి. కొన్ని వాటిని ఎలావచ్చో మైండ్ ఆలోచిస్తుంది. మైండ్ ఫుల్‌నెస్ టెక్నిక్ ఇది. నిర్ణీత సమయం తర్వాత ఆలోచనల్ని వెంటనే కట్టడి చేయాల్సిన బాధ్యత కూడా మీదే అంటే మనసూ, మైండ్ మీద నియంత్రణ ఈ స్థాయిలో ఉండాలంటోంది ఈ పద్ధతి. ఇంట్లో ఉండే నెగిటివిటీనీ, దుమ్మూ, దూళినీ బయటికి పంపడానికి ఎలా అయితే... ద్వారాలు, కిటికీలు తెరుస్తామో... అలానే మన మైండ్‌లో ఉండే ప్రతికూల ఆలోచనల్ని తరిమేయడానికి ఈ సమయాన్ని ఉపయోగించుకోమంటోంది వర్రీ విండో పద్ధతి అందుకే దీని పేరు కూడా. అయితే రాత్రిళ్లు, నిద్రపోయేముందు మాత్రం దీనికి సమయం కేటాయించొద్దు అంటున్నారు నిపుణులు. ఎందుకంటటే ఈ సమయంలో ఆలోచనల్ని అదుపు చేసుకోవడం కష్టమట. □

# కాఫీ ప్రేమికుల కోసం..

**ఒ కప్పు వేడివేడి కాఫీ తాగితే.. వర్క్‌టెన్షన్ పరార్ కదా! ఇందుకు ప్రతిసారీ వంటగది, పాంట్రీకి** వెళ్లనక్కర్లేదు. ఈ మగ్ వార్మర్ ఒకటి మీ దగ్గర ఉంటే చాలు. క్షణాల్లో మీరున్నచోటు నుంచే కాఫీ చేసుకుని తాగేయొచ్చు మరి. ఒక్క కాఫీ మాత్రమే కాదు వేడివేడి సూప్‌లను సైతం తయారుచేసుకోవచ్చు. ఈ వాటర్ ప్రూఫ్ మగ్ ఛార్జింగ్‌తో పనిచేస్తుంది. □



# ఒళ్లు విరుచుకుంటున్నారా?

పొద్దున నిద్ర లేవగానే ఒళ్లు విరుచుకుంటాం. ఎక్కువసేపు కూర్చొని చేసే పని పూర్తయ్యాక అప్రయత్నంగానే చేతులు చాచి, ఒళ్లు విరుచుకుంటాం. దీంతో పాటు తెలియకుండానే ఆవలిస్తాం కూడా. మనమే కాదు, పిల్లలు, కుక్కల వంటి చాలా జంతువులూ తరచూ ఒళ్లు విరుచుకుంటుంటాయి. ఇంతకీ దీంతో ఏమైనా ప్రయోజనముందా? ఒళ్లు విరుచుకోవటమనేది మెదడులోని హైపోథలమస్ భాగంలో మొదలవుతుంది. నిద్ర మ శరీర వంటి పనులను హైపోథలమస్ చేస్తుంది. దీన్నుంచి విడుదలైన హార్మోన్లు కార్టిజల్ వంటి ఇతర హార్మోన్లనూ ప్రేరేపిస్తుంది. కార్టిజాల్ ఒత్తిడి కారక హా అయినప్పటికీ జీవ గడియారంలో ఇదీ ఒక భాగమే. ఒళ్లు విరుచుకు పడుతున్నప్పుడు హాయి భావన కలగటానికి ఇది ఒక కారణం కావొచ్చు. లాభాలు చాలానే ఒళ్లు విరుచుకో వడంతో చాలా లాభాలే ఉన్నాయి. వయసు మీద పడుత విరుచుకోవటం తగ్గుతుండొచ్చు గానీ ప్రయోజనాల గురించి తెలిస్తే ఔరా అనాల్సిందే. ✦ కండర సంకోచాలను నియంత్రించే నాడులు తిరిగి గాడిలో పడతాయి. దీనితో ఎక్కువసే కదలకుండా ఉండటం వల్ల కండరాల్లో తలెత్తిన ఒత్తిడి తగ్గుతుంది. ఫలితంగా కండరాల వదులై కదలికలు సాఫీగా సాగుతాయి. ✦ లోపలి అవయవాలను పట్టి ఉంచే అనుసంధాన కణజాల పొరలు ఉత్తేజితమవుతాయి. అనుసంధాన కణజాలాల ఆరోగ్యం మెరుగవుతుంది. ✦ భంగిమను సరిచేసే కండరాలే శరీరం నిటారుగా ఉండటానికీ తోడ్పడతాయి. ఒళ్లు విరుచుకోవటం వల్ల ఉత్తేజితమయ్యే ఈ కండరాలు నడుస్తున్నప్పుడు తూలిపోకుండానూ కాపాడతాయి. □



# పిల్లలు నిజాయితీగా..

**పిల్లలు ప్రతి చిన్న విషయానికి అబద్ధం చెప్పడం, తాము తప్పు చేయడంలేదని వాదించడం వంటివి చేస్తున్నారంటే అది తల్లిదండ్రులను చూసి నేర్చుకుంటూ ఉండొచ్చు. అబద్ధాలు చెప్పే అలవాటు పెద్దవాళ్లకు ఉంటే గనుక పిల్లలు గ్రహిస్తారు. అదే విధానాన్ని అనుసరిస్తారు.** తాము నిజం మాట్లాడకుండా పిల్లలను మాత్రం పాటించాలని చెప్పడం మంచిది కాదు. వారిలో మార్పు తేవాలని అనుకోవడం కన్నా ముందుగా తల్లిదండ్రుల్లో మార్పు రావాలి. ఆ తర వాతే.. పిల్లలకు నేర్పించాలి. ఉన్నదున్నట్లుగా నిజాన్ని మాత్రమే మాట్లాడగలగడం, నిజాయితీగా ఉండటం వల్ల ఎటువంటి ప్రయోజనాలు ఉంటాయో కథల ద్వారానూ వినిపించాలి.

**అడిగి తెలుసుకోండి...** రోజూ కొంత సమయాన్ని పిల్లలతో గడపాలి. వారితో చర్చిస్తూనే వారి ఆలోచనలను పంచుకోవాలి. ఆ రోజు విశేషాలను అడిగి తెలుసుకుంటూనే ఆయా సందర్భాల్లో పిల్లలెలా ప్రవర్తించి ఉంటారో గుర్తిం



చాలి. చుట్టుపక్కలవారితో అనుబంధాన్నెలా కొనసాగిస్తు న్నారో తెలుసుకోవాలి. స్నేహితుల ఆలోచనలను అర్థం చేసుకోవడంతోపాటు వారిపట్ల నిజాయితీగా ఉండటం వల్ల ఎటువంటి ప్రయోజనాలు ఉంటాయో కథల ద్వారానూ వినిపించాలి.

**అడిగి తెలుసుకోండి...** రోజూ కొంత సమయాన్ని పిల్లలతో గడపాలి. వారితో చర్చిస్తూనే వారి ఆలోచనలను పంచుకోవాలి. ఆ రోజు విశేషాలను అడిగి తెలుసుకుంటూనే ఆయా సందర్భాల్లో పిల్లలెలా ప్రవర్తించి ఉంటారో గుర్తించాలి. చుట్టుపకనకలవారితో అనుబంధాన్ని కొనసాగి స్తున్నారో తెలుసుకోవాలి. స్నేహితుల ఆలోచనలను అర్థం చేసుకవోడంతోపాటు వారిపట్ల నిజాయితీగా ఉంటే, ఆ బంధాలను కలకాలం నిలుపుకోగలమన్న అవగాహన కలిగించాలి.

**ప్రశంసిస్తేనే...** మార్కుల విషయంలో మాత్రమే కాకుండా పిల్లల ప్రవర్తన ప్రశంసాపూర్తకంగా కనిపిస్తే వెంటనే అభినందించాలి. దీంతో ఇతరులను ప్రశంసించగలిగే నిజాయితీ పిల్లలూ నేర్చుకుంటారు. అసూయ, ద్వేషం వంటివి ప్రదర్శించకుండా మనస్ఫూర్తిగా ఎదుటివారి గొప్ప తనాన్ని గుర్తించి అభినందించడం తెలుసుకుంటారు. దీని ద్వారా ఎదుటివారి విశ్వాసాన్నీ, ప్రేమనూ పొందవచ్చని ప్రయోగాత్మకంగానూ పిల్లలకు అర్థమవుతుంది. అందరితో సత్సంబంధాలను ఏర్పరుచుకోగలుగుతారు. □

# ధైర్యమే ఆయుధం..

ఆధ్యాత్మికం

స్వామి వివేకానంద పరివ్రాజక సన్యాసిగా దేశమంతా పర్యటిస్తూ వారణాసి వెళ్లారు. అంజనేయ ఆలయం దర్శించుకొని తిరిగివస్తున్నారు. ఇంతలో కోతుల సమూహం కనిపించింది. అన్ని కోతులు ఒకేసారి ఎదురొచ్చే సరికి ఏం చేయాలో తోచక వెనుతిరిగారు. అవి వెంబడించసాగాయి. స్వామీజీ నడక వేగాన్ని పెంచారు. మర్కటాలూ అంతే వేగంగా తరమసాగాయి. నిస్సహాయస్థితిలో స్వామీజీ అటూ ఇటూ చూస్తున్నారు. ఇంతలో దగ్గర్లో చెట్టుకింద ఓ వృద్ధసాధువు 'అవేమీ చేయవు. భయపడకుండా ధైర్యంగా ఎదుర్కో అని హితవు పలికారు. దాంతో వివేకానంద పరుగు ఆపి నిర్భయంగా, స్థిమితంగా నిలబడ్డారు. తదేక దీక్షతో కోతుల వంక చూశారు. అంతే అవి తోకముడిచి పారిపోయాయి. కొన్ని సంవత్సరాల తర్వాత స్వామీజీ న్యూయార్క్‌లో ప్రసంగిస్తూ వారనాసి సంఘటన ప్రసావించారు. ఆ ఉదంతం నుంచి దేన్నయినా ధైర్యంగా ఎదుర్కోవాలనే పాఠం నేర్చుకున్నాను. సమస్యలను చూసి పారిపోకుండా నిర్భయముగా నిలిస్తే ఎంతటి భయానక పరిస్థితులైనా చక్క బడతాయి. జీవితంలో ఎదురయ్యే కష్టాలు ఆ కోతుల్లాంటివే! మనం భయపడితే, అవి భయపెడతాయి. ఎదురుతిరిగితే అవే పారిపోతాయి. పిరికివాళ్లకు పిల్లి కూడా పులిలాగే కనిపిస్తుంది. ధీశాలులు పులిని చూసినా భయపడరు. వాళ్లను ఏ అవాంతరాలూ అడ్డుకోలేవు. ధైర్యమే ఆయుధమౌతుంది అంటూ ఉద్ఘాటించారు. □



# కొల్హాపురీ గుడ్డుకూర

**గుడ్లతో ఆమ్లెట్**, ఇగురు, పులుసు, బుర్జీ ఇలా ఎన్నో రకాలుగారుచికరమైంది, ఎంతో ప్రసిద్ధి పొందింది కొల్హాపురీ ఎగ్ కర్రీ. మహా ఇది ప్రసిద్ధం. కొల్హాపురీ మసాలాతో చేసే ఈ కూర వేరే లెవెల్లో ఉంటుంది.

కావలసినవి: గుడ్లు 6, ఉల్లితరుగు కప్పున్నర, టొమాటో ముక్కలు పేస్ట్, కొల్హాపురి మసాలా, ధనియాల పొడి, కారం చెంచా చొప్పున, ప పొడి, ఆవాలు, మెంతులు పావు చెంచా చొప్పున, నూనె 2 టేబుల్ తగినంత, కొత్తిమీర తరుగు పావు కప్పు

**తయారీ:** ముందుగా గుడ్లను ఉడకబెట్టి సిద్ధంగా ఉంచాలి. ప్యాన్‌లో నూనె వేయాలి. అవి చిటపటలాడుతున్నప్పుడు.. జీలకర్ర, మెంతులు.. ఉల్లిపా ఉల్లితరుగు బంగారురంగులోకి మారాక.. అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి నిమిషం వేయించాలి. టొమాటో ముక్కలు కలపాలి. అవి మెత్తగా అయ్యాక.. కొన్ని నీళ్ల, ధనియాల పొడి, కారం, పసుపు, జీలకర్ర పొడి జోడించి కలపాలి. నాలుగైదు నిమిషా తర్వాత ఉడికించిన గుడ్లకు మధ్యలో గాటుపెట్టి వేయాలి. ఓసారి రుచి చూసి కారం, ఉప్పు తగ్గితే ఇంకొంచెం వేసి.. సన్న సెగ మీద ఇంకో రెండు నిమిషాలు ఉడక నివ్వాలి. వేసి కలియబెట్టి దించాలి. అంతే.. అదిరి పోయే కొల్హాపురీ గుడ్డు కూర సిద్ధమైనట్లై. □



# ఒత్తిడి తట్టుకోలేకపోతున్న బ్యాటర్లు




## ఇంగ్లండ్ నాల్గో టెస్ట్‌కు రిషబ్, బుమ్రా దూరం

**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్ సిరీస్‌లో టీమిండియా బ్యాటర్లు పేలవ ప్రదర్శనతో వరుస వైఫల్యాలు చవిచూస్తున్నారు. ఇండియా వర్సెస్ ఇంగ్లండ్ మధ్య ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా లార్డ్స్ వేదికగా జరిగిన మూడో టెస్టులో టీమిండియా ఓటమిపాలైంది. ఇంకా రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. నాల్గో టెస్టు మ్యాచ్ ఈ నెల 23 నుంచి ప్రారంభమవుతుంది. ఈ టెస్టు మ్యాచ్‌కు భారత్ జట్టుకు చెందిన కీలక ప్లేయర్లలో మార్పులు జరుగనున్నాయి. టీమిండియా వికెట్ కీపర్, బ్యాటర్ రిషబ్ పంత్, స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాను మార్చే అలోచన జరుగుతోంది. మూడో టెస్టులో ప్లేయర్ల వైఫల్యంపై బోర్డు పోస్ట్‌మార్టం చేస్తోంది. ఇంగ్లండ్ నిర్దేశించిన 193 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్ బ్యాటర్లు ఒత్తిడి తట్టుకోలేక తడబడుతూ వరుస వికెట్లు సమర్పించుకుని ఓటమి పాలయ్యారు. ముఖ్యంగా యశస్వి జైస్వాల్, శుభమన్ గిల్, ఆకాష్ దీప్, రిషభ్ పంత్, వాషింగ్టన్ సుందర్ వంటి కీలక ఆటగాళ్లు ఛేజింగ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. భారత్ రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన యశస్వి జైస్వాల్ (0) ఏడు బంతుల్లో డకౌట్ అవ్వడం టీమ్ ఇండియాకు భారీ ఎదురుదెబ్బ. ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో ఆర్చర్ బౌన్సర్‌కు పెవిలియన్ చేరాడు. ఈ సిరీస్‌లో జైస్వాల్ కీలక ఛేజింగ్‌లో అతను పూర్తిగా నిరాశపరిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో 13 పరుగులు చేసిన జైస్వాల్, రెండో ఇన్నింగ్స్‌లో ఖాతా తెరవలేకపోయాడు. కెప్టెన్ శుభమన్ గిల్ (6) కూడా తక్కువ స్కోరుకే అవుట్ అయిపోవడం ఆందోళన కలిగించింది. బ్రిడాన్ కార్స్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగిన గిల్, కెప్టెన్‌గా జట్టుకు కావాల్సిన స్థిరత్వాన్ని ఇవ్వలేకపోయాడు. ఈ సిరీస్‌లో గిల్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నప్పటికీ, ఈ కీలక ఛేజింగ్‌లో అతను విఫలం కావడం జట్టును ఒత్తిడిలోకి నెట్టింది. ఆకాష్ దీప్ నిష్క్రమణతో పెరిగిన ఒత్తిడి నైట్ వాచ్‌మన్‌గా క్రీజులోకి వచ్చిన ఆకాష్ దీప్ (1) కూడా ఎక్కువసేపు నిలబడలేకపోయాడు. బెన్ స్టోక్స్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ కావడంతో భారత్ కష్టాల్లో పడింది. ఆకాష్ దీప్ బౌలింగ్‌లో హ్యారీ బ్రూక్‌ను అవుట్ చేసి అద్భుతంగా రాణించినప్పటికీ, బ్యాటింగ్‌లో అతను తనవంతు సహకారం అందించలేకపోయాడు. ఇక తొలి ఇన్నింగ్స్‌లో 74 పరుగులతో మెరిసిన రిషభ్ పంత్, జట్టును ఆదుకున్నప్పటికీ, కీలకమైన నాలుగో ఇన్నింగ్స్ ఛేజింగ్‌లో కేవలం 9 పరుగులే చేసి, పెవిలియన్ చేరాడు. పంత్ నుంచి మ్యాచ్ గెలిపించే ఇన్నింగ్స్ ఆశించారు. గబ్బాలో ఆస్ట్రేలియాపై విజయాన్ని అందించిన విధంగా ఇక్కడ కూడా పంత్ తనదైన శైలిలో దూకుడుగా ఆడితే విజయం సాధ్యమని భావించినా నిరాశే మిగిల్చాడు.






## మహిళల ప్రపంచ కప్..
# ఫైనల్స్‌కు హారిక, వైశాలి

**న్యూఢిల్లీ:** మహిళల ప్రపంచ కప్-2025లో భారత్‌కు చెందిన ద్రోణవల్లి హారిక మరియు ఆర్ వైశాలి కఠినమైన టైబ్రేక్‌ల ద్వారా పోరాడి 16వ రౌండ్‌కు చేరుకున్నారు, ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో స్వదేశీయులైన కోనేరు హంపి మరియు దివ్య దేశ్‌ముఖ్‌లతో చేరారు. అయితే, కాటెరినా లగ్నోతో జరిగిన హోరాహోరీ మ్యాచ్ తర్వాత వంటికా అగర్వాల్ ప్రచారం నిరాశాజనకంగా ముగిసింది. అమెరికాకు చెందిన కారిస్సా యిప్‌పై వైశాలి అద్భుతమైన స్థితిస్థాపకతను ప్రదర్శించింది. క్లాసికల్ గేమ్స్ మరియు ప్రారంభ రాపిడ్ టైబ్రేక్‌లు డ్రాగా ముగియడంతో, వైశాలి 10+10 రాపిడ్ గేమ్‌లను గెలుచుకుని 4-2 తేడాతో మొత్తం విజయాన్ని నమోదు చేసింది. ఆమె తదుపరి కజకిస్తాన్‌కుచెందిన మెరుర్ట్ కమలిడెనోవాతో తలపడనుంది, ఆమె డిఫెండింగ్ ఛాంపియన్ అలెగ్జాండ్రా గోరియాచ్కినాను ఓడించడంద్వారా భారీ ఓటమిని చవి చూసింది. వైశాలి విజయానికి హారిక అద్దం పట్టింది, గ్రీకు ప్రత్యర్థి స్టావ్రౌలా సోలాకిడౌను టైబ్రేకర్లలో 4-2 స్కోరుతో ఓడించింది. ఆమె తదుపరి సవాలు లాగ్నో, వంటికాను ఓడించి ముందుకు సాగింది. లాగ్నోతో జరిగిన తన తొలి క్లాసికల్‌గేమ్‌లో విజయంతో వంటిక ఆశలు రేకెత్తించింది, కానీ పట్టు విడుచుకోలేకపోయింది. రష్యన్ గ్రాండ్‌మాస్టర్ తిరిగి పుంజుకుని మ్యాచ్‌ను సమం చేసినా చివరికి 10+10 రాపిడ్ టైబ్రేకర్‌లో వంటికను ఓడించింది. ఇంతలో, దివ్య దేశ్‌ముఖ్ తన ప్రీక్వార్టర్ ఫైనల్ పోరులో చైనాకు చెందిన రెండవ సీడ్ జు జినర్‌తో తలపడనుండగా, కోనేరు హంపి స్విస్ గ్రాండ్ మాస్టర్ అలెగ్జాండ్రా కోస్టెనిక్‌తో తలపడనుంది.

## జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్..
## తొలి రౌండ్‌లో నిష్క్రమించిన
# రుతపర్ణ, శ్వేతపర్ణ



**న్యూఢిల్లీ:** జపాన్ ఓపెన్ సూపర్ 750లో ఒడిశాకు చెందిన పాండా సోదరీమణులు రుతపర్ణ మరియు శ్వేతపర్ణ మహిళల డబుల్స్ ఓపెనింగ్ రౌండ్‌లోనే ఓడిపోయారు. టోక్యోలో మంగళవారం జరిగిన భారత ద్వయం జపాన్‌కు చెందిన కొకోనా ఇషికావా, మైకో కవాజో చేతిలో 30 నిమిషాల వ్యవధిలో 13-21, 7-21 తేడాతో ఓడిపోయింది. టోర్నమెంట్ ప్రారంభ రోజున బరిలోకి దిగిన ఏకైక భారతీయులు శ్వేతపర్ణ మరియు రుతపర్ణ, జనవరిలో జరిగిన 2025 ఇండియా ఓపెన్ సూపర్ 750 తర్వాత వారి మొదటి మ్యాచ్‌లో జపాన్ ప్రత్యర్థులతో పోటీ పడలేకపోయారు. భారత షట్లర్లు బుధవారం ఎనిమిది మ్యాచ్‌లలో తలపడనున్నారు. ఇక పురుషుల సింగిల్స్‌లో లక్ష ్యసేన్ చైనాకు చెందిన వాంగ్ జడ్ఎక్స్‌తో తలపడనుండగా, నలుగురు మహిళా సింగిల్స్ క్రీడాకారిణులు పివి సింధు, ఉన్నతి హుడా, అనుపమ ఉపాధ్యాయ, రక్షి త రామ్‌రాజ్ బరిలోకి దిగుతారు. పురుషుల డబుల్స్‌జోడీ సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి మరియు చిరాగ్ శెట్టి, మరియు హరిహరన్ అంసకరుణన్‌రూబన్ కుమార్‌కూడా మహిళల డబుల్స్‌లో కవి ప్రియ సెల్వం సిమ్రాన్ సింఘితో కలిసి తమ ప్రచారాన్ని

# నేషనల్ రగ్బీ ఛాంపియన్‌గా బీహార్




**న్యూఢిల్లీ:** జూనియర్ నేషనల్ రగ్బీ ఛాంపియన్‌షిప్-2025లో ఉత్కంఠభరితమైన ఫైనల్‌లో డిఫెండింగ్ ఛాంపియన్స్ ఒడిశాను ఓడించి, బీహార్ అండర్ 18 బాలుర జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ఇప్పటికే ఈ వారం ప్రారంభంలో బాలికల అండర్ 18 కిరీటాన్ని కూడా బీహార్ కైవసం చేసుకోవడం విశేషం. అత్యంత నిలకడగా ఆడిన రెండు జూనియర్ రగ్బీ జట్లు పాల్గొన్న ఈ ఫైనల్ పోటీకి సరైన క్లైమాక్స్. గోల్డాన్ కుమార్ ఒక ట్రై మరియు కన్వర్షన్‌తో బీహార్ తరపున గోల్ చేయడం ప్రారంభించాడు, కానీ ఒడిశా మంటుడు, సుబాష్ హన్స్‌దా, ఈశ్వర్ పూజారి చేసిన ప్రయత్నాల ద్వారా తిరిగి విజయం సాధించి తిరుగులేని ఆధిక్యాన్ని సంపాదించింది. బీహార్ తరపున సన్నీ కుమార్ ఒక గోల్ చేయడంతో గోల్డాన్ మరోసారి సత్తా చాటాడు.

చివరి క్షణాల్లో విజయ ప్రయత్నం చేసి 17-15 తేడాతో టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు.

కాగా ఈ ఏడాది ప్రారంభంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ బాలుర ఫైనల్‌లో ఒడిశాను (14-12) ఓడించిన బీహార్, మరోసారి అత్యంత ముఖ్యమైన సమయంలో ఆధిక్యంలో ఉంది. గ్రూప్ దశలో చండీగఢ్ (49-0) మరియు హర్యానా (62-0) పై విజయాలు, పంజాబ్ పై 29-0 రౌండ్ ఆఫ్ 16, పశ్చిమ బెంగాల్ పై 39-0 క్వార్టర్ ఫైనల్, మరియు మహారాష్ట్రపై 10-5 సెమీఫైనల్ విజయాలతో వరుస గెలుపులు సాధించింది. ఫైనల్‌కు ముందు, ఉత్కంఠభరితమైన మూడవ స్థానం కోసం జరిగిన ప్లే ఆఫ్‌లో మహారాష్ట్ర ఢిల్లీని ఓడించి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. అథర్వ్ పాల్కర్ చేసిన ట్రై మరియు కన్వర్షన్ మహారాష్ట్రను ప్రారంభంలోనే నియంత్రణలోకి తెచ్చింది, కానీ జావేద్ ఖాన్ మరియు పుష్పెందర్ ఢిల్లీ తరపున ట్రై మరియు ట్రైకన్వర్షన్ కాంబోతో స్కోరును తిప్పికొట్టారు. ఇక రెండవ అర్ధభాగం చివరిలో మ్యాచ్ సమంగా ఉండటంతో, సౌరభ్ సంజయ్ రాజ్‌పుత్ ఒక ట్రై చేసి దానిని సమం చేశాడు, ఆ తర్వాత గోల్డెన్ ట్రైతో మ్యాచ్‌ను మరియు పోడియం స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఢిల్లీకి, 2024లో 7వ స్థానంలో నిలిచిన తర్వాత, జూనియర్ రగ్బీలో పురోగతితో నాల్గవ స్థానం చేరింది.

## కాంటినెంటల్ టూర్.. లాంగ్‌జంప్‌లో
# సోజన్‌కు కాంస్యం



**న్యూఢిల్లీ:** వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ కాంస్య (కేటగిరీ-సి) ఈవెంట్ అయిన లిగ్నానో మీటింగ్‌లో మహిళల లాంగ్ జంప్‌లో యాన్సీ సోజన్ మూడవ స్థానంలో నిలిచింది. ఇటలీలో జరిగిన ఈ పోటీలో ఆమె ఆరు జంప్‌లలో ఐదు 6.15 మీటర్ల మార్కును దాటాయి. నాల్గవ ప్రయత్నంలో 6.36 మీటర్ల జంప్ చేసి స్థిరత్వాన్ని ప్రదర్శించింది. ఆమె 6.26 మీటర్లు (మొదటి ప్రయత్నం), 6.35 మీటర్లు (రెండవ ప్రయత్నం), 6.19 మీటర్లు (మూడవ ప్రయత్నం), 6.36 మీటర్లు (నాల్గవ ప్రయత్నం), 6.18 మీటర్లు (ఐదవ ప్రయత్నం), మరియు 6.11 మీటర్లు (చివరి ప్రయత్నం) దూకింది. ఆస్ట్రేలియాకు చెందిన డెల్టా అమిడ్జోవ్స్కీ కేవలం రెండు చెల్లుబాటు అయ్యే ప్రయత్నాలను మాత్రమే నమోదు చేసినప్పటికీ 6.47 మీటర్లతో స్వర్ణం గెలుచుకుంది. అలాగే దక్షిణాఫ్రికాకు చెందిన డేనియల్ నోర్టే 6.44 మీటర్లతో రజతం గెలుచుకుంది. ఆమె అత్యుత్తమ ప్రదర్శన ఆమె సీజన్‌లో అత్యుత్తమ ప్రదర్శన అయిన 6.54 మీటర్ల కంటే చాలా తక్కువ, ఈ సంవత్సరం మే ప్రారంభంలో ఆమె నమోదుచేసింది. అయితే, 2025 యూరోపియన్ లెగ్‌లో స్పెయిన్‌లో ఆమె 6.21 మీటర్లు దూకినప్పటి నుండి యాన్సీ ఈ జంప్ గణనీయమైన మెరుగుదలను సూచిస్తుంది. గత ఏడాది సెప్టెంబర్‌లో బెంగళూరులోని శ్రీకంఠీరవ స్టేడియంలో ఆమె నమోదు చేసిన 6.71 మీటర్ల వ్యక్తిగత అత్యుత్తమ రికార్డుకూడాఉంది. దీంతో 2025 ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లకు అర్హత ర్యాంకింగ్స్‌లో, రోడ్ టు టోక్యో 25లో యాన్సీ ప్రస్తుతం చివరి స్థానంలో ఉంది.

# భారత్ మార్కెట్‌కు వియత్నాం కార్లు



**ముంబై, జులై 15:** దేశీయ కార్ల మార్కెట్‌లోకి విదేశీ కార్ల కంపెనీలు క్యూ కడుతున్నాయి. ఎన్నోఏళ్ల ఎదురుచూపుల తర్వాత అమెరికాకు చెందిన టెస్లాదేశంలోకి మంగళవారం ఎంట్రీ ఇచ్చింది. ముంబయిలో తొలి కార్ల షోరూమ్‌ను ప్రారంభించింది. అదేరోజున మరో విదేశీ కంపెనీ తన ప్రణాళికలను ప్రారంభించింది. వియత్నాంకు చెందిన విన్‌ఫాస్ట్ సంస్థ తన వీఎఫ్6, వీఎఫ్7 మోడళ్ల ప్రీ బుకింగ్‌ను వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెచ్చింది. ఆగస్టులో వీటిని లాంచ్ చేయబోతోంది. దేశంలోకి ఎంట్రీ ఇచ్చిన రోజే.. మరో విదేశీ కంపెనీ నుంచి టెస్లా ఎదుర్కోవడం గమనా ర్హం. ముంబయిలో తొలి షోరూమ్‌ను ప్రారంభించిన టెస్లా.. దేశీయంగా తొలుత మోడల్ ఈవీలను విక్రయించనుంది. ఇందులో బేస్ మోడల్ ధర రూ.60 లక్షల నుంచి ప్రారంభం అవు తుంది. లాంగ్ రేంజ్ మోడల్‌ధర రూ.68 లక్షలుగా నిర్ణయిం చింది. స్టాండర్డ్ వేరి యంట్ 60కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ కలిగిన కారు సింగిల్ ఛార్జింగ్‌తో 500 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. 75 కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ కలిగిన లాంగ్ రేంజ్ వేరియంట్ 622 కిలోమీటర్లు వెళుతుంది. ఈ ఏడాది మూడో త్రైమాసికం నుంచి డెలివరీలు ప్రారంభం కానున్నాయి. రూ.22 వేలు చెల్లించి రిజర్వేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈమొత్తం నాన్‌రిఫండబుల్. వియత్నాంకు చెందిన విన్‌ఫాస్ట్ ఆగస్టులో వీఎఫ్6,వీఎఫ్7 మోడళ్లను లాంచ్ చేయనుంది. రూ.21 వేలు చెల్లించి కంపెనీ వెబ్‌సైట్‌లో ప్రీ బుకింగ్ చేసుకోవచ్చు. ఈ మొత్తం రిఫండబుల్. టెస్లా తన కార్లను దిగుమతిచేసుకుంటుండగా..విన్‌ఫాస్ట్‌మాత్రం తమిళనాడులో 2 బిలియన్ డాలర్లు వెచ్చించి తయారీ ప్లాంట్‌ను నెలకొల్పుతోంది.

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జులై 15:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో పాటు దేశీయంగా రిటైల్ ద్రవ్యోల్బ ణం ఆరేళ్ల కనిష్ఠానికి చేరడం వంటి కారణాలు పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమయ్యాయి. దీంతో నాలుగు రోజుల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. ఆటో ఇండెక్స్ ఒకటిన్నర శాతం మేర లాభపడగా, ఫార్మా, హెల్త్ కేర్ సూచీలు ఒక శాతం మేర పెరిగాయి. సెన్సెక్స్ ఉదయం 82,233.16 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,253.46) స్వల్ప నష్టాల్లో ప్రారంభమయ్యాయి. కాసేపటి తర్వాత మళ్లీ లాభాల బాట పట్టిన సూచీ.. ఇంట్రాడేలో 82,743.62 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 317.45 పాయింట్ల లాభంతో 82,570.91 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 113.50 పాయింట్ల లాభంతో 25,195.80 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.82గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, బజాజ్ ఫిన్‌సర్వ్, టాటా మోటార్స్, ట్రెంట్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు రాణించాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎటర్నల్, టాటా స్టీల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 68.99 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3,374 డాలర్ల వద్ద కొనసాగింది.

## వాణిజ్యం
# ముంబైలో టెస్లా తొలి షోరూం




**ముంబై, జులై 15:** అమెరికాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా భారత్ మార్కెట్లోకి ప్రవేశించింది. మహారాష్ట్ర రాజధాని ముంబయిలో తొలి షోరూంను మంగళవారం ప్రారంభించింది. బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని మార్కర్ మ్యాక్సిటీ మాల్‌లో దానిని తెరిచింది. ఈ షోరూం ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ హాజరయ్యారు. ఈ సంస్థకు వెల్‌కమ్ చెప్పారు. భారత్‌లో ఈ ఎలక్ట్రిక్ కార్ల తయారీకి సంబంధించిన భవిష్యత్ ప్రణాళికలపై ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మోడల్ వై కారును సంస్థ ఆవిష్కరించింది. తొలుత మోడల్ ఈవీలను టెస్లా భారత్ మార్కెట్లో విక్రయించనుంది. ఇక్కడ ఆర్‌డబ్ల్యూడీ వెర్షన్ (బేస్) మోడల్ వై ధర రూ.61.07 లక్షలుగా (ఆన్‌రోడ్) నిర్ణయిం చింది. లాంగ్‌రేంజ్ వెర్షన్‌ధర రూ.69.15 లక్షలుగా ఉంది. బేస్ మోడల్ ధర అమెరికాలో 44,990 డాలర్లు (రూ.38.63 లక్షలు), చైనాలో 2,63,500 యువాన్లు (రూ.31.57లక్షలు) జర్మనీలో 45,970 యూరోలు (రూ.46.09లక్షలు)గా ఉంది. దిగుమతి సుంకాలు, రవాణా ఖర్చుల కారణంగా భారత్‌లో దీని ధర ఎక్కు వగా ఉంది. కొన్నిరోజుల క్రితం భారత రోడ్లపై మోడల్‌ను పరీక్షి ంచిన సంగతి తెలిసిందే. ముంబయి-పుణె జాతీయ రహదారిపై ఈ వాహనం దర్శనమివ్వడం చూపరులను ఆకర్షించింది. ఇది పూర్తిగా అప్‌డేట్ అయిన మోడల్ కారుగా నిపుణులు గుర్తించారు. దీని కోడ్‌నేమ్ జునిపెర్. సాధారణ మోడల్ కంటే దీనిలో ఎక్కువ ఫీచర్లు ఉంటాయి. అమెరికా, కెనడా మార్కెట్లలో వీటిని విక్రయిస్తున్నారు. దీని సీ షేప్‌లోని ఎల్ఈడీ లైట్లు, ట్విన్ స్పోక్ అలాయ్ వీల్స్, టెస్లా ప్రత్యేకతను తెలిపే గ్లాస్ రూఫ్ ఉన్నాయి. ఇది భారత్‌లో ఆరు రంగుల్లో లభించవచ్చని భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా మోడల్ కారు ఆల్‌వీల్ డ్రైవ్‌గా లభి స్తోంది. వీటిల్లో లాంగ్ రేంజ్ బ్యాటరీ ప్రత్యేకత. ఒక్కసారి ఛార్జి చేస్తే 500600 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు. కేవలం 4.6 సెకన్లలో గంటకు 096 కిలోమీటర్ల వేగాన్ని అందుకొంటుంది. అత్యధికంగా గంటకు 200 కి.మీ. వేగంతో ప్రయాణించ గలదు. దీనిలో భారీ 15.4 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌ను అమర్చారు. వెనక సీట్లలోని ప్యాసింజర్ల కోసం 8 అంగుళాల ప్రత్యేకమైన స్క్రీన్ కూడా ఉంటుంది. అడాస్ ఫీచర్లు, వైర్‌లెస్ ఫోన్ ఛార్జింగ్ వంటి హంగులు ఇందులో కస్టమర్లకు లభించనున్నాయి. షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం దేవేంద్ర ఫడణవీస్ మాట్లాడుతూ, టెస్లా సరైన రాష్ట్రం, నగరాన్ని ఎంచుకుంది. ఈ కంపెనీ కార్ల డిజైన్, ఇన్నోవేషన్‌పై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి ఉంటుంది. 2015లో అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు తొలిసారి టెస్లా కారులో తిరిగాను అని ఫడణవీస్ మాట్లాడారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.